thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal
సంపుటి - 20 సంచిక - 201 కరీంనగర్ ఆదివారం, 28 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### రూ. 5 కోట్ల డ్రగ్స్ సరఫరా, మహిళ అరెస్ట్

ముంబై : రూ. 5 కోట్ల విలువైన డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఒక విదేశీ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీ నుండి ముంబైకి బస్సులో మాదకద్రవ్యాలను రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం ప్రకారం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ బృందం ఆ మహిళ ప్రయాణిస్తోన్న బస్సు వెంబడి కాపు కాచి చాకచక్యంగా పట్టుకున్నారు. సదరు నైజీరియన్ మహిళను ఆపి ఆమె సామాను తనిఖీ చేశారు. ఆమె లగేజీని పరిశీలించిన తర్వాత, అధికారులు స్ఫటికాకార పదార్థపు ప్యాకెట్, ఇంకా మాత్రలు కలిగిన ఫుడ్ ప్యాకెట్లు (ఓట్స్), జ్యూస్ టెట్రా ప్యాక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఫీల్డ్ టెస్ట్ కిట్‌ని ఉపయోగించి ల్యాబ్స్‌లో పరీక్షలు చేయగా ఆ ప్యాకెట్లలో 2.56 కిలోగ్రాముల మెథాంఫేటమిన్, 584 గ్రాముల ఎక్స్‌టసీ మాత్రలు ఉన్నట్టు నిర్ధారించారు. తదుపరి ఆపరేషన్‌లో సదరు సరుకును స్వీకరించాల్సిన వ్యక్తిని కూడా అరెస్టు చేశారు.

# నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

## మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం

## విద్యార్థులకు ప్రతి నెలా రూ.2 వేలు.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన




మేడ్చల్ : నేటి యుగంలో ఉద్యోగం కావాలంటే నైపుణ్యం తప్పనిసరి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన మేడ్చల్ జిల్లా మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించారు. టాటా టెక్నాలజీస్ వారి సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీలను వర్చువల్‌గా సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.


ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 2034 నాటికి ఇక ట్రిలియన్ డాలర్ల ఎకానమీ.. 2047కు మూడు మిలియన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరాలని ఆకాంక్షించారు. దేశంలో రెండున్న శాతంగా ఉన్న మనం 5 శాతం జీడీపీని దేశానికి అంద జేస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో 5 శాతం జీడీపీని 10 శాతానికి పెంచేందుకు తెలంగాణాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం దావోస్ పర్యటనలో భాగంగా అక్కడ టాటా టెక్నాలజీస్ సంస్థతో చర్చలు జరిపామని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు ఉన్నా.. యువతలో నైపుణ్యం లేదని విషయం తమ దృష్టి వచ్చిందని అన్నారు.

హైదరాబాద్ వచ్చాక చదువుతో పాటు విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు ఆలోచన చేశామని అన్నారు. మంత్రివర్గ భేటీలో చర్చించి ఐటఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటరలుగా మార్చామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి రూపాయి ఖర్చు లేకుండా మొత్తం టాటా సంస్థనే భరించిందని అన్నారు. ట్రైనింగ్ సెంటర్లలో శిక్షణ పొందిన 90 శాతం మందికి ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. త్వరలో మరో 53 ఏటీసీలను పెడుతున్నాయని స్పష్టం చేశారు.

**ఉద్యోగాలు రాక వ్యసనాలు..** నైపుణ్యం లేకుండా ఇంజినీరింగ్ పట్టా ఉన్నా ఏమాత్రం ఉపయోగం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీల ఏర్పాటు మట్టిలో మాణిక్యాలను వెలికి తీస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ సర్కార్ యువతను పట్టించుకోకుండా గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు.

యువతలో నైపుణ్యం ఉంటే దేశాలన్నీ మన మందు మోకరిల్లుతాయని కామెంట్ చేశారు. తలరాతలు మారలంటే చదువు ఒక్కటే మార్గమని.. అదరికీ ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు.

**గంజాయి కేసులు పెరుగుతున్నాయి..** స్కిలు లేకపోవడంతో యువతకు ఉద్యోగాలు రాక చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని, గంజాయి కేసులు పెరుగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గంజాయ అలవాటు నుంచి అమ్మకందారులుగా మారుతున్నారని తెలిపారు. ఒకప్పుడు ఐటీఐలో చదివితే అప్రెంటీస్‌గా తీసుకునే వారని అన్నారు. ఇక నుంచి యువతను ఆర్టీసీలో అప్రెంటీస్‌లుగా తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. వచ్చే ఏడాది నుంచి ప్రతి ఏటీసీ విద్యార్థికి స్కాలర్‌షిప్ అందిస్తామని.. ట్రైనింగ్ తీసుకునే విద్యార్థికి ప్రతినెలా రూ. 2 వేలు ఇస్తాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.




హైదరాబాద్, సెప్టెంబరు 27 : తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా శివధర్ రెడ్డిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా డీజీపీగా అవకాశం ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వానికి శివధర్ రెడ్డి ధన్యవా దాలు తెలిపారు. ఇవాళ శివధర్ రెడ్డి మాట్లాడా రు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సమర్థవం తంగా నిర్వహిస్తానని ఉద్ఘాటించారు. ఇంటెలిజె న్స్‌లో ఎస్పీ స్థాయి నుంచి డీజీ స్థాయి దాకా పనిచేశానని.. తెలంగాణ రాష్ట్రంపై తనకు పూర్తి అవగాహన ఉందని వ్యాఖ్యానించారు. పోలీస్ విభాగంలో అందరూ బాధ్యతాయుతంగా పనిచే యాలని సూచించారు డీజీపీ శివధర్ రెడ్డి. డ్రగ్స్ పై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే చాలా చర్యలు తీసుకుందని.. ఈగల్ టీం కూడా చాలా స్ట్రాం గ్‌గా పనిచేస్తోందని నొక్కిచెప్పారు. డ్రగ్స్ ఒక మహమ్మారి లాగా మారిందని.. ఒక పోలీసు తోనే దీన్ని నిర్మూలన కాదని.. ప్రజల నుంచి కూడా పెద్దఎత్తున సహకారం కావాలని తెలిపా రు. సైబర్ క్రైమ్ సెక్యూరిటీలో తెలంగాణ అగ్ర స్థానంలో ఉందని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ మోసాలు, సైబర్ సెక్యూరిటీ సమస్య దేశం మొత్తం పెద్ద సమస్యగా మారిందని చెప్పుకొ చ్చారు. మన దగ్గర ఉన్నటువంటి సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో నేరాలను చాలావరకు అరికడుతున్నామని వెల్లడించారు డీజీపీ శివధర్ రెడ్డి. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు మావోయిజాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నా యని చెప్పుకొచ్చారు. ప్రజల పక్షానే తాము ఉంటామని.. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ చేసుకుంటూ ముందుకు వెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని అన్నారు. సైబర్ నేరాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కృషి చేస్తోందని వెల్లడించారు. ప్రజలకు, పోలీసులకు మధ్య సంబంధాలను పెంపొందించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తామని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.



## స్థానిక ఎన్నికల్ని వాయిదా వేయండి

### తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్ల పెంపుపై చట్ట ప్రకారమే ప్రభుత్వం ముందుకెళ్లాలని హైకోర్టు ఆదేశించింది. గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్?లో ఉన్నప్పుడు జీవో ఇవ్వడం సరికాదని వ్యాఖ్యానించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అంటూ రెడ్డి జాగృతి మాధవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభినందన్, జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున సీనియర్ లాయర్లు చిక్కుడు ప్రభాకర్, మయూర్ రెడ్డి వాదనలు వినిపించగా ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్ రెడ్డి ఆన్ లైన్?లో వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు జీవో ఇవ్వడం సరికాదని, అవసరమైతే స్థానిక ఎన్నికలు వాయిదా వేసుకోండి అని వ్యాఖ్యానించింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగా విచారిస్తామని స్పష్టం చేసింది. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వం తరపు నిర్ణయం చెప్పాలని ఏజీని ఆదేశించిస్తూ తదుపరి విచారణ అక్టోబర్ 8కి వాయిదా వేసింది.




## హైదరాబాద్ ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణలో నూతన టూరిజం పాలసీ తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన వరల్డ్ టూరిజం డే మొదటి కాంక్లేవ్‌లో సీఎం పాల్గొని ప్రసంగించారు. "గోల్కొండ, రామోజీ ఫిల్మ్‌సిటీ వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. ఎకో, మెడికల్, హెల్త్ టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించాం.

హైదరాబాద్ ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ.. హైదరాబాద్‌లో ప్రపంచ సుందరీమణుల పోటీలు నిర్వహించి.. ఇది అత్యంత సురక్షితమైన నగరమని నిరూపించాం.

హైదరాబాద్‌లో రక్షణ, శాంతిభద్రతల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. శాంతిభద్రతల విషయంలో దేశంలోనే హైదరాబాద్‌కు మొదటి స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచ ప్రఖ్యాత నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. మీకు అండగా ఉండటంతో పాటు, లాభాలను అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది" అని సీఎం అన్నారు.

**తెలంగాణ అద్భుతమైన రాష్ట్రం: భట్టి విక్రమార్క...** ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు." తెలంగాణ అద్భుతమైన రాష్ట్రం. రెండు జీవనదుల మధ్య ఉన్న దక్కన్ పీఠభూమి. గలగలపారే జీవనదులు, ఎత్తైన కొండలు, ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలతో కూడిన అటవీ ప్రాంతం. పర్యాటకులకు తెలంగాణ పరిసర ప్రాంతాలు స్వర్గసీమ లాంటివి. పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్న రాష్ట్రమిది. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారత రాష్ట్రసమితి టూరిజంపై దృష్టి సారించకుండా, ఈ రాష్ట్ర ఔన్నత్యాన్ని ప్రపంచపటం మీదకు తీసుకెళ్లకుండా, పర్యాటకులను ఆకర్షించకుండా గాలికి వదిలేసింది" అని భట్టి విక్రమార్క విమర్శించారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పెట్టుబడులు పెట్టండి

## వరల్డ్ ఫుడ్ ఇండియా 2025 సమావేశం వేదిక నుండి

## ప్రపంచ కంపెనీలకు మోడీ పిలుపు




దిల్లీ : దేశ ఆహార ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ప్రపంచ కంపెనీలను... ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానించారు. పంటల వైవిధ్యం, డిమాండ్ తో భారత్ ఆకర్షణీయ పెట్టుబడి కేంద్రంగా ఉందని వివరించారు.

గత దశాబ్ద కాలంలో ప్రొడక్షన్-లింక్డ్ స్కీమ్ లు, మెగా ఫుడ్ పార్కులతో ఈ రంగం 20 రెట్లు వృద్ధి చెంది, ఎగుమతులు రెట్టింపు అయ్యాయని మోదీ తెలిపారు. దిల్లీలో వరల్డ్ ఫుడ్ ఇండియా 2025సమావేశంలో పాల్గొన్న ఆయన, పర్యావరణ అనుకూల "బయో-డిగ్రేడబుల్ ప్యాకేజింగ్" లో.... పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆహార గొలుసు కంపెనీల కోసం భారత్ తలుపులు తెరిచి ఉంచిందని, సహకారానికి సిద్ధంగా ఉందని చెప్పారు.

25కోట్ల మంది పేదరికం నుంచి బయటపడి మధ్యతరగతి పరిధిలోకి వచ్చారని., వారు ఆహార అలవాట్లను నిర్దేశిస్తారని అన్నారు. బయోడిగ్రేడబుల్ ప్యాకేజింగ్ పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించామని, 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెడ్డుబడులను అనుమతిస్తున్నామని చెప్పారు. ఈ రంగంలోలక్ష కోట్ల విలువైన ఒప్పందాలు, 9 లక్షల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని కేంద్ర మంత్రి చిరాగ్ పసవాన్ తెలిపారు. 100 ఆహార పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

దేశ ఆహార ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ప్రపంచ కంపెనీలను... ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానించారు. పంటల వైవిధ్యం, డిమాండ్ తో భారత్ ఆకర్షణీయ పెట్టుబడి కేంద్రంగా ఉందని వివరించారు.

గత దశాబ్ద కాలంలో ప్రొడక్షన్-లింక్డ్ స్కీమ్ లు, మెగా ఫుడ్ పార్కులతో ఈ రంగం 20 రెట్లు వృద్ధి చెంది, ఎగుమతులు రెట్టింపు అయ్యాయని మోదీ తెలిపారు. దిల్లీలో వరల్డ్ ఫుడ్ ఇండియా 2025సమావేశంలో పాల్గొన్న ఆయన, పర్యావరణ అనుకూల "బయో-డిగ్రేడబుల్ ప్యాకేజింగ్" లో.... పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆహార గొలుసు కంపెనీల కోసం భారత్ తలుపులు తెరిచి ఉంచిందని, సహకారానికి సిద్ధంగా ఉందని చెప్పారు. 25కోట్ల మంది పేదరికం నుంచి బయటపడి మధ్యతరగతి పరిధిలోకి వచ్చారని., వారు ఆహార అలవాట్లను నిర్దేశిస్తారని అన్నారు. బయోడిగ్రేడబుల్ ప్యాకేజింగ్ పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించామని, 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెడ్డుబడులను అనుమతిస్తున్నామని చెప్పారు. ఈ రంగంలో లక్ష కోట్ల విలువైన ఒప్పందాలు, 9 లక్షల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని కేంద్ర మంత్రి చిరాగ్ పసవాన్ తెలిపారు. 100 ఆహార పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.




హైదరాబాద్: తెలంగాణలో 23 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ కమిషనర్‌గా సజ్జనార్‌ను.. హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్‌ను నియమించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా శిఖా గోయల్, ప్రస్తుతం సీఐడీ అదనపు డీజీగా ఉన్న చారుసిన్హాకు ఏసీబీ డీజీగా అదనపు బాధ్యతలు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా స్వాతిలక్రాకు అదనపు బాధ్యతలు, ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీగా విజయ్ కుమార్, ఫౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రటరీగా స్టీఫెన్ రవీంద్ర, గ్రేహౌండ్స్ ఆక్టోపస్ అదనపు డిజీగా అనిల్ కుమార్, మల్టీజోన్ 2 ఐజీగా డీఎస్ చౌహన్, విపత్తు నిర్వహణ, ఫైర్ డీజీగా విక్రమ్ సింగ్ మాన్, హైదరాబాద్ నేర విభాగ అదనపు సీపీగా శ్రీనివాసులు, హైదరాబాద్ లా అండ్ ఆర్డర్ జాయింట్ కమిషనర్‌గా తఫ్సీర్ ఇక్బాల్, సిద్దిపేట కమిషనర్‌గా ఎస్.ఎమ్ విజయ్ కుమార్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా సింధు శర్మ, నారాయణపేట ఎస్పీగా జి. వినీత్, ఎల్బీనగర్ డీసీపీగా బి. అనురాధ, ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా సీహెచ్ ప్రవీణ్ కుమార్, రాజేంద్రనగర్ డీసీపీగా యోగేష్ గౌతమ్, వెస్ట్ జోన్ డీసీపీగా సీహెచ్ శ్రీనివాస్, మాదాపూర్ డీసీపీగా రితు రాజ్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వైస్ ఛైర్మన్‌గా రవి గుప్తా.




సంగారెడ్డి, సెప్టెంబర్ 27: ఇరవై ఐదేళ్ల తర్వాత మంజీరా బ్యారేజ్‌కి ఆ స్థాయి వరద వచ్చిందని హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి చెప్పారు. సంగారెడ్డిలో ఆయన ఇవాళ(శనివారం) వరద పరిస్థితి మీద ప్రెస్ మీట్ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి వరద పరిస్థితులపై నిరంతరం సమీక్ష చేస్తున్నారని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో భారీ వర్షాలతో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లకు భారీగా వరద వచ్చిందని, ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో ఇన్ ఫ్లో తగ్గిందని ఆయన వెల్లడించారు. భారీ వరదకు సంగారెడ్డిలోని మంజీరా బ్యారేజ్ ఫిల్టర్ బెడ్ నీట మునిగిందని వాటర్ బోర్డ్ ఎండీ చెప్పారు. రెండ్రోజుల్లో మంజీరా ఫిల్టర్ బెడ్ ని బాగు చేస్తామన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై మరోసారి హైకోర్టుకు..

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై మరోసారి హైకోర్టును మాధవరెడ్డి ఆశ్రయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవోను సవాల్ చేస్తూ పిటిషన్ వేశారు. దీనిపై హౌజ్ మోషన్ పిటిషన్‌కు అనుమతి కోరారు. హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఇది ఉంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ నిన్న ప్రభుత్వం జీవో జారీ చేసింది. మూడు రోజుల క్రితమే ఈ రిజర్వేషన్లపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెం గారి మాధవరెడ్డి పిటిషన్ వేశారు. అయితే.. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా పిటిషన్‌ను విచారించలేమని కోర్టు స్పష్టం చేసింది. నిన్న జీవో విడుదల కావడంతో మరోసారి కోర్టును పిటిషనర్ ఆశ్రయించారు.



## తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం




హైదరాబాద్: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం నిర్వహించింది. ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదినీ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, అదనపు డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్, ఆర్థిక శాఖల ముఖ్యకార్యదర్శులు, ఎక్సైజ్ కమిషనర్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా త్వరలో మోగనుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల సన్నాహాల కోసం ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించింది.

## ఎన్నికల ముందు రజనీకాంత్.. తర్వాత గజినీకాంత్ .. రేవంత్‌పై హరీశ్‌రావు మాస్ సెటైర్లు



హైదరాబాద్, సెప్టెంబరు 27: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క బాండు పేపర్‌పై సంతకాలు పెట్టి ఎన్నికల హామీలు ఇచ్చారని.. కానీ ఎన్నికల హామీలపై ఇప్పుడెందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇవాళ(శనివారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు హరీశ్‌రావు. కాంగ్రెస్ బకాయి కార్డులను ఇంటింటికీ పంచుతామని చెప్పుకొచ్చారు. బాకీ కార్డు చూపించి ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ప్రభుత్వ ఉద్యోగులు, ఆటో కార్మికులు, వ్యవసాయ కార్మికులు సైతం మోసపోయారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి.. ఎన్నికల ముందు రజనీకాంత్.. ఎన్నికల తర్వాత గజినీకాంత్ మాదిరిగా మారిపోయారని ఎద్దేవా చేశారు హరీశ్‌రావు. రేవంత్.. చీఫ్ మినిస్టర్ కాదు.. రేవంత్ రెడ్డి కటింగ్ మాస్టర్ అని సెటైర్లు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులకు రిబ్బన్ కటింగ్ చేసే పనిలో రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నారని ఆక్షేపించారు. ఆరు గ్యారెంటీలపై తెలంగాణ అసెంబ్లీలో చర్చిదామంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిపోయారని దెప్పిపొడిచారు. మార్పు మార్పు అంటూ ప్రజలను రేవంత్‌రెడ్డి ఏమార్చారని విమర్శించారు. ఎన్నికల ముందు గల్లీ గల్లీ తిరిగిన గాంధీలు.. ఇప్పుడు ఎక్కడ..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజలు ప్రశ్నిస్తారని గాంధీలు హైదరాబాద్‌కు రాకుండా ముఖం చాటేశారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

## ప్రమాదకరస్థాయిలో మూసీ.. సహాయక చర్యలపై సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్: నగరంలో మూసీ ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో.. లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. మూసీ పరీవాహకంలో వరద పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అవసరమైన చోట పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి ఎంజీబీఎస్ బస్టాండ్ చుట్టూ నీళ్లు రావటంతో అక్కడున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు చేపట్టిన సహాయక చర్యలను సీఎం సమీక్షించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఎంజీబీఎస్‌కు వచ్చే బస్సులను ప్రత్యామ్నాయ రూట్లకు మళ్లించాలని సూచించారు. బతుకమ్మ, దసరా పండుగల వేళ వివిధ జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఆర్టీసీ విభాగం తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఇవాళ కూడా హైదరాబాద్‌లో భారీ వర్ష సూచన ఉన్నందున పోలీస్, ట్రాఫిక్, ?హైడ్రా, జీహెచ్‌ఎంసీ, విద్యుత్తు విభాగాలన్నీ అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో లోతట్టు ప్రాంతాలు, మూసీ ప్రమాదకరంగా ప్రవహించే ప్రాంతాల్లో అధికారులు ప్రజలను హెచ్చరించేలా బోర్డులు పెట్టాలని, అటు వైపు వాహనాలు, ప్రజలు వెళ్లకుండా దారి మళ్లించాలని పేర్కొన్నారు.




హైదరాబాద్: మూసీ నదికి వరద నీరు పోటెత్తుతోంది. దీంతో నగరంలోని మూసీ పరివాహక ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎంజీబీఎస్‌లోకి వరదనీరు చేరడంతో బస్టాండ్‌ను అధికారులు మూసివేశారు. శివాల్గట్ ఆలయంలో చిక్కుకున్న వారిని హైడ్రా సిబ్బంది క్రేన్ సాయంతో బయటకు తీసుకొచ్చారు. హైదరాబాద్‌లో మూసీ నదిలో చిక్కుకున్న ఓ యువకుడిని స్థానికుల సాయంతో హైడ్రా సిబ్బంది కాపాడారు. ఉప్పల్ రింగ్‌రోడ్డు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వరంగల్ వైపు వెళ్లే వాహనాలు బారులు తీరాయి. నాగోలు వంతెన వద్ద మూసీ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటి వరకు వాహనాల రాకపోకలు సజావుగా సాగుతున్నప్పటికీ.. ప్రవాహం పెరిగితే వాహనదారులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. కార్వాన్ మూసి తీరంలోని ప్రాచీన గణేష్ ఆలయంలోకి వరద నీరు ప్రవేశించింది. ఎమ్మెల్యే కౌసర్ ఆలయాన్ని పరిశీలించారు.




హైదరాబాద్: మూసీ నదికి భారీ వరద కారణంగా ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి వరద నీరు చేరింది. దీంతో ఇక్కడి నుంచి బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు.

ఈక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా ప్రయాణికులకు సూచనలిచ్చారు. ఈరోజు ప్రయాణికులు ఎంజీబీస్‌కు రావొద్దని అందులో పేర్కొన్నారు. "ఎంబీజీఎస్ నుంచి బయలుదేరే బస్సులను హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి సంస్థ నడుపుతోంది. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ వైపునకు వెళ్లే సర్వీసులు జేబీఎస్ నుంచి నడుస్తున్నాయి. వరంగల్, హనుమకొండ వైపునకు వెళ్లేవి ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి వెళ్తున్నాయి. సూర్యాపేట, నల్గొండ, విజయవాడ వైపునకు బస్సులు ఎల్బీనగర్ నుంచి నడుస్తున్నాయి. మహబూబ్‌నగర్, కర్నూలు, బెంగళూరు వైపునకు వెళ్లే సర్వీసులు ఆరాంఘర్ నుంచి వెళ్తున్నాయి. పొరపాటున ఎంజీబీఎస్‌కు ఎవరైనా ప్రయాణికులు వచ్చినా వారిని తరలించేందుకు అవసరమైనన్నీ లోకల్ బస్సులు అందుబాటులో ఉంచాం. వారిని ఆయా బోర్డింగ్ ప్రాంతాలకు లోకల్ బస్సుల్లో తరలించేందుకు సిద్ధంగా ఉన్నాం. వర్షాలు, వరద తగ్గుముఖం పట్టేవరకు ఎంజీబీఎస్‌కు ఎవరూ రావొద్దని విజ్ఞప్తి" అని తెలిపారు.

## వారి ఆగ్రహంతో రేవంత్, కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయం

హైదరాబాద్, సెప్టెంబర్ 27: వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి పోటీ చేయరంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈరోజు కేటీఆర్ సమక్షంలో కొడంగల్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు.. బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. సొంత నియోజకవర్గ ప్రజలు రేవంత్ రెడ్డిపై రగిలిపోతున్నారన్నారు. కాంగ్రెస్‌ను బొంద పెట్టడానికి స్థానిక సంస్థల ఎన్నికలు మంచి అవకాశమని వెల్లడించారు. కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ గెలవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు బంధు పథకాన్ని రేవంత్ బంద్ చేస్తారంటూ కామెంట్స్ చేశారు. రేవంత్ రెడ్డి గురించి అందరి కంటే ఎక్కువ కొడంగల్ ప్రజలకే తెలుసన్నారు.

**కొడంగల్‌కు తిరుపతి రెడ్డే సీఎం..** రాజకీయంగా జన్మనిచ్చిన కొడంగల్ భూములను.. తొండలు గుడ్లు పెట్టని భూములంటూ రేవంత్ అవమానించారని మండిపడ్డారు. 'కొడంగల్ రేవంత్ రెడ్డి జాగీరా.. కొడంగల్‌కు రేవంత్ చక్రవర్తి కాదు. కొడంగల్ ప్రజల ఆగ్రహంలో వచ్చే ఎన్నికల్లో రేవంత్, కాంగ్రెస్ పార్టీ కొట్టుకుపోతుంది. తెలంగాణకు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే.. కొడంగల్‌కు తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రి. వార్డు మెంబర్ కూడా కాని తిరుపతి రెడ్డికి.. కలెక్టర్, ఎస్పీ వంగి వంగి దండాలు పెడుతున్నారు. అన్నదమ్ములు జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులకు రేవంత్, తిరుపతి రెడ్డి రిబ్బన్ కట్ చేస్తున్నారు' అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.




**మూసీకి అన్ని కోట్లా..?...** కమీషన్ల కోసమే రేవంత్ మూసీ ప్రాజెక్టు చేస్తానంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. రూ. 16వేల కోట్లతో అయిపోయే దానికి లక్షా 50 వేల కోట్లు ఎందుకని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. ప్లాన్ ప్రకారమే ఎంజీబీఎస్ బస్టాండ్‌ను ముంచారని ఫైర్ అయ్యారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను భయపెట్టేందుకే ఒకేసారి 15 గేట్లు తెరిచారని అన్నారు. గతంలో ఎన్నడూ లేనిది ఇప్పుడే ఎందుకు ఎంజీబీఎస్ బస్టాండ్ మునిగిందని ప్రశ్నించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో పొంగులేటి, మెగా కృష్ణారెడ్డికి దోచి పెడుతున్నారని ఆరోపించారు. కొడంగల్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలవుతుందని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.


## మూసీ పరివాహక ప్రాంతాల్లో హైడ్రా సహాయక చర్యలు..

హైదరాబాద్, సెప్టెంబరు 27 : తెలంగాణతోపాటు హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వానలు దంచికొడుతుండటంతో మూసీ పరివాహక ప్రాంతాలకు వరద భారీగా పోటెత్తింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని జంట జలశయాల (హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్) గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు అధికారులు. నగరంలోని మహాత్మాగాంధీ బస్సు స్టేషన్‌కు వరద ప్రవాహం పోటెత్తడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇవాళ(శనివారం) మాట్లాడారు. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతాల్లో హైడ్రా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రిటర్నింగ్ వాల్ పడిపోవడంతో ఎంజీబీఎన్‌కు వరద పోటెత్తిందని చెప్పుకొచ్చారు. ఎంజీబీఎస్‌లో డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయని రంగనాథ్ తెలిపారు. ప్రస్తుతం ఎంజీబీఎస్‌లో వరద పరిస్థితి అదుపులోకి వచ్చిందని పేర్కొన్నారు. బాధితుల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. వరద తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. మూసీ పరివాహ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అప్రమత్తం చేశారు.




# భారత విప్లవోద్యమ నిర్మాత భగత్ సింగ్ - సెప్టెంబర్ 28... భగత్ సింగ్ జయంతి



ఆయన భారత స్వాతంత్ర్య సమర యోధుడు. కరుడుకట్టిన ఉద్యమ కారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలలో స్వాతంత్ర్య పిపాసను జాగృతం చేసిన చైతన్యశీలి. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చి, ప్రజల గుండెల్లో ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా విప్లవ జ్వాలల ను రగిలించిన విప్లవ మూర్తి. భారత స్వాతంత్ర్యో ద్యమములో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారులలో ఆయన ఒకడు. ఆయనే భరతమాత ముద్దుబిడ్డ, షహీద్ భగత్ సింగ్. భగత్ సింగ్ భగత్ సింగ్ (1907 సెప్టెంబరు 28 %-% 1931 మార్చి 23) పూర్వపు పంజాబ్‌లో, ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలోని సంధు ఝాట్ కుటుంబంలో సర్దార్ కిషన్ సింగ్ , విద్యావతి దంపతులకు జన్మించాడు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. భగత్ సింగ్ మూడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు తండ్రి కిషన్ సింగ్, భగత్ సింగ్‌ను చంకనెత్తుకొని, కొత్తగా వేస్తున్న తోటను చూడ్డానికి పొలాల్లోకి వెళ్ళాడు. వెంటనే కిందికి దిగిన భగత్ సింగ్ ఆ మట్టిలో ఆడు కుంటూనే చిన్న చిన్న గడ్డిపరకలను నాటడం మొదలు పెట్టాడు. తండ్రి "ఏం చేస్తున్నావ్ నాన్నా" అని ప్రశ్నిస్తే, భగత్ సింగ్ "తుపాకులు నాటుతున్నా" అని బదులిచ్చాడు. భవిష్యత్తుకు బాల్యం మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని యోచించడం ఆయన వ్యక్తిత్వానికి మచ్చుతునక. ప్రాథమిక విద్యను స్వగ్రామంలోనే పూర్తిచేసిన భగత్, ఉన్నత విద్యాభ్యాసం కొరకు లాహోర్ చేరాడు. అక్కడ లాలాలజపతి రాయ్, భాయ్ ప్రేమానంద్ వంటి అగ్రశ్రేణి స్వాతంత్ర్య సమరయోధులు బోధన చేస్తున్న 'నేషనల్ కాలేజ్' లో చదవడం భగత్ ను విప్లవకారుడిగా తీర్చి దిద్దాయి. 13 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణో ద్యమానికి సింగ్ ప్రభావితు డయ్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురు తిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీషు దిగుమతి దుస్తులను తగుల బెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాడు. భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమిస్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీతో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చనిపోయారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవ కారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొరపాటుగా స్కాట్ అనుకుని, జైగోపాల్ ఆయన్ను కాల్చుమంటూ సింగ్‌కు సంకేతా లిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. లాలా లజపత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928లో భారత్ లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చినందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. 'Warrant of Execution On Sentence Of Death' అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్ లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు. 1930 అక్టోబర్ 7 న న్యాయ స్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ ఇలా శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింహ్ 2. సుఖఃదేవ్ 3. రాజగురులకుబీ అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీలాల్ 2. మహావీర్ సింహ్ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ్ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయ దేవ్ కపూర్ 7. కమల్నాథ్ తివారిలకుబీ అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ ( 7 సంవత్సరాలు) 2. ప్రేమదత్ ( 5 సంవత్సరాలు)లకుబీ అలాగే అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్ లను విడిచి పెట్టారు. విచారణ లో ఉ న్నవారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్ లోని సెంట్రల్ జైలు లో వినిపించారు. తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయకుండా కాల్పుల బృందం చేత హతమార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్ సింగ్ , మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయన్ను ఉరితీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు. మార్చి 23న ఉరితీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు. సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరితీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని..సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు. భగత్ సింగ్ వీర మరణం వృథా కాలేదు, ఎందరో యువకులను భారత స్వాతంత్ర్యోద్యమము వైపుకు మరల్చింది. భగత్ సింగ్ మరణం భారత స్వాతంత్ర్యోద్యమ కొనసాగింపుకు సాయపడేలా వేలాది మంది యువకుల్లో స్ఫూర్తిని నింపింది. ఆయన ఉరి అనంతరం ఉత్తర భారతాన పలు ప్రాంతాల్లో బ్రిటీష్ ప్రభుత్వమునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# సాంస్కృతిక పునరుజ్జీవానికి అంకితమైన ఆదిరాజు -సెప్టెంబర్ 28...ఆదిరాజు వీరభద్రరావు వర్ధంతి



తెలంగాణలో విద్యావైజ్ఞానిక రంగాల అభివృద్ధికీ, సాంస్కృతిక పునరుజ్జీవనానికీ నిరంతరం కృషి చేసిన వైతాళికుడు, ప్రసిద్ధ రచయిత, చరిత్రకారుడు ఆదిరాజు వీరభద్రరావు. తెలంగాణ ప్రాంతపు చరిత్ర, సంస్కృతిపై విశేష పరిశోధన చేసిన గొప్ప బాషా శాస్త్రవేత్త. ఆయన సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ నిర్మాతగా, శాసన పరిశీలకునిగా, బాలవాఙ్మయ కర్తగా, ఉత్తమ అధ్యాపకునిగా, తెలంగాణ సాంస్కృతిక వికాస చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించు కున్నారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో గ్రంథాలయ అధికారిగా, కార్యదర్శిగా, అధ్యక్షునిగా పనిచేశారు. విజ్ఞాన చంద్రిక గ్రంథమాల కార్యాలయ ప్రముఖులుగా, ఆంధ్ర జనసంఘ కార్యవర్గ సభ్యులుగా, లక్ష్మణరాయ పరిశోధకమండలి కార్యదర్శిగా, ఆంధ్ర సారస్వతపరిషత్తు స్థాపక సభ్యులుగా, ఆంధ్ర చంద్రికా గ్రంథమాల ప్రధాన సంపాదకులుగా, విజ్ఞానవర్ధినీ పరిషత్తు సభ్యులుగా, సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ ప్రధాన సంగ్రాహకులుగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులుగా. బహుముఖ సేవలను అందించారు. ఆదిరాజు వీరభద్రరావు (16.11.1892 – 28.9.1973) 1892 నవంబర్ 16న ఖమ్మం జిల్లా దెందుకూరులో వెంకమ్మ, లింగయ్య పంతులకు జన్మించారు. తల్లి దండ్రులు చిరుప్రాయం లోనే మరణించగా, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం వ్యవ స్థాపకులైన రావిచెట్టు రంగారావు ఆదిరాజును చేరదీశారు. దాంతో హైదరా బాదులోని చాదర్‌ఘాట్ హైస్కూలులో మెట్రిక్ చదివారు. 1901లో కొత్తగా స్థాపించిన శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం నిర్వహణలో భాగస్వామ్యం వహించే అవకాశం వీరభద్రరావు లభించింది. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం గ్రంథాలయానికి తొలి గ్రంథపాలకులుగా ఆదిరాజు వీరభద్రరావు నియమితులయ్యారు. విఖ్యాత పరిశోధకులు కొమర్రాజు వెంకటలక్ష్మణ రావు హైదరా బాదులో 1905లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను స్థాపించారు. ఆదిరాజు దానిలో సహాయకునిగా చేరారు. స్థానిక అననుకూల పరిస్థితుల వల్ల కొమర్రాజు విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను 1908లో బ్రిటీషాంధ్ర రాజధాని మద్రాసు (నేటిచెన్నై)లు తరలించిన తరుణంలో, లక్ష్మణరావు విజ్ఞప్తి మేరకు వీరభద్రరావు కూడా మండలిలో పనిచేయటానికి మద్రాసు వెళ్ళారు. 1914 లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాల హైదరాబాదుకు మారడంతో ఆదిరాజు వారు తిరిగి హైదరాబాదుకు చేరుకున్నారు. 1914లో హైదరాబాదుకు తిరిగివచ్చి మహబూబ్ కళాశాలలో తెలుగు ఆచార్యునిగా నియమితులయ్యారు. ఆ తరువాత ధార్‌ఘాట్ ఉన్నత పాఠశాలలోనూ, నారాయణ గూడలోని బాలికోన్నత పాఠశాలలోనూ తెలుగు పండితులుగా పనిచేశారు. మర్రి చెన్నారెడ్డి ఇతని శిష్యులలో ప్రముఖుడు. 1914 నుండి 1921 దాకా చాదర్‌ఘాట్ హైస్కూలులో ఆతర్వాత 1949 నుండి 1953 దాక నారాయణ గూడ బాలికోన్నత పాఠశాలలో పనిచేశారు. ఆ తర్వాత సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశానికి ప్రధాన సంగ్రాహకులుగా వ్యవహరించారు. 1921లో తెలంగాణ సాహితీ సాంస్కృతిక సంస్థలైన ఆంధ్ర పరిశోధక మండలి స్థాపించి సభ్యుడు దానికి కార్యదర్శిగా పనిచేశారు. ఆ సంస్థ తెలంగాణ లోని పలు చారిత్రక ప్రదేశాలు, శిలా శాసనాలు, తాళపత్ర గ్రంథాలు సేకరించి "తెలంగాణ శాసనాలు" పేరిట పెద్ద గ్రంథాన్ని ప్రచురించటంలో ఆదిరాజు కృషి అసమానమైనది. ఆదిరాజు బాగా పేరు తెచ్చిన గ్రంథాల్లో ప్రాచీనాంధ్ర నగరములు , మన తెలంగాణ అనేవి ప్రధానమైనవి. అలంపురం, ఆనెగొంది, కళ్యాణి, కొండాపురం, కొలనుపాక, గోలకొండ,పానుగల్లు, ప్రతిష్ఠానం, బోనగిరి, రాచకొండ, వరంగల్లు, వేల్పుగొండ అనే ప్రసిద్ధ నగరాలకు సంబంధించిన పూర్వగాథలు, రాజులు, మంత్రులు, శిల్పులు, గాయకులు, కవుల జీవిత చారిత్రక విశేషాలతో పాటు భౌగోళిక, సాంఘిక ఆర్థిక మత విషయాలను, ఆ పట్టణాల పతన హేతువులను నిష్పక్షపాతంగా వివేచించి ఎన్నో అపూర్వ విషయాలను లోకానికి తెచ్చారు. నాణెములను గురించి, చరిత్ర పునర్నిర్మాణంలో వాటి పాత్ర గురించి వివరిస్తూ భారతదేశంలో అతి ప్రాచీన నాణేలు తొలిసారిగా తెలంగాణ ప్రాంతమైన కరీంనగర్ లో దొరికాయని, నాణేలు ముద్రించే టంకసాలలు సైతం తెలంగాణలో ఉండేవని ఒకటి కొండాపూర్‌లో, రెండవది కోటిలింగాలలో ఉండేదని చారిత్రకాధారాలతో నిరూపించారు. ఆదిరాజు ఆనాడు పేర్కొన్న కొన్ని తాళపత్రగ్రంథాలు – శ్రీకృష్ణ శతానందీయం, తాలాంక నందిని పరిణయం, దశరథరాజ నందినీ పరిణయం లాంటి కావ్యాల పండిత పరిష్కృతాలయి వెలుగులోకి వచ్చాయి. తెలంగాణకు సంబంధించిన వివిధ అంశాలను సత్య దృష్టితో పరిశీలిస్తూ వెలువరించిన గ్రంథం "మన తెలంగాణం". ఆదిరాజు వారికి బాగా పేరు తెచ్చిన మరో గ్రంథం "షితాబుఖాన్ లేక సీతాపతిరాజు" చరిత్ర. 68 గ్రీకు పురాణ దేవతలకు సంబంధించిన కథలను, హిందూ దేవతలతో పోల్చి బాలురకి అర్థమయ్యే రీతిలో సులభ వ్యావహారిక శైలిలో "గ్రీకు పురాణ కథలు" పేరుతో ప్రచురించారు. విద్యార్థుల కోసం రఘునాథ నాయకుడు, మార్కోపోలో, మీరాబాయి, శ్రీహర్షుల సంక్షిప్త జీవిత చరిత్రలు ప్రచురించారు. జానపద సాహిత్యం, గ్రామనామాలు, వ్యక్తి చరిత్రలు, శాసనాలు, చరిత్రలు, దర్శనీయ స్థలాలు, సంస్కృతి సంబంధాలు, ఆచార వ్యవహారాలు, సామెతల జాతీయాల వివరణ, మహబూబునగర్, మెదక్, నల్గొండ లాంటి వివిధ జిల్లాల స్వరూప స్వభావాల గురించిన వ్యాసాలు, ఎంతో ఎన్నో పరిశోధనాత్మక వ్యాసాలు, ప్రచురించారు. దక్కన్ రేడియోలో మొదటి సారి తెలుగులో ప్రసంగించిన వ్యక్తి ఆదిరాజు కావడం విశేషం. దాదాపు నూట యాభై రేడియో ప్రసంగాలు చేశారు. హైదరా బాదులో ఆ కాలంలో వెలసిన ప్రతీ సాహిత్య సాంస్కృతిక సంస్థకు వెన్నుదన్నుగా నిలిచిన ఆదిరాజు 1973 సెప్టెంబర్ 28న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# కృష్ణ పాత్ర ధారణలో పీసపాటికి రారెవరూ సాటి - సెప్టెంబర్ 28...పీసపాటి నరసింహ మూర్తి వర్ధంతి



పీసపాటి నరసింహమూర్తి (1920 జూలై 10 - 2007 సెప్టెంబర్ 28) పేరుపొందిన రంగస్థల నటులు. తెలుగు నాటక రంగంలో శ్రీకృష్ణ పాత్రదారిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించుకున్న గొప్ప నటుడు. పద్యగానంలో తనకంటూ ఒక ఒరవడిని సృష్టించుకున్న నటులు. పీసపాటి నరసింహమూర్తి, విజయనగరం జిల్లా బలిజిపేట మండలం, వంతరాం గ్రామంలో 1920, జూలై 10న జన్మించారు. ప్రారంభంలో ఆకాశవాణిలో పనిచేశారు. 1938లో రంగూన్‌రౌడీ నాటకంలో కృష్ణమూర్తి పాత్ర ద్వారా పీసపాటి నాటకరంగం లోకి అడుగు పెట్టారు. 1946లో పాండవోద్యోగ విజయాలు నాటకంలో మొదటి సారిగా శ్రీకృష్ణుడి పాత్ర ధరించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు రెండు పర్యాయాలు సంగీత నాటక అకాడమీలో సభ్యత్వం ఇచ్చి గౌరవించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం 1993లో ఆయనను కళాప్రపూర్ణ ఇచ్చి సత్కరించింది. దాదాపు ఏడు దశాబ్దాల పాటు వేలాది ప్రదర్శనలు ఇచ్చిన పీసపాటి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. తిరుపతి వేంకట కవులు, కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ వంటివారు ఎంతగానో అభినందించారు. ఎన్.టి.రామారావు పీసపాటి శ్రీకృష్ణ పాత్ర నటనను చూసి మెచ్చుకున్నారు. పాండవోద్యోగ విజయాలతో పాటు గౌతమ బుద్ధ, లవకుశ, తారా శశాంకం, చింతామణి లాంటి నాటకాలు అనేకం వేసినా, పీసపాటికి ఎనలేని కీర్తి కృష్ణుని పాత్ర వల్లే వచ్చింది. అత్యుత్తమ కృష్ణునిగా ఉద్యోగ విజయాల నాటక రచయితల్లో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి నుంచి అవార్డు అందుకోవడం, టంగుటూరి ప్రకాశం నటరాజు విగ్రహాన్ని బహుమతిగా ఇవ్వటం, బిలాస్‌పూర్లో తెలుగురాని ఒక బెంగాలీ జంట నాటకం చూసి, గ్రీన్ రూమ్‌లో ఇతనిని తనివితీరా ముద్దాడడం తన జీవితంలో మరపురాని సంఘటనలుగా పీసపాటి పేర్కొన్నారు. పద్య గానంలో పీసపాటి అనేక మార్పులు తీసుకు వచ్చారు. తెలుగు పౌరాణికాల్లో పద్యాలను సుదీర్ఘమైన రాగాలతో పాడడం అలవాటుగా ఉండేది. ఒక నిముషం పద్యానికి ఐదేసి నిముషాల రాగం తియ్యడం ఆనవాయితీగా ఉండేది. పీసపాటి ఆ పద్ధతిని విడనాడి, అనవసరమైన సాగతీతలను విసర్జించి, సాహిత్యానికి ఎక్కువ విలువ కల్పిస్తూ పద్యం పాడి ప్రజలను అలరించారు. పీసపాటి కృష్ణుడి వేష ధారణలో కూడా మార్పులు తీసుకు వచ్చారు. దేహానికి అంటిపెట్టుకుని ఉండే నీలపు రంగు చొక్కా ధరించి నిజంగా నీలపు కృష్ణుడేననే భ్రమ కల్పించారు. పీసపాటి 1987-1993 కాలంలో బొబ్బిలి మండలం, రాముడువలస గ్రామానికి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1995లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి ఆయనకు నాటక రంగంలో విశిష్ట పురస్కారం లభించింది. పీసపాటి నరసింహ మూర్తి 2007, సెప్టెంబర్ 28న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# విశ్వ నరుడు గుర్రం జాషువా - సెప్టెంబర్ 28... కవి కోకిల జయంతి



ఒక అంటరాని వాడు, పవిత్రమైన హిందూ గ్రంథాలు ,కావ్యాలు చదువు తున్నాడని ఇటు హిందూ ఛాందసులు కన్నెర్రజేస్తే, క్రైస్తవుడై వుండి హిందూ నాటకాలు రాసి హిందూ మత ప్రచారానికి తోడ్పడు తున్నాడని క్రైస్తవ మతాధిపతుల ఆగ్రహానికి గురైనాడు జాషువా. ఒక వంక దారిద్ర్యం, మరోవంక కుల మత వివక్ష. బాల్యంనుంచే జాషువా ఎన్నో అవమానాల్ని, అవ హేళనల్ని, ఛీత్కారాలను ఎదుర్కొన్నాడు. చిన్నతనం నుంచే తిరగబడే తత్వంతో వీటన్నింటినీ అధిగమించిన జాషువా, విద్యార్థి దశనుంచే వ్యంగ చిత్రాలు గీయడం, గొల్లసుద్దులు పాడుకోవడం, లలిత కళల పట్ల ఆసక్తి పెంచు కొన్నాడు. దీపాల పిచ్చయ్యశాస్త్రి, జూపూడి హనుమచ్ఛాస్త్రి వంటి కొందరు జాషువా ఉన్నతికి తోడ్పడితే, మరి కొందరు జాషువాను కులం పేరుతో తీవ్రంగా అవమానించారు. జీవితంలో ఎన్నోసార్లు, ఎన్నోచోట్ల జాషువా కులం తెలుసుకొని అవమానించినా, ఆవేదనకు లోనైనా, నిరుత్సాహ పడక, "కళకు కుల మతాలున్నాయా?" అని ప్రశ్నిస్తూ, ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని గొప్పకవిగా ఖ్యాతిని పొందారు. "విశ్వనరుడ నేను" అని సామాజిక వాస్తవికతను నిర్భయంగా చాటాడు. పుట్టుకతో దళితుడైనా, పట్టుదలతో కవిశేఖరుడై, నవయుగ కవిచక్రవర్తి, తమ కవితా ప్రతిభతో తెలుగు సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి జాషువా. ఆయన సమకాలీన కవిత్వ ఒరవడి యైన భావ కవిత్వపు రీతి నుండి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశాడు. జాషువా 1895, సెప్టెంబర్ 28 న గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు ఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించాడు. తండ్రి యాదవులు, తల్లి మాదిగ. మూఢాచారాలతో నిండిన నాటి సమాజంలో అవమానాలకు లోనైనాడు. అయినా జాషువా ఊరుకొనే వాడు కాదు, తిరగ బడేవాడు. అగ్రవర్ణాల పిల్లలు కులం పేరుతో హేళన చేస్తే, తిరగబడి వాళ్ళను కొట్టాడు. 1910లో మేరీని పెళ్ళి చేసు కున్నాడు. అయినా ఆయన కుటుంబాన్ని క్రైస్తవ సమాజం నుండి బహిష్కరించారు. మిషనరీ పాఠశాలలో నెలకు మూడు రూపాయల జీతంపై ఉద్యోగం చేసేవాడు. తర్వాత రాజమండ్రి వెళ్ళి 1915-16 లలో అక్కడ సినిమా వాచకుడిగా పని చేసాడు. టాకీ సినిమాలు లేని ఆ రోజుల్లో తెరపై జరుగుతున్న కథకు అనుగుణంగా నేపథ్యంలో కథను, సంభాషణలను చదువుతూ పోవడమే ఈ పని. తరువాత గుంటూరులోని లూథరన్ చర్చి నడుపుతున్న ఉపాధ్యాయ శిక్షణాలయంలో ఉపాధ్యాయుడిగా 10 సంవత్సరాల పాటు పనిచేసాడు. తరువాత 1928 నుండి 1942 వరకు గుంటూరు లోనే ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేసాడు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా కూడా పనిచేసాడు. 1957-59 మధ్య కాలంలో మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగా పని చేసాడు. చిన్నతనం నుండి జాషువాలో సృజనాత్మక శక్తి ఉండేది. బాల్య స్నేహితుడూ, తరువాతి కాలంలో రచయితా అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్ఛాస్త్రి వద్ద మేఘసందేశం,రఘువంశం, కుమార సంభవం నేర్చుకున్నాడు. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాసాడు. కళకు కులమతాలున్నాయా? అంటూ జాషువా ప్రశ్నిస్తూ "నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపు రేఖా కమనీయ వైఖరులు గాంచి భళీభళీబీ యన్నవారే, మీదేకుల మన్న ప్రశ్న వెలయించి, చివాలున లేచిపోవుచో బాకున గ్రుమ్మినట్లగున్ పార్థివ చంద్ర! వచింప సిగ్గుగన్!" అంటూ వెంకటిగిరి రాజా గారికి తన ఆవేదన చెప్పుకున్నాడు. "కుల మతాలు గీచుకున్న గీతలు జొచ్చి పంజరాన గట్టు వడను నేను నిఖిలలోక మెట్లు నిర్ణయించిన నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను'. అయితే కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడ్డాడు. జాషువా, ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందాడు. అగ్రవర్ణ దురహంకారాలను చవి చూసిన జాషువా సౌమ్య పదజాలం తోనే వాటిని ఎదిరించాడు. ఓ సందర్భంలో ఆయనే చెప్పినట్లు "నాకు గురువులు ఇద్దరు... పేదరికం, కులమత బేధం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది. "ఆయన కవిగా, వ్యక్తిగా విరాట్రూప ప్రదర్శనకు నేపథ్యాలు. ఆయన క్రమంగా ఆయన నాస్తికత్వం వైపు జరిగాడు. బాల్య స్నేహితుడు, తరువాతి కాలంలో రచయిత అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్ఛాస్త్రి వద్ద మేఘసందేశం, కుమార సంభవం, రఘు వంశం నేర్చుకున్నాడు. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు వ్రాశాడు. వాటిలో ప్రముఖమైనవి...క్రీస్తుచరిత్ర , గబ్బిలం, పిరదౌసి, రుక్మిణీ కళ్యాణం, శ్మశాన వాటిక, వివేకానంద, జేబున్నీసా, నాగార్జున సాగరం, కాందిశీకుడు. 'నా కథ' పేరుతో ఆత్మకథను కూడా వ్రాసు కున్నారు. ఆయన మనో భావాన్ని దళిత యువకుడి ద్వారా చక్కగా చెప్పాడు."వాని నుద్ధరించు భగవంతుడే లేడు, మనుజెడెట్లు వాని గనికరించు, వాడు జేసికొన్న పాపకారణ మేమో యింత వరకు వాని కెరుకలేదు."'"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి యినుపగజ్జెల తల్లి జీవనము సేయు, గసరి బుసకొట్టు నాతని గాలిసోక నాల్గు పడగల హైందవ నాగరాజు". ఇలా చెప్పుకుంటూ పోతే, ప్రతి పద్యాన్ని ఉదహరించ వచ్చు."సుకవి జీవించు ప్రజల నాల్కల యందు" అనే ఈ పద్యంలో కవిలోకానికి జాషువా సముచిత స్థానం కల్పించాడు. తిరుపతి వెంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి, జాషువా కాలికి గండ పెండేరం తొడిగి "ఈ కవీశ్వరుని పాదం తాకి నా జన్మ ధన్యం చేసుకున్నాను" అన్నాడు. అది తనకు లభించిన "అత్యున్నత పురస్కారం"గా జాషువా భావించాడు. 1964లో క్రీస్తు చరిత్రకు "కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు" లభించగా, ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి సభ్యునిగా నియమితుడయ్యాడు. 1970లో ఆంధ్ర విశ్వ విద్యాలయము కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. భారత ప్రభుత్వము పద్మభూషణ పురస్కారం అందజేసింది. విశ్వనాథ సత్యనారాయణ, జాషువా ఒక మధుర కవి అని, ఒకానొక మాధుర్యం ఆయన కవిత్వంలో శారదాదేవి అనుగ్రహం చేత లభించిందని అన్నాడు. "ఆయన వ్రాసిన శిశువు (పాపాయి) అనే ఖండికను ఘంటసాల అద్భుతంగా గానం చేశారు. ఈ సందర్భంలో ఈ పాట రికార్డింగ్ జరిగే సమయంలో జాషువా, ఘంటసాల యింటికి వెళ్ళి, బయట అరుగు మీద కూర్చున్నారట. ఘంటసాల, బయటకు వచ్చి, "ఏమిటండీ! బయటనే కూర్చున్నారు" అని అడిగితే, "నేను అంటరాని కులమునకు చెందిన వాడను, మీరు బ్రాహ్మణులు, మీ అనుమతి లేకుండా లోపలి ఎలా రాగలను?" అన్నారట జాషువా. అందుకు, ఘంటసాల "నాకు అటువంటి పట్టింపులు లేవు, మీరు స్వేచ్చగా లోపలి రావచ్చు. పైగా మీరు సరస్వతీ పుత్రులు. మీరు అంటరాని వారైతే, సరస్వతీ దేవి కూడా అంటరానిదనే కదా అర్ధం!" అని చెప్పియింటి లోకి సాదరంగా తీసుకొని వెళ్లి, తన సహృదయాన్ని చాటుకొన్న ధన్యజీవి ఘంటసాల. కవితా విశారద, కవికోకిల, కవి దిగ్గజ - నవయుగ కవి చక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్ గా ప్రసిద్ధు డయ్యాడు. "వడగాల్పు నా జీవితమైతే, వెన్నెల నా కవిత్వం" అని జాషువా అన్నది అక్షర సత్యం. "రాజు మరణించె నొక తార రాలిపోయె, సుకవి మరణించె నొక తార గగనమెక్కె, రాజు జీవించు రాతి విగ్రహముల యందు, సుకవి జీవించు ప్రజల నాల్కల యందు". " సత్కవీంద్రుని కమ్మని కలము, నిప్పులలోన గఃఅగిపోయె ! యిచ్చోటబీ నే భూము లేలు రాజన్యుని యధికార ముద్రిక లంతరించె! యిచ్చోటబీ నే లేఁత యిల్లాలి నల్లపూసల సౌరు, గంగలో గలిసిపోయె! యిచ్చోటబీ నెట్టి పేరెన్నికం గనుఁగొన్న చిత్ర లేఖకుని కుంచియ, నశించె! ఇది పిశాచులతో నిటాలేక్షణుండు గజ్జె గదలించి యాడు రంగస్థలంబుబీ ఇది మరణ దూత తీక్షణమౌ దృష్టు లొలయ నవనిఁ బాలించు భస్మ సింహాసనంబు". స్మశాన వాటిక లోని ప్రతి పద్యం మన గుండెలను పిండుతుంది. చివరికి జూలై 24, 1971న గుర్రం జాషువా లోకం వదిలి వెళ్ళారు. కాని ఆయన మరణవార్త బయటి ప్రపంచానికి చెప్పని ఇంటి వాతావరణం. అంతిమ యాత్ర అయిన వారు వెంట లేకుండా సాగింది. సమాజం ఆయనను చిన్న చూపు చూసింది, దూరంగా పెట్టిందని మధనపడిన జాషువా చివరి దశలో కుటుంబ సభ్యులు ఆయనను దూరం చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కానరాని విల్లంబుల ధారణలు... కనుమరుగైన సాంప్రదాయాలు



యుగయుగాలుగా, తరతరాలుగా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తున్న క్షీరధార హైందవ సంస్కృతి. ఆ పాల వెల్లువలో పెల్లుబికిన మీగడ తరగలైన హైందవ సనాతన ప్రాచీన సంప్రదాయాలు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి. పురాణేతిహాస, రుతుపరమైన, మత ప్రమేయ యుక్త, శీతోష్ణస్థితి, స్థానిక పరిస్థితుల సంబంధమైనవిగా పెక్కు సాంప్రదాయాలు అనాదిగా ఆచరించ బడుతున్నాయి. ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతుల ప్రభావం కారణంగా హైందవ సనాతన ఆచారాలు ఒక్కొక్కటిగా అదృశ్యమవుతున్నాయి. అలాంటి వాటిల్లో "ఉపాధ్యాయ వారోత్సవ" సంప్రదాయం ముఖ్యమైనది. బడి పిల్లలు దసరా సెలవులలో విల్లంబులు ధరించి, గిలకలు పట్టి, ఇంటింటికీ తిరిగి గురుదక్షిణ" కోరడమే "ఉపాధ్యాయ వారోత్సవ" కార్యక్రమం. విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు విల్లంబులు ధరించి వెళ్ళడం నేపథ్యంగా తమ గురువును తోడ్కొని విద్యార్థులు చేతుల్లో రంగు బాణాలు ధరించి, దసరా పద్యాలు పాడడం, తమ తమ ఇల్లిల్లు తిరిగి తమ ఆయుధాలకు నివేదన తెమ్మంటూ, పప్పు బెల్లాలిమ్మంటూ తమను విద్యావంతులను చేస్తున్న గురువులకు కట్న కానులకలను ఇమ్మంటూ, అదే పాట, అదే ఆటగా గ్రామమంతా సందడితో ఎక్కడ కన్నా చిన్నారులే, ఎక్కడ విన్నా జయజయ ధ్వనాలే వినిపించేవి. పూర్వం విలువిద్య నేర్చుకొనే పిల్లలు తాము నేర్చిన విద్య దసరా నవరాత్రులలో ప్రదర్శించే వారు. అలనాటి ప్రదర్శనాచారక్రమం రానురాను తొమ్మిది రోజులలో గిలకలు చేత బట్టుకుని, తమ గురు వులకు బహుమానాలు, తమకు పప్పు బెల్లాలు సంపాదించే అలవాటు ఆచరణలోకి వచ్చినట్లు చెపుతారు. పిల్లల వయస్సు, తరగతిని బట్టి వివిధ కళలను పిల్లకు నేర్పి తమను పోషిస్తున్న పెద్దలతో చెప్పి మెప్పించి పెద్దలు ఆనందంగా ఇచ్చే కానుకలను పొందేవారు. పంతుళ్ళు వెనుక నడుస్తుంటే పిల్లలు వరుసల్లో పాడుతూ ప్రతి వాకిటా ఆగి దసరా మామూళ్ళు స్వీకరించే ఆత్మీయమైన ఆచార మిది. ప్రభుత్వ బడులు లేని ఎన్నో గ్రామాల్లో తమ స్థలాలను బడి పెట్ట డానికి నిస్వార్థంగా దానం ఇచ్చే వారు. ఆ బడి ఇంకా ఇంకా ఎదగాలని తమ ధనాన్ని దసరా కానుకగా అందించేవారు. విద్యా భ్యాసానికి చేయూతను ఇచ్చే వారు. ఇప్పట్లా వ్యవస్థీకృత పాఠశాలలు లేని కాలం. జీవితానికి అవసరమైన జ్ఞానం పొందేందుకు నాడు వీధిబడి ఆలంబనగా ఉండేది. అయితే ఇప్పుడు ఉన్నంతగా డబ్బు అప్పట్లో చెలామణిలో లేదు. వస్తుమార్పిడి ఉండేది. అదీ ధాన్య రూపంలోనే. అలాంటి పరిస్థితుల్లో వీధిబడి అయ్యవారికి కాస్త ఇబ్బందిగానే గడిచిపోయేవి రోజులు. అందుకే ఆయన బతకలేక బడిపంతులు అయ్యాడు. ఏదైనా పండగ వస్తే ఆయనకు జరుగుబాటు అంతంత మాత్రం. అప్పుడు ఆ ఊరివాళ్లే గౌరవంగా తలా కొంత భత్యం సమకూర్చేవారు. మరి పదిరోజుల పండగ దసరా వేళ ఊరితోపాటు తన ఇల్లూ కళకళలాడాలని గురువు, శిష్యులతో కలసి, గ్రామ పెద్దలు పోషకుల ఇళ్ళకు వెళ్ళి, వారి సాయం పొందేవారు. దసరా వచ్చిందంటే ప్రతీ గ్రామంలోనూ గురువులూ వారివెంట పిల్లలూ ఊరంతా తిరుగుతూ పాడుకునే పాటలు ఆ తరం వారికి గుర్తుకు రావలసినదే... ఆ అలవాటు ఇప్పుడు వెనుకబాటు అయింది. "పర గనాశ్వియుజ శుక్ల పక్ష మందు తెరగొప్ప దీవించ వస్తిమిట మేము శ్రీరస్తు విజయోస్తు దీర్ఘాయురస్తు, ధన కనక వస్తు వాహన సిద్ధిరస్తు. బాలకుల దీవెనలు బ్రహ్మ దీవెనలు, భూమి లోపల లేని భోగములు కల్గి ధనదాన్యములు కల్గి అంటూ శుభాకాంక్షలు తెలపడం... ఘనముగా కట్నములు గ్రక్కున ఇచ్చి, సెలవియ్యుడి మాకు శీఘ్రముగా, పట్టు పచ్చడి మిచ్చి పదిమాడలిచ్చి, గట్టి శాలువలిచ్చి కడియం లిచ్చి, అయ్యవారికి చాలు ఐదు వరహాలు, పిల్ల వాండ్లకు చాలు పప్పు బెల్లాలు, కొబ్బరి కురిడీలు కుండ బెల్లాలు అంటూ ఈయవలసిన వాటిని ఏకరువు పెడుతారు. ఏదయా మీదయా మామీద లేదా ఇంత సేపుంచుట ఇది మీకు తగునా? దసరాకు వస్తిమని విసవిసలు పడక, రేపురా మాపురాస్ మళ్ళీ రమ్మనక, చేతిలో లేదనక ఇవ్వలేమనక, ఇప్పుడే లేదనక, అప్పివ్వరనక, ఇరుగు పొరుగు వారు ఇస్తారు సుమ్మీ, శీఘ్ర ముగ పంపుడి శ్రీమంతులార అంటూ ఇవ్వడంలో జాప్యం చేయవద్దని, వాయిదా చేయవద్దని మృదువుగా మర్యాదగా వేడుకుంటారు. పలుమార్లు మిమ్మెపుడు అడుగంగ రాము, అల్లుంద్రవలె కాదు అలిగి మిమ్మడుగ, చెల్లెంద్ర వలెగాదు చెలగి మిమ్మడుగ, అల దొమ్మరులము గాము ఆడి మిమ్మడుగ, మంత్ర తంత్రము కాదు మాయచే నడుగ, బలవంతులము కాదు బలముచే నడుగ, నిలువు జీతము కాదు నిలిచి మిమ్మడుగ అంటూ గడుసుగా చెపుతారు. పావలా బాడైతే పట్టేది లేదు, అర్ధరూపాయయైతే అంటేది లేదు, ఒక్క రూపాయైతే ఒప్పేది లేదు, అయ్య వారికి చాలు ఐదు వరహాలని, కనీస గురు దక్షిణ పేర్కొంటారు...అలా గురు దక్షిణ రాబట్టి జయ విజయ భవ, దిగ్విజయీభవ అంటూ బాలల దీవెనలు బ్రహ్మ దీవెనలుగా" వర్థిస్తూ భరతవాక్యం పలుకుతారు. దేవతా వేషధారులై ఆ చిన్నారులు ఘనమైన పద్యాలు చదువుతూ ఆశీస్సులు అందిస్తే ఊరి పెద్దలు, పోషకులు ముగ్ధులైన నేపథ్యం మరిచి పోలేని తీపి గుర్తులు. ఎల్లపుడూ చదువులో నిమగ్నమవు తూండే పిల్లలు శరన్నవ రాత్రులలో ఆటవిడుపుగా, గురుదక్షిణ పొందే సంబరాల కార్యక్రమంగా ఆశ్వయుజ పాడ్యమి మొదలు విజయ దశమి దాకా నాడు కనిపించే పిల్లల విల్లంబులు ధారణలు, వినిపించిన సంప్రదాయ పద్యాలు నేడు ఆధునిక మాటున పూర్తిగా కనుమరుగైనాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



చురకలు

## సంపాదకీయం

### అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు భారత్ కీలకం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ముందున్న అతిపెద్ద సవాళ్లలో గ్లోబల్ వర్క్‌ఫోర్స్ కొరత ఒకటని, ఈ సమస్య పరిష్కారంలో భారత్ కీలకపాత్ర పోషించగలదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. పలు దేశాలలో నెలకొన్న జనాభా సమస్యలు, ముఖ్యంగా వృద్ధాప్య జనాభా పెరుగుదల కారణంగా ఏర్పడిన శ్రామిక శక్తి లోపం ప్రపంచ వాణిజ్యం, ఉత్పత్తి మరియు సరఫరా వ్యవస్థలకు ముప్పుగా పరిణమించిందని ఆయన హైలైట్ చేశారు.

**జనాభా సమస్యలు, శ్రామికశక్తి లోపం...** జైశంకర్ విశ్లేషణ ప్రకారం.. ముఖ్యంగా యూరోప్, జపాన్, కొంతవరకు ఉత్తర అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు తీవ్రమైన డిమాండ్–సరఫరా అంతరాన్ని ఎదుర్కొంటున్నాయి. "చాలా దేశాల్లో డిమాండ్ ఉన్నప్పటికీ, జనాభా సమస్యల వల్ల శ్రామికశక్తి అందుబాటులో లేదు" అని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీ , సేవల రంగాల్లో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా స్థానిక శ్రామిక శక్తి లేకపోవడం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆటంకంగా మారింది. దీనిని అధిగమించడానికి ట్యాలెంట్, స్కిల్డ్ లేబర్ కోసం అంతర్జాతీయ సరఫరా అనివార్యమని ఆయన తేల్చి చెప్పారు.


**భారత యువతకు పెరిగిన అంతర్జాతీయ అవకాశాలు...** హెచ్–1బీ వీసాల ఫీజుల పెంపు వంటి చర్చలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అమెరికా వంటి దేశాల్లో టెక్నికల్ శ్రామిక అవసరాలు అధికంగా ఉన్నప్పటికీ, స్థానిక జనాభా పరిమితులు అడ్డంకిగా మారాయి. ఈ పరిస్థితి భారత యువతకు, ముఖ్యంగా ఐటీ, ఇంజినీరింగ్ , ఇతర సాంకేతిక రంగాలలో నైపుణ్యం కలిగిన వారికి, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగావకాశాలను విస్తృతం చేస్తుందని విదేశాంగ మంత్రి సంకేతాలిచ్చారు. జైశంకర్ ప్రకారం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ ముందున్న అతిపెద్ద సవాలు అంతర్జాతీయ శ్రామిక శక్తిని సమర్థవంతంగా, సమకాలీనంగా సృష్టించడం. ఈ సవాలును భారత్ తన యువ జనాభా , విస్తృత సాంకేతిక నైపుణ్యంతో పరిష్కరించగలదు.

**సరఫరా – ఉత్పత్తి చైన్‌లకు ముప్పు...** గత మూడు, నాలుగు సంవత్సరాలలో గ్లోబల్ పంపిణీ వ్యవస్థలు అనేక సమస్యలు ఎదుర్కొన్నాయని జైశంకర్ గుర్తు చేశారు. శ్రామిక లోపం వంటి సవాళ్లను పరిష్కరించకపోతే, రాబోయే దశల్లో దేశాల ఆర్థిక వ్యవస్థలు, ఉత్పత్తి , సరఫరా చైన్‌లకు తీవ్ర నష్టాలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. మెరుగైన రోడ్లు, షిప్పింగ్ , డిజిటల్ వాణిజ్య సౌకర్యాల వల్ల అంతర్జాతీయంగా పని చేయగల శ్రామిక శక్తిని ఎక్కడ అవసరమైతే, అక్కడ వేగంగా తరలించడం సులభతరం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**భారత్‌పై ప్రపంచ దృష్టి...** విదేశాంగ మంత్రి వ్యాఖ్యలు భారత్ ప్రభుత్వం యొక్క విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి: ప్రపంచంలోని కార్మిక లోపాన్ని పూడ్చడంలో భారతీయుల నైపుణ్యాన్ని వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలి. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం , సరఫరా వ్యవస్థలను పునరుద్ధరించడానికి, గ్లోబల్ వర్క్‌ఫోర్స్ సరఫరాదారుగా భారత్ అత్యంత కీలకమైన అంశంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు మనుగడకు అత్యంత అవసరమైన గ్లోబల్ వర్క్‌ఫోర్స్ అవసరాలపై భారత్ తన పాత్రను నొక్కి చెప్పడానికి జైశంకర్ చేసిన వ్యాఖ్యలు దోహదపడతాయి.

# టీకాల అవిష్కరణకు ఆద్యుడు పాశ్చర్ - సెప్టెంబర్ 28... లూయీ పాశ్చర్ వర్ధంతి

ఆంత్రాక్స్, రబీస్ తదితర వ్యాధులకు మందులను కనిపెట్టడంలో మూల పురుషుడై అవిరళ కృషి సల్పిన సూక్ష్మజీవ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్. 19 వ శతాబ్దంలో గాలి సోకడం వల్ల అంటువ్యాధులు వస్తాయని నమ్మేవారు. గాలిలో రోగకారక క్రిములని మోసుకొచ్చే వస్తువుల వల్ల అంటు వ్యాధులు కలుగు తాయని అప్పుడు ఎవరికీ తెలీదు. సొంత కుంటుంబంలో జరిగిన విషాద సంఘటనలు, పాశ్చర్ తన పరిశోధనలను కలరా, మశూచి వ్యాధులకు మూలమైన వ్యాధి కారకాలను కనుగొనే దిశలో కొనసాగేట్లు చేశాయి. నేడు మనం చిన్న పిల్లలకు కలరా, మశూచి, పోలియో రాకుండా ముందుగానే వేయిస్తున్న 'టీకాలు' ఆ మహానుభావుని ఆలోచనే. వ్యాధి వచ్చినప్పటి కంటే రాకుండా తీసుకోనే జాగ్రత్తలే మేలని ముందుగా "వ్యాక్సి నేషన్" ద్వారా వ్యాధులను రాకుండా ముందుగానే కట్టడి చేయవచ్చని సూచించాడు. అంతేకాదు వ్యాధి సోకినా దానిని నియంత్రించి, రూపుమాపే మందులను కూడా కనుగొనేందుకు మార్గం చూపించాడు. పాశ్చర్ తన ప్రయోగాలను ఉపయోగించి సూక్ష్మజీవులు వాస్తవానికి ఇతర సూక్ష్మజీవుల నుండి ఉత్పత్తి అవుతాయని, ఊరికే గాలిలోంచి ఊడిపడవని నిరూపించారు. నేడు లక్షలాది అంటు రోగాలను తగ్గించేందుకు మన ఆధునిక వైద్యశాస్త్ర రంగంలో మందులున్నాయి. దానికి ఎంతో కృషి సల్పిన, నేటికీ నిత్యం శ్రమిస్తున్న ఎంతో మంది సూక్ష్మ జీవశాస్త్రవేత్తలకు లూయీ పాశ్చర్ వంటి వారు ఏర్పరిచిన శాస్త్రీయ విధానమే మూలాధారం. లూయీ పాశ్చర్ (డిసెంబరు 27, 1822 %–% సెప్టెంబరు 28, 1895) ప్రముఖ ఫ్రెంచి జీవ శాస్త్రవేత్త. వ్యాధులకు కారణం సూక్ష్మక్రిములను కనుగొని రోగ నివారణకు పాశ్చర్ బాటలు వేశారు. టీకాల ఆవిష్కారానికి ఇతడు ఆద్యుడు. మొదటి సారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారుచేశాడు. రాబర్ట్ కోచ్, ఫెర్డినాండ్ కాన్తో పాటు జీవశాస్త్ర వ్యవస్థాపక త్రయంలో ఒకరు. పాలు ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టే పద్ధతిని ప్రవేశ పెట్టిన వ్యక్తిగా సుపరిచితుడు. ఈ పద్ధతిని నేడు "పాశ్చరైజేషన్" అంటారు. కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. పాశ్చర్ కొన్ని అద్భుత ప్రయోగాలు చేసి సూక్ష్మ జీవులు ఒకదాన్నుండి ఒకటి పుడతాయని, గాల్లోంచి ఊడి పడవని నిరూపించాడు. ఆయన ప్రతిపాదించిన రోగకారక క్రిమి సిద్ధాంతం వైద్య శాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన భావనగా చెప్పుకోవచ్చు. అంతేకాక ఆయన వ్యాధి యొక్క వ్యాప్తిని అరికట్టేందుకు ఆస్పత్రులలో చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రతా పరమైన పద్ధతులు ప్రవేశ పెట్టాడు. పాశ్చర్ అత్యంత సునిశితమైన, క్రమబద్ధమైన ప్రయోగాలు చేసి ఎన్నో ప్రమాద కరమైన సూక్ష్మజీవులను కనుగొన్నారు. ఆ సూక్ష్మజీవులని అరికట్టే వాక్సీన్ లు రూపొందించి మనుషులనే కాక, జంతువులను కూడా ఎన్నో భయంకరమైన వ్యాధుల నుంచి కాపాడారు. పాశ్చర్ 1822 సంవత్సరం డిసెంబరు 27న ఫ్రాన్స్ లోని డోల్ గ్రామంలో జన్మించాడు. పాశ్చర్ పాఠశాలకు వెళ్ళకుండా కొంతవరకు విద్యావంతుడయ్యాడు. చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనపరిచేవాడు. తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగు వారివి, స్నేహితులవి బొమ్మలు పెయింట్ చేశాడు. గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలంటే ఇష్టమున్న పాశ్చర్ ఉపాధ్యాయ జీవితాన్ని గడపాలను కొనేవాడు. పదహారేళ్ల వయసులో కాలేజీ చదువు కోసం పారిస్ లో అడుగుపెట్టాడు. డాక్టరేట్ పూర్తిచేసి 1848లో స్ట్రాస్ బర్గ్ విశ్వ విద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కూతురు మేరీ లారెంట్ ను పెళ్ళిచేసుకోగా, అయిదుగురు పిల్లలు పుట్టినా, టైఫాయిడ్ వల్ల ఇద్దరు, మశూచి వల్ల ఒకరు, ముగ్గురు మరణించారు. పాశ్చర్ అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏ విధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి "స్టీరియో కెమిస్ట్రీ" అనే కొత్త రసాయన శాస్త్రాన్ని రూపొందించారు. తరువాత తన పరిశోధనలను పులియడం (ఫెర్మెంటేషన్ ) వంటి అంశాలపై కొనసాగించి సూక్ష్మక్రిములపై అనాదిగా ఉన్న భావాలను ఖండించి కొత్త సిద్ధాంతాలను రూపొందించాడు. ద్రక్షసారా (వైన్) వల్ల వచ్చే వ్యాధులు, నిల్వచేసే పద్ధతులు, వెనిగర్ తయారీ మొదలైన అనేక అంశాలపై కొత్త విషయాలు కనుగొన్నాడు. రేబీస్ అనేది వైరస్ ల వల్ల కలిగే ఓ భయంకరమైన వ్యాధి. అది కుక్కల నుండి మనుషులకి సోకుతుంది. ఈ వైరస్ బాక్టీరియాల కన్నా అతి చిన్నదైన వస్తువు. కనుక పాశ్చర్ వాడిన సూక్ష్మదర్శినిలో ఇది కనిపించ లేదు. ఆ వైరస్ వ్యాధితో కేంద్ర నాడీ వ్యవస్థ పై ప్రభావితం చేస్తుంది. పాశ్చర్ ఆ వ్యాధి సోకిన జంతువుల వెన్నుపాము నుంచి ద్రవం సంగ్రహించి, వివిధ పద్ధతుల చేత ఆ ద్రవం యొక్క రోగ తీవ్రతని క్షీణపరిచి, ఆ ద్రవాన్ని తిరిగి కుక్కల మీదకి ఎక్కించి రేబీస్ కి వాక్సీన్ ని రూపొందించారు. కోళ్లకు వచ్చే కలరా వంటి పారుడు వ్యాధిపై పరిశోధన జరిపి వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులను బలహీనపరచి ఇతర కోళ్ళకు ఎక్కించి వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి తర్వాత కాలంలో రోగం రాకుండా రక్షిస్తుందని నిర్ణయానికి వచ్చారు. 1870 దశాబ్దంలో టీకా పద్ధతులను పశువులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధి మీద ప్రయోగించాడు. ఈ విధంగా కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. అందువలన మనిషులు గాని, జంతువులు గాని అంటు వ్యాధితో మరణిస్తే ఆ శవాన్ని దహనం చేయాలని చెప్పారు. భూమిలో పాతిపెడితే శరీరంలోని క్రిములు బయటకు వచ్చి వాటివలన ఇతరులకు ఆ వ్యాధులు వ్యాపిస్తాయని వివరించాడు. పాశ్చర్ తన పూర్తి జీవితాన్ని శాస్త్ర పరిశోధనలకు అంకితం చేశారు. సంకల్ప బలం, నిరంతర శ్రమతో విజయాన్ని సాధించవచ్చని పాశ్చర్ విశ్వాసం. పాశ్చర్ సూక్ష్మ జీవశాస్త్రంలో అత్యుత్తమ గౌరవమని పిలిచే లీవెన్ హాక్ బహుమతిని 1895లో పొందాడు. రెండు సార్లు గుండె పోటు, తరువాత పక్షవాతం వచ్చినా జీవితాంతం పరిశోధన చేసి మానవాళికి వెలకట్టలేని సేవ చేసిన పాశ్చర్ 1895 సెప్టెంబరు 28న పరమపదించారు. లూయిస్ పాశ్చర్ జ్ఞాపకర్ధంగా ఆయన మరణించిన రోజైన సెప్టెంబరు 28న ప్రపంచ రేబీస్ దినోత్సవం జరుపు కుంటారు.



**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# చెవుడు రాకుండా జాగ్రత్త వహించాలి - ప్రపంచ చెవిటి వారి దినోత్సవం సందర్భంగా..




ప్రతి సంవత్సరం శరదృతువు మొదటి నెల చివరి ఆదివారం, ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నేషనల్ డెఫ్ డేని జరుపు కుంటారు. చెవిటివారి దినం, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ యొక్క ఏర్పాటుకు సంబంధించి 1951 లో ఆమోదించ బడింది. చెవిటి వ్యక్తుల మానవ హక్కుల కోసం సంకేత భాష ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ఈ రోజును యూఎన్ జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. బధిరుల ఎదుగుదలకు, అభివృద్ధికి సంకేత భాషలో నాణ్యమైన విద్యతోపాటు ఈ భాషకు సేవల కోసం ఈ రోజు ప్రధాన లక్ష్యంగా ఈరోజును నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ డెఫ్ డేని మొదటిసారి 1958 సెప్టెంబర్‌లో ప్రారంభించారు. ఇటలీలోని రోమ్ లో వరల్డ్ డెఫ్ డే కి 1951 లో రూపకల్పన చేశారు. ఇది అంతర్జాతీయ ప్రభుత్వేతర సెంట్రల్ ఆర్గనైజేషన్. వినికిడి లేనివారి జాతీయ అసోసియేషన్ లతో కూడి ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థలో 130 దేశాలు సభ్యత్వం కలిగివున్నాయి. జాతి , దేశము , మతము, లింగ వివక్ష , ఇతర ప్రాధాన్యాలు , భేదాలు లేకుండా ప్రజలందరికీ సమానత్వము , మానవ హక్కులు , గౌరవ మర్యాదలు ఒకేమాదిరి ఉండాలన్నది ఈ వరల్డ్ డెఫ్ డే సిద్ధాంతం. గణాంకాల ప్రకారం, భూమిపై తొమ్మిది మందిలో ఒకరికి వినడానికి ఇబ్బంది ఉంది. ఈ వ్యాధి యొక్క కారణాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. వ్యాధి యొక్క పరిణామాలు, ప్రమాదాలు, పుట్టుకతో వచ్చే వైకల్యాలు. ప్రపంచ వ్యాప్తంగా, సుమారు 30 మిలియన్ల చెవిటి మరియు మూగ ప్రజలు ఉన్నారు. 2001 జనాభా లెక్కలు ప్రకారం, ఇండియాలో 2.19 కోట్ల మంది వికలాంగులు ఉన్నారు. వారు మొత్తం జనాభాలో 2.13% ఉన్నారు. వీరిలో కంటికి, వినికిడికి, మాట, లోకో మోటారు మరియు మానసిక సంబంధమైన వైకలాల్ని కలిగి ఉన్నారు. ఇండియాలో సుమారు 60 మిలియన్లు చెవిటివారు ఉన్నారు. పురుషులకు స్త్రీలకు వేర్వేలు ఆర్గనైజేషన్లు ఉన్నాయి. Delhi foundation of Deaf women , Madras foundation of Deaf Women. సెప్టెంబర్ 26 న " డే ఆఫ్ ది డెఫ్ " భారత దేశంలో జరుపు కుంటారు. చెవిటి వారికి ఆటలకు ఎన్నో స్పోర్ట్స్ అసోషియేషన్లు ఉన్నాయి. " All India sports council of the Deaf " , %All India Cricket association of the Deaf" , "Delhi sports council for the Deaf" . మున్నగునవి. ఎన్నో చెవిటి , మూగ స్కూల్స్ ఉన్నాయి. మూగవారికి ప్రత్యేక సైన్ లాంగ్వేజ్ ఉన్నది. చెవిటి పిల్లల కోసం సంస్థలు, సాధారణ విద్యా సంస్థలలో ప్రత్యేక సమూహాలు తెరవ బడతాయి. పిల్లలు వారి సామర్థ్యాలకు అనుగుణంగా పాఠాలను చదవడం, వ్రాయడం, వేలిముద్రల వర్ణమాలను ఉపయోగించి కమ్యూనికేట్ చేయడం మాత్రమే కాకుండా, సరైన అవగాహనతో, వారి స్వంత అభివృద్ధితో కూడా పని చేస్తారు. అపరిశుభ్రమైన నీళ్లలో స్విమ్మింగ్, చెవిలో పిన్నులు, పుల్లలు, ఇయర్‌బడ్స్ పెట్టి తిప్పడం, దుమ్ము ధూళి చేరడం, అకస్మాత్తుగా వినిపించే భారీ శబ్దాల వల్ల చెవి లోపలి పొర దెబ్బతినడం వంటివన్నీ వినికిడి సమస్యకు దారితీయవచ్చు. ఎక్కువ శబ్దంతో టీవీలు చూడడం, మొబైల్ ఫోన్ లో గంటల తరబడి మ్యూజిక్ వినడం, సెల్ ఫోన్ రేడియేషన్.. వీటి వల్ల కూడా సమస్య దరిచేరవచ్చు. ఫోన్ కాల్స్ మాట్లాడేటప్పుడు ఒకే చెవివైపు మొబైల్ పెట్టి ఎక్కువసేపు మాట్లాడ కూడదు. ఇయర్‌ఫోన్స్ వాడినా గంటకు మించి మాట్లాడడం పనికిరాదు. వాల్యూమ్ మితంగానే ఉండాలి. చెవిపోటు వచ్చినప్పుడు చాలా మంది సొంత వైద్యం చేస్తుంటారు. ఇది మరిన్ని సమస్యలకు దారి తీయవచ్చు. అందుకే వెంటనే ఈఎన్‌టీ డాక్టర్‌ని తప్పనిసరిగా సంప్రదించాలి. సాధారణంగా జలుబు తర్వాత ఎక్కువగా కనిపించే సమస్య చెవి ఇన్ఫెక్షన్. ఇది ముదిరే కొద్దీ చెవిపోటు, జ్వరం, చెవి నుంచి చీము కారే సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. ఇంకా నిర్లక్ష్యం చేస్తే కర్ణబేరి దెబ్బతిని చెవిటి వారిగా మారే ముప్పు ఉంది. స్నానం చేసే సమయంలో నీళ్లుచెవిలోకి వెళ్ళకుండా జాగ్రత్త పడడం, సైనస్ ఉంటే వెంటనే చికిత్స తీసుకోవటం ఉత్తమం. గులిమి (వాక్స్) ని తీయక పోవడమే మంచింది. ఆకు పసర్లు, నూనెలు వంటివి చెవిలో పోయకూడదు అని గమనించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ప్రాణాంతకం జలభీతి వ్యాధి - సెప్టెంబర్ 28... ప్రపంచ ర్యాబీస్ దినోత్సవం




ర్యాబీస్ అనేది ఒక వైరస్ వల్ల సంభవించే ఒక వ్యాధి, ఇది వ్యాధి సోకిన జంతువు యొక్క లాలాజల%శీ% ద్వారా వ్యాపి స్తుంది. ర్యాబీస్ వ్యాధిని వ్యాపింపజేయు అనేక వాహకాలు ఉన్నాయి. ఎక్కువ గా కుక్కలు మరియు గబ్బిలా లు. వైరస్ ఒక కాటు ద్వారా లేదా వ్యాధి సోకిన జంతువు యొక్క లాలాజలం ఒక గాయం కలిగిన చోట తాకినా సంక్రమిం చ వచ్చు. ఒకసారి సంక్రమించి నప్పుడు, వైరస్ శరీరంలో ప్రవేశిస్తుంది మరియు నాడీ వ్యవస్థపై దాడి చేసి కోమాకు దారి తీస్తుంది మరియు సరియైన చికిత్స చేయకపోతే చివరకు మరణానికి దారి తీస్తుంది. ర్యాబీస్‌లో రెండు రకాల ఉన్నాయి %–% అధిక కోపం మరియు పక్షవాతం. ర్యాబీస్ యొక్క ప్రధాన లక్షణాలు కాంతి కి తట్టుకోలేక పోవడం, నొప్పి, కండరాల స్పందనలు, చొంగ కార్చడం (అధిక – లాలాజలం, నీటిని చూసి భయపడటం. వ్యాధి యొక్క తదుపరి దశలలో, పక్షవాతం, కోమా సాధారణంగా సంభవిస్తాయి. ప్రపంచంలోని అనేక దేశాలలో రాబిస్ ఒక ముఖ్యమైన ఆరోగ్య సమస్యగా మిగిలి పోయింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 18 నిర్లక్ష్యం చేసిన ఉష్ణమండల వ్యాధులలో ఇది ఒకటిగా జాబితా చేయబడింది. రాబిస్ దాదాపు ఎల్లప్పుడూ ప్రాణాంత కం. ఇది ఏదైనా వ్యాధి యొక్క అత్యధిక మరణాల రేటులో ఒకటి. ఏదేమైనా, రాబిస్ 100% నివారించ దగినది. క్రూరమైన కుక్క కాటు వలన సంభవించే మానవ మరణాల లో 99% పైగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో జరుగు తున్నాయి. రాబిస్ గురించి ప్రపంచ అవగాహన పెంచడా నికి, ప్రమాదంలో ఉన్న వర్గాలలో వ్యాధిని ఎలా నివారించాలో సమాచారం అందించడానికి మరియు రాబిస్ నియంత్రణలో పెరిగిన ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి 2007 లో ప్రపంచ రాబిస్ దినోత్సవం ఏర్పాటు చేయబడింది. ఇది ఏటా సెప్టెంబర్ 28 న జరుగుతుంది. అంతర్జాతీయ ప్రభుత్వ సంస్థలు, విద్యావేత్తలు, ఎన్జిఓలు మరియు వ్యాక్సిన్ తయారీదారుల నెట్వర్క్ 2011 లో చేసిన సమీక్షలో రాబిస్ నివారణకు సహాయ పడటా నికి, ప్రమాదకర వర్గాలను లక్ష్యంగా చేసుకుని, జంతు ఆరోగ్య కార్యకర్తలు, ప్రజారోగ్య అభ్యాసకులు, ప్రభుత్వాలు, ముఖ్య అభిప్రాయ నాయకులు ప్రపంచ రాబిస్ దినోత్సవాన్ని ఉపయోగకరమైన సాధనంగా గుర్తించారు. మొదటి రాబిస్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన ఫ్రెంచ్ రసాయన శాస్త్రవేత్త మరియు మైక్రోబయాలజిస్ట్ లూయిస్ పాశ్చర్ మరణించిన సందర్భాన్ని సెప్టెంబర్ 28 కూడా సూచిస్తుంది. 59,000 మంది ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా వ్యాధి మరణి స్తున్నారు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ , యునై టెడ్ స్టేట్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (యుఎస్డిఎ)తో సహా ప్రధాన ఆరోగ్య సంస్థలు, ప్రపం చ ఆరోగ్య సంస్థ (%ఔనూ%), వరల్డ్ ఆర్గనైజేషన్ ఫర్ యానిమల్ హెల్త్ (%ూ×జు%), ఐక్యరాజ్య సమితి యొక్క ఆహార మరియు వ్యవసాయ సంస్థ (%ఖీూు%), 2030 నాటికి కుక్కల ద్వారా వ్యాపించే రాబిస్ నుండి మానవ మరణాలను తొలగిస్తా మని ప్రతిజ్ఞ చేశారు. రేబీస్ ను పిచ్చికుక్క వ్యాధి, జలభీతి వ్యాధి (%ఎఎతీశీజూష్ట్రశీఎఱ%) అని కూడా అంటారు.

ఇది క్షీరదాలకు చెందిన జంతువుల నుండి జంతువులకు వ్యాపించే ఒక వైరల్ వ్యాధి. ఉదాహరణకు కుక్కలు, నక్కలు, తోడేళ్లు, పిల్లులు, ఎలుగు బంట్లు, కోతులు, తదితర కార్నివరస్ (%ఝతీఅఱఙుతీశీబం%) తదితర జబ్బుతో ఉన్న జంతువు మనిషికి కరిచినచో ఈ వ్యాధి మనుషులలో వ్యాప్తి చెందును. జంతువులలోనైనా, మనుషులలో నైనా ఈ వ్యాధి కనిపిస్తే చని పోవడము తప్ప మందులేదు. పిచ్చికుక్క కరిచిన వెంటనే టీకాలు (వ్యాక్షిన్) వేసుకుంటే ప్రమాదమేమీ ఉండదు. నూటికి నూరుపాళ్లు సురక్షితము. రేబిస్ నరాలకు, మెదడుకు సంబంధించిన వ్యాధి. మెదడులో 'ఎన్–సెఫలైటిస్' అనే ఇన్ఫ్లమేషన్ లక్షణాలను కలుగజే యును. మిగతా ఏ వైరస్ వ్యాధి వలనైనా ఈ ఎన్–సెఫలైటిస్ లక్షణాలు కనిపించ వచ్చును. హెర్పీస్ వైరస్, ఎంటిరో వైరస్, ఆర్బో వైరస్, ముఖ్యముగా హెర్పెస్ సింప్లెక్ష్ టైప్ 1, వేరిసెల్లా జోస్టర్, మొదలగునవి. కొన్ని లేబొరేటరీ పరీక్షల వలన తేడాను కనిపెట్టాలి. ఏ క్షీరదమైనా, మానవులతో కలిపి ఈ వ్యాధికి గురి కావచ్చును. ఈ వైరస్ ఉన్న జంతువు ఇతర జంతువులను, మనుషులను కరడం వలన ఒకరి నుండి ఇంకొకరికి ఈ వ్యాధి వ్యాపిం చును. కొన్ని సమయాలలో గాలిలో (%ూవతీశీంశీశ్రీ%) ఈ వైరస్ ఎగిరి వ్యాపించే అవకాశమూ ఉంది. గబ్బిలాలు కరడం ద్వారానే ఈ జబ్బు సోకే అవకాశము చాలా ఎక్కువ. మనుషుల నుండి మనుషులకు కరుచుట వలన, కొంతమేరకు చర్మం లేదా కార్నియా ట్రాన్స్ – ప్లాంటేషన్, ముద్దుల వలన వ్యాపించే అవకాశమూ ఉంది. జబ్బుతో బాధ పడుతున్న ఏ జంతువైనా మనుషులకు కరిస్తే రేబీస్–వైరస్ బాహ్య నాడీ మండలము ద్వారా కేంద్రనాడీ మండలం చేరి వ్యాధి లక్షణాలు కలుగ జేయును. ఇలా జరుగ డానికి పట్టే కాలము 9 రోజుల నుండి 90 రోజులలో జరుగును, దీనినే ఇంకుబేషన్ కాలము అంటాము. మన శరీరము పై మెదడుకు ఎంత దగ్గరగా కరిస్తే అంత తొందరగా వ్యాధి మెదడుకు చేరే అవకాశ ముంది. గాభరాగా ఉండడం, తికమక పడడం (%ఎశీఅటఱంఱశీఅ%) మితిమీరిన భయము, భయంకర మైన చూపు, తనదైన లోకములో విహరించడం, నోటి వెంబడి లాలాజలం కారడం, గొంతు నొప్పి, ఏమీ మింగలేక పోవడం, నీటిని, ద్రావకాలను చూస్తే భయ పడడం (%ఱబవ్ శీ ష్ట్రతీశీష్ ఎబంఎశ్రీవం ూజుఖంఎ%). ఈ లక్షణాలు ముదిరి, గొంతు కండరాలు పెరాలసిస్ కి గురియై మనిషి ఏమీ తినలేక కోమాలోకి పోయి చని పోవును. జబ్బు లక్షణాలు కనిపించిన 2 నుండి 10 రోజులలో చని పోవును. ఒక వేళ అరుదుగా బ్రతికినా మెదడు దెబ్బతిని పిచ్చి వాడుగా బ్రతుకును. మనుషుల లోను, జంతువుల లోను ఈ వ్యాధి రాకుండా టీకా మందు వేసుకొని కాపాడు కోవచ్చు. 1885 లో లూయిస్ పాచ్చర్, ఇమిలె రౌక్స్ ఈ వాక్షిన్ ని కనుగొన్నారు. దీనిని ARV అంటాము. దీనిని మొదట 9 సంవత్సరాల బాలుని (జోసెఫ్ మైస్టర్) పై 1885 జూలై 06 లో ఉపయోగించారు. రేబిస్ వైరస్ క్రిములను జంతువుల (గొర్రె) మెదడు కణాలలో ప్రయోగ శాలలో పెంచి వాటిని నిర్జీవము చేసి శుద్ధిచేసి తగినటువంటి ద్రావకములో నిలువచేసి సుబ్కుటేనియస్ గా ఇంజక్షన్ చేస్తారు. ఈ పాత వాక్షిన్ వల్ల పోస్టు వాక్షినేషన్ ఎన్కెఫలైటిస్ అనే సీడు ఎఫక్ట్ ఊన్నందున రాను రాను హూమన్ డిప్లోయిడ్ సెల్ వాక్షిన్ 1967 లో తయారవడం మొదలైనది. తరువాత చిక్ ఎంబ్రియో, డక్ ఎంబ్రియో, ఆ తరువాత వెరో సెల్ కల్చర్ ద్వారా కోతి మూత్రపిండాల కణాల కల్చర్ ద్వార, పూరిఫైడ్ వెరోసెల్ రేబిస్ – వాక్షిన్ తయారవు తుంది. ఎక్కువగా పెంపుడు జంతువులతో గడిపే వారు, పశు వైద్యులకు, పశువైద్య సిబ్బందికి, జంతు ప్రదర్శన శాలలో పనిచేసే వారికి రేబిస్ ఎక్కువగా వున్న ప్రదేశాలలో తిరిగేవారికి ఇవ్వాలి. వీరోసెల్ కల్చర్ వాక్షిన్ 1వ,7వ,14వ రోజులలో 3 వాక్షిన్లు తీసుకొని, ప్రతి సంవత్సరము 1 డోసు బూస్టర్ డొసుగా తీసుకోవాలి. ఇలా చేయడం వలన ఎటు వంటి ప్రమాదము ఉండదు. ఈ కుక్క కాటు (ఏ జంతువైనా సరే) మూడు రకాలు మైల్డ్, మోడరేట్, సివియర్. ఏది ఏమైనా కరిచిన చోట సబ్బుతో బాగా కడగాలి, యాంటిసెప్టిక్ లోషన్ రాయాలి. గాయము బాగా ఎక్కువైనా కుట్లు వేయ కూడదు, వేసితే వైరస్ క్రిములు కుట్లు లోపల ఉండిపోయి జబ్బు ఎక్కువ అవడానికి ఆస్కార ముంటుంది. రోజూ క్లీనింగ్ చేసుకోవడం మంచిది. సివియర్ కాటు అయితే గాయము చుట్టూ పాసివ్ వాక్షిన్ ఇంజక్షన్ చేయాలి. నొప్పి తగ్గడానికి డాక్టర్ సలహా మేరకు నొప్పిని తగ్గించే మాత్రలు వాడాలి. గాయము చీము పట్టకుండా యాంటి బయోటిక్కు వాడాలి. వాక్షిన్ ఇచ్చే ముందు ఆయా జంతువులు 10 రోజులు నిజముగా రేబిస్ అయినదో కాదో పరిశీలనలో వుంచాలి. ప్రస్తుతం మార్కెట్ లో 5 నుండి 6 రకాల వాక్షిన్లు దొరుకు తున్నాయి. కుక్క పిచ్చి ప్రవర్తన చూడాలి. సొంగ కార్చు చున్నదేమో చూడాలి. గజ్జి వగైరా వున్నాయేమో చూడాలి. పెంచిన కుక్కా, వూర కుక్కా అడిగి తెలుసుకోవాలి. తెలిసి ప్రతి పిచ్చి కుక్క కాటుకి పూర్తి కోర్సు ఇంజక్షన్లు వేసుకోవాలి. వాక్షిన్ తీసికోని కేసులలో రేబీస్ వ్యాధి పూర్తిస్థాయిలో వచ్చి మనిషి చనిపోవును. ఈ వ్యాధికి చికిత్స లేదు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# మన్యం.. ప్రగతి పథం..!

భద్రాచలం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను భద్రాచలం మన్యంలో సంపూర్ణంగా అమలుచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆది కర్మ యోగి పథకం ఫలాలను క్షేత్రస్థాయికి చేర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకు ఐటీడీఏ పరిధిలోని 19 మండలాల్లో ఎంపిక చేసిన 130 గ్రామాల్లో పరిస్థితులను తెలుసుకుంటున్నారు. ఆదివాసీ పల్లెల్లో అన్ని రకాల సమస్యలు పరిష్కరించేందుకు రచ్చబండ తరహాలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. దుమ్ముగూడెం మండలం నడికుడి, సింగవరంలో గ్రామసభలను ప్రారంభించారు. గిరిజనులకు ఏం కావాలో వివరాలు సేకరిస్తున్నారు. వ్యక్తిగత సామాజిక అవసరాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ఇందులో ప్రాధాన్యం కల్పిస్తున్నారు.




**గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక**

2030 నాటికి ఆదివాసీ గ్రామసీమలు అభివృద్ధికి మారుపేరుగా నిలవాలన్నది ఈ పథకం ఉద్దేశం. ఆది కర్మ యోగి పథకం అమలు చేస్తున్న మండలాల వివరాలను పీఓ రాహుల్ బుధవారం వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది ఈనెలాఖరు వరకు పర్యటించాలని చెప్పారు. అధికారులు గ్రామాలకు వెళ్లినప్పుడు రహదారులు, మురుగు కాల్వలు, విద్యుత్తు, విద్యాలయాలు, విద్యార్థులకు వసతి, వ్యవసాయ భూముల్లో సాగుయోగ్యానికి అవసరమైన సదుపాయాలు, వైద్యశాలల్లో వసతులు, పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ పథకాలు, క్రీడా ప్రాంగణాలు, పార్కులు, గ్రంథాలయాలు ఇలా ఏది కావాలో తెలుసుకుని గ్రామాల వారీగా ప్రణాళిక రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. భారీస్థాయిలోనే నిధులు కావాలని ప్రతిపాదించేందుకు పీఓ రాహుల్ నేతృత్వంలో చర్యలు చేపట్టామని ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు.

# వినియోగదారుల చూపే బంగారమాయనే..!

కొత్తగూడెం : 'బంగారంపై జీఎస్టీని మూడు శాతం నుంచి ఒక్క శాతానికి తగ్గించాలి. గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి. బంగారు, వెండి వర్తకులను ఆదుకోవాలి' అని కొత్తగూడెం పట్టణం వెండి, బంగారు వర్తకుల సంఘం ఉపాధ్యక్షుడు కొమ్ము వెంకటేశ్వర్లుకు తెలిపారు.బంగారం అనగానే 'కొరకరాని కొయ్య' అనే నానుడి ఎదురవుతోందంటే అతిశయోక్తి కాదు. సామాన్యులు కొనాలంటే అసాధ్యమనే స్థాయికి ధరలు పెరిగిపోయాయి. ఆఖరికి మధ్యతరగతి అంతకంటే ఓ మోస్తరు తరగతి ప్రజలు సైతం ఆభరణాలు కొనాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో హడలెత్తిపోతున్నారు. ఐదారేళ్ల క్రితం వరకు దసరా పండుగ వచ్చిందంటే జ్యువెలరీ దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడేవి. ఇప్పుడు బోసిపోతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జ్యువెలరీ దుకాణాలు సుమారు 1,230 ఉన్నాయి.

**క్రమంగా పెరిగి.. అందనంత ఎదిగి..!**

ఆరేళ్ల క్రితం పది గ్రాముల బంగారు ధర రూ.35వేల వరకు పలికింది. సుమారు రెండేళ్ల క్రితం రూ.65వేల వరకు చేరింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. రెండేళ్లలోనే 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1.18లక్షలు చేరింది. ధర అమాంతంగా పెరిగిపోవటంతో 80శాతం కొనుగోళ్లు తగ్గుముఖం పట్టాయి. కేవలం పెళ్లిళ్ల సీజన్‌లో తప్పితే ఇతర పండుగలు, శుభకార్యాలకు బంగారం కొనటం లేదని వ్యాపారులు వాపోతున్నారు.

**ఉభయ జిల్లాల్లో గణనీయంగా తగ్గిన టర్నోవర్**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఆరేళ్ల క్రితం వరకు నెలవారీ టర్నోవర్ రూ.50 కోట్ల నుంచి రూ.65 కోట్ల వరకు ఉండేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడు ప్రతినెలా రూ.10కోట్ల నుంచి రూ.15కోట్లకు పరిమితమైందని ఆవేదన చెందుతున్నారు. వెండి ధరలు సైతం పైపైకి చేరుతుండటంతో వ్యాపారం గిట్టుబాటు కావటం లేదంటున్నారు. అద్దెలు చెల్లించలేని పరిస్థితుల్లో కొందరు దుకాణాలకు మూసేసుకుంటున్నారు. అద్దె భవనాల్లోని దుకాణాల ఎత్తివేతకు మరికొందరు సిద్ధపడుతున్నారు.

# నిండుగా గోదారి.. చేప పిల్లల విడుదలేదీ?

ధర్మపురి : ఈ ఏడాది పుష్కలమైన నీటి లభ్యత ఉండి కూడా మత్స్యకారులు సరైన ఉపాధి పొందలేకపోతున్నారు. ఎల్లంపల్లి జలాల ఆధారంగా చేప పిల్లల అభివృద్ధి, వీటి ద్వారా ఉపాధి అవకాశాలు పొందడానికి అవకాశాలు మెరుగ్గా ఉన్నా ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభించకపోవడంతో మత్స్యకారుల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దీంతోపాటు జిల్లాలోని వివిధ చెరువుల్లో ఇప్పటి వరకు ఉచితంగా చేప పిల్లల పంపిణీకి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది.

జిల్లాలో 765 చెరువులు, 272 మత్స్య కార్మిక సంఘాలున్నాయి. ఈ సంఘాలకు ఉచితంగా 1.44 కోట్ల చేప పిల్లల్ని పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా అడుగు ముందుకు పడటం లేదు. ఆయా ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించినా అనుమతులు రాలేదు. జులైలో వదిలితే ఇప్పటికే బాగా ఎదిగి విక్రయాలకు అనుకూలంగా ఉండేవి.

**500 కుటుంబాల్లో..**

రెండేళ్ల కిందటి వరకు ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో 12.21 లక్షల చేప పిల్లల్నిపోయగా ధర్మపురి, వెల్గటూరు ప్రాంతాల్లోని నదీ తీర మత్స్యకారులకు చేప పిల్లల పంట పండేది. దీంతో కార్మికులకు రెండు నెలలపాటు చేతినిండా పని ఉండేది. ప్రతీ కార్మికుడు నిత్యం రూ.వెయ్యి నగదు సంపాదించేవారు. రాయితీపై కేటాయించిన ద్విచక్రవాహనాల ద్వారా నదిలో సేకరించిన చేపలను దూరప్రాంత మార్కెట్లకు, పల్లెలకు తీసుకెళ్లి విక్రయించేవారు. ఈ ఏడాది వానాకాలంలో రికార్డు స్థాయిలో ఎల్లంపల్లి జలాశయంలో నీటి మట్టం ఉన్నా ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, వెల్గటూరు మండలాల్లోని 500 మత్స్యకారుల కుటుంబాలకు నిరాశే మిగిలింది.

# వ్యర్థాల మేత.. కడుపు కోత



సూర్యాపేట : కోదాడలో ఓ రైతు తన ఆవు మేత మేయకపోవడంతో పశువైద్యులను సంప్రదించారు. ఐదు నెలల సూడి పశువుకు చికిత్స చేసి 90 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు బయటకు తీశారు. ఒక్క కోదాడలోనే కాదు.. ఇలా జిల్లాలోని పురపాలికల్లో పశువులు ప్లాస్టిక్ వ్యర్థాలను తినే జీవనం సాగిస్తున్నాయి. పట్టణాల్లో రోడ్ల వెంట పశువులు నిత్యం సంచరిస్తున్నాయి. ముఖ్యంగా వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి పారేస్తుండటంతో వాటిని తింటున్నాయి. జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోయింది. మార్కెట్లలో ఏ వస్తువు కొన్నా వాటిని ప్లాస్టిక్ సంచుల్లోనే తీసుకెళుతున్నారు. తినుబండారాలను, మిగిలిన అన్నం, కూరగాయలను కవర్లలో వేసి పారవేస్తున్నారు. వాటిని పశువులు అలాగే తింటున్నాయి. అవి జీర్ణం కాకపోవడంతో మృత్యువాత పడుతున్నాయి.

జిల్లాలోని ఐదు పురపాలికల్లో ప్రతి రోజు మూడు క్వింటాళ్ల ప్లాస్టిక్‌ను పారబోస్తున్నారు. సూర్యాపేట 1 క్వింటా, కోదాడ 80 కిలోలు, హుజూర్‌నగర్ 55, నేరేడుచర్ల 30, తిరుమలగిరి 35 కిలోల వరకు నిత్యం రోడ్ల వెంట, మురుగు కాల్వల్లో పారబోస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటి వాడకం పెరిగి పొలాల్లో విరివిగా కనిపిస్తున్నాయి. పురపాలికల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వారిపై జరిమానా విధించినా అమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకటి, రెండు పురపాలికల్లో అవగాహన కల్పిస్తున్నా నివారణకు అడ్డుకట్ట పడటం లేదు. కవర్లు విక్రయించిన దుకాణాలపై దాడులు చేసి నామమాత్రంగా జరిమానా విధిస్తుండటంతో నిషేధం కావడం లేదు.

**తనిఖీలు చేపట్టి నియంత్రిస్తాం**

-హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట

పట్టణ ప్రజలు ఇంట్లో మిగిలిన భోజనం, కూరలు కలిపి కవర్లలో నింపి రోడ్ల వెంట పారేయొద్దు. వర్షాలకు దుర్వాసన రావడంతోపాటు పశువులు తిని ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సిబ్బందితో తనిఖీలు చేయించి పట్టుబడితే జరిమానా విధిస్తాం.

# సూత్రధారులెవరు.. పాత్రధారులెవరు?



ఖమ్మం : నకిలీ పాసుపుస్తకాల వ్యవహారం కలకలం రేకెత్తించింది. తక్కువ సమయంలోనే కోటీశ్వరులు కావాలనే అత్యాశతో కొందరు ముఠాగా ఏర్పడ్డారు. కమీషన్ వస్తుందనే ఆశతో మధ్యవర్తులు జతకలిశారు. అందరూ కలిసి రైతుల కష్టాన్ని దోచుకున్నారు. ముఠా సభ్యుల్లో ఐదుగురిని కూసుమంచి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.


**ఆశ చూపి.. కమీషన్ పంచుకొని..**

కూసుమంచి మండలం జక్కేపల్లికి చెందిన కొత్త జీవన్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా బయ్యారం వాసి కొండూరి కార్తీక్, భద్రాద్రి జిల్లా పాల్వంచకు చెందిన పారిపత్తి సాయికుశాల్, లక్ష్మీదేవిపల్లి వాసి జక్కపల్లి వరప్రసాద్, సారపాకలో నివసిస్తున్న ఏకే ప్రింటింగ్‌కు చెందిన నందమూరి లక్ష్మణ్‌రావును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముఠా సభ్యులు కమీషన్లు ఇచ్చి మధ్యవర్తులను నియమించుకున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో ఐదెకరాల వెంచర్ ఉందని, అందులోని ప్లాట్లు ఇస్తామంటూ గాలం వేసినట్లు తెలిసింది. భూవివాదాల్లో చిక్కుకున్నవారు, కొన్నేళ్ల క్రితం తల్లిదండ్రులు విక్రయించగా మిగిలిన భూమి కోసం తిరుగుతున్న రైతులకు పాసుపుస్తకాలు ఇప్పిస్తామంటూ ముఠా సభ్యులు ఆశ చూపి.. ఎకరాకు రూ.5లక్షల చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో పది శాతం చొప్పున పంచుకున్నట్లు సమాచారం. బాధిత రైతులు ఒత్తిడి తీసుకురావటంతో నకిలీ పాసుపుస్తకాలు ముద్రించి ఇచ్చినట్లు తెలిసింది. వాటిలోని సర్వే నంబర్లు భూభారతి వెబ్‌సైట్‌లో కనిపించకపోవటంతో ఈ విషయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి జక్కేపల్లికి చెందిన రైతులు తీసుకెళ్లారు. స్థానికుల ఫిర్యాదుల ఆధారంగా పాసుపుస్తకాల కోసం ముఠా సభ్యులు రూ.2కోట్లకు పైగా దండుకున్నట్లు పోలీసులు చెబుతున్నా.. వివిధ జిల్లాలను కలుపుకొంటే రూ.10కోట్ల వరకు ఉంటుందని సమాచారం. 'పాసుపుస్తకాల పేరిట నిలువుదోపిడీ' శీర్షికనలో మంగళవా రం ప్రచురితమైన కథనంపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరాతీశాయి. జక్కేపల్లిలో బాధిత రైతులతో మాట్లాడి వివరాలు సేకరించాయి.

**భద్రాద్రి జిల్లాలో ముద్రణ!** నిందితులంతా వేర్వేరు మండలాలు, జిల్లాలకు చెందినవారే. అలాంటివారు ఎలా ముఠాగా ఏర్పడ్డారు.. ఇందులో సూత్రధారులెవరు, పాత్రధారులెవరో తేలాల్సి ఉంది. రైతులను మధ్యవర్తుల ద్వారా కలుసుకొని భద్రాద్రి జిల్లా సారపాకలో కలర్ ప్రింటర్‌తో పాసుపుస్తకాలు ముద్రించినట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఇటీవల మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో నకిలీ పాసుపుస్తకాలతో రుణాలు తీసుకున్నట్లు వెల్లడైంది. ఇందులో ముఠా ప్రమేయం ఉందా అనే చర్చ మొదలైంది. 'ఐదుగురు నిందితులను కోర్టులో హాజరుపరిచాం. వారిని కస్టడీలోకి తీసుకొని విచారిస్తాం. పరారీలో ఉన్న మరికొందరు నిందితులనూ పట్టుకుంటాం' అని ఖమ్మం గ్రామీణం ఏసీపీ తిరుపతిరెడ్డి కు తెలిపారు.

# స్థానిక ఉత్కంఠ

నల్గొండ : విజయదశమి ముంగిట స్థానిక సంస్థల సందడి మొదలైంది. కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు జారీ అవడంతో అధికార యం త్రాంగం ఈ పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, తాజా ఆదేశాలతో పల్లెల్లో ఎన్నికల జోష్ పెరిగింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.జిల్లాలో 33 జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. అందులో బీసీ రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు-14, 2011 జనాభా ప్రకారం ఎస్సీలకు-6, ఎస్టీలకు-5 చొప్పున 25 స్థానాలు రిజర్వేషన్ కానున్నాయి. మిగిలిన 8 స్థానాలు జనరల్ పరిధిలో ఉండే అవకాశం ఉంది. స్థానిక సంస్థలు, ప్రాదేశిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియ బాధ్యతలను జిల్లా కలెక్టర్ నుంచి ఎంపీడీవోల వరకు అప్పగించారు. జడ్పీటీసీ స్థానాలతో పాటు మండల పరిషత్తు అధ్యక్ష పదవుల రిజర్వేషన్లను కలెక్టర్, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను ఆర్డీవో, వార్డు బాధ్యతలను ఎంపీడీవోలకు అప్పగించడంతో ఆయా అధికారులు రెండు రోజులుగా కసరత్తు చేపట్టారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ రిజర్వేషన్లకు కేటాయించిన స్థానాలు మినహా ఇతర సీట్లను జనరల్ స్థానాలుగా కేటాయిస్తారు.రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, కులగణన వివరాలను జిల్లా అధికారులకు అందజేసింది. రిజర్వేషన్లు ఏ విధంగా చేపట్టాలనే సూచనలు కలెక్టర్లకు వివరించింది. 2011 జనాభా ప్రతిపాదికన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, ఇటీవల చేపట్టిన కులగణన లెక్కల ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఖరారు



చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సూచనలకు అనుగుణంగా సర్పంచులు, వార్డు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు అధికార యంత్రాంగం రెండు రోజులుగా కుస్తీ పడుతోంది. అధికారికంగా జీవో జారీ చేయగానే ఇప్పటికే ఖరారు చేసిన రిజర్వేషన్ల ఆధారంగా మహిళలకు 50శాతం స్థానాలు కేటాయించనున్నారు. వారికి డ్రా పద్ధతిలో సీట్లు ఖరారు చేసే అవకాశం ఉంది.

జడ్పీ ఛైర్మన్: 1
జడ్పీటీసీ స్థానాలు: 33
ఎంపీటీసీ స్థానాలు: 353
ఎంపీపీ స్థానాలు : 33
సర్పంచులు: 869
వార్డులు: 7494

# బీపీ.. తీపి.. రెండూ చేటే!

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రక్తపోటు, మధుమేహం వ్యాధులు విస్తరిస్తున్నాయి. ఆహార నియమాలు పాటించకపోవటం, శారీరక శ్రమ కరవైన వారిలో ఈ వ్యాధుల ముప్పు అధికంగా ఉంది. ఉభయ జిల్లాల పరిధిలో ఇన్సులిన్ తీసుకుంటున్న వారు 249 మంది యువతీయువకులు ఉన్నట్లు అధికారులు గుర్తించటం ఆందోళన కలిగిస్తోంది. నివారణ చర్యలపై దృష్టి సారించకుంటే మధుమేహం ఔషధాలు తీసుకుంటున్నవారు రోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్లు వేసుకోవాల్సిన స్థాయికి చేరుకుంటారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**జీవనశైలి వ్యాధుల లెక్కలిలా..**

వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణలో నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా జులై 1 నుంచి 6 వరకు సర్వే చేశారు. 30ఏళ్ల లోపు వారిలో ఖమ్మం జిల్లాలో 176 మంది, భద్రాద్రి జిల్లాలో 73 మంది మధుమేహం బారినపడి ఇన్సులిన్ తీసుకుంటున్నట్లు గుర్తించారు. 30ఏళ్లు నిండిన వారిలో 1,00,247 మందికి మధుమేహం, 1,65,946 మందికి అధిక రక్తపోటు ఉన్నట్లు తేల్చారు. ఖమ్మం జిల్లాలోని సర్కారు దవాఖానాల్లో 66శాతం మంది బీపీ, 64మంది మధుమేహం ఔషధాలు తీసుకుంటుండగా.. మిగిలిన వారంతా ప్రైవేటు మెడికల్ దుకాణాల్లో కొంటున్నారని గ్రహించారు. పాఠశాలల్లో గతంలో రెండు డ్రిల్ పీరియడ్లలో ఆటలు ఆడించేవారు. ఇప్పుడు పాఠశాలల్లో క్రీడాస్థలాలు లేవు. ఆటలు ఆడించేవారు అరుదు. పైగా చక్కెర ఎక్కువ కలిగిన తినుబండారాలు, శీతలపానీయాలు,



ప్యాకెట్లలో నిల్వచేసిన ఆహారం తింటున్న పిల్లలు మధుమేహం బారిన పడుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

**అతివల ఆరోగ్య వివరాల సేకరణ**

మహిళలకు వైద్యపరీక్షలు, చికిత్స, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పోషకాహారం, జీవనశైలిపై అవగాహన కల్పిస్తూనే బీపీ, మధుమేహం, రొమ్ము, గర్భాశయం, నోటి క్యాన్సర్, ఇతర వ్యాధుల వివరాలు సేకరించనున్నారు. శారీరక శ్రమ లేకపోవటంతో రుగ్మతలు వస్తున్నాయి. రక్తపోటు ఉన్నవారు ఉప్పు తక్కువగా తీసుకోవాలి. ఆహార నియమాలు పాటించాలి. ఒత్తిడి తగ్గించుకోవాలి. రోజూ మూడు లీటర్ల మంచినీరు తాగాలి. యోగా సాధన, వ్యాయామం తప్పనిసరి. మధుమేహం వ్యాధిగ్రస్థులు సమయానికి ఆహారం తీసుకోవాలి. క్యాన్సర్ కేసులు పెరుగుతున్నందున ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి. ప్లాస్టిక్ లంచ్‌బాక్సులు, నీళ్లసీసాలు వాడకపోవటం మంచిది. నిల్వ ఆహారం, జంక్‌ఫుడ్, ఎక్కువసార్లు మరిగించే నూనెలతో తయారుచేసిన వంటకాలు తినొద్దు. డా.రామారావు, ఎన్‌సీడీ కార్యక్రమ అధికారి, ఖమ్మం

# గుట్టలు గుటకాయ స్వాహా!

మల్లాపూర్ : కోరుట్ల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ స్థలాల నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. కొన్నేళ్లుగా సాగుతున్న ఈ తంతును కింది స్థాయి సిబ్బంది 'మామూలు'గా తీసుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.మల్లాపూర్‌తో పాటు మండలంలోని రాఘవపేట, చిట్టాపూర్, గొర్రెపల్లి గ్రామాల్లో పొక్లెయిన్ నిర్వాహకులు అనుమతులు లేకుండానే గుట్టలను తవ్వి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 'ప్రభుత్వ పెద్దల అండ ఉంద'ంటూ అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ముత్యంపేట శివారులోని ఓ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారని రైతులు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. గుట్టల చుట్టూ ఉన్న మట్టిని తొలగించడంతో సమీప రైతులు సదరు భూమిని ఆక్రమిస్తున్నా రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల పేరిట దందా**

కోరుట్ల పట్టణంలోని ఏస్కొనిగుట్టతో పాటు పలు ప్రాంతాల్లో అక్రమా



ర్కులు పొక్లెయిన్లు, టిప్పర్లతో పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట మట్టిని తీసుకెళ్లి ప్రైవేటు నిర్మాణాలకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఇందిరమ్మ లబ్ధిదారులు దరఖాస్తు చేస్తే గృహ నిర్మాణ సంస్థ అధికారుల ధ్రువీకరణతో రెవెన్యూ అధికారులు మట్టి తరలింపునకు అనుమతి జారీ చేయాల్సి ఉంటుంది. ఇటు అనుమతి రాక, అటు మట్టి దొరక్క లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో వరద కాలువ మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో మట్టి తరలింపు ఎక్కువగా సాగుతున్నట్లు సమాచారం.

మెట్‌పల్లి మండలం వెంకట్రావుపేట శివారు నుంచి మట్టి రవాణా జోరుగా సాగుతోంది. కొద్ది రోజుల కిందట మట్టిని తరలిస్తున్నారని వచ్చిన సమాచారంతో అటవీ శాఖ అధికారులు వెళ్లగా అక్రమార్కులు అడ్డుకున్నారు.అటవీ అధికారులు పోలీసులను ఆశ్రయించడంతో విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసులు నమోదు చేశారు.

**అక్రమార్కులపై చర్యలు తీసుకుంటున్నాం** జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. పలు చోట్ల మట్టిని తరలిస్తున్న వారిని గుర్తించి వాహనాలను సీజ్ చేశాం. ప్రభుత్వ అనుమతులతో త్వరలోనే జిల్లాలో మట్టి క్వారీలు ఏర్పాటు చేస్తాం.జయసింగ్, భూగర్భ గనుల శాఖ ఏడీ

చురకలు



# పదేళ్ల ఉద్యమ ఫలితం

మల్లాపూర్: పదేళ్ల కిందట నష్టాల కారణంగా మూసివేసిన ముత్యంపేట చక్కెర పరిశ్రమను తిరిగి తెరిపించేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఈనెల 26న పరిశ్రమలు, వ్యవసాయశాఖ అధికారుల బృందం పరిశ్రమను సందర్శించి చెరకు రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించనున్నారు. శుక్రవారం పరిశ్రమ పరిధిలో సమావేశం నిర్వహించేందుకు యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తుంది. చెరకు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఎంతమందిని పిలవాలి.. ఏ అంశాలపై చర్చించాలనే విషయాల్లో నిమగ్నమయ్యారు.

**కాంగ్రెస్ ఎన్నికల హామీ**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెరకు ఉత్పత్తిలో రెండో స్థానంలో నిలిచిన ఈ పరిశ్రమను 2015 డిసెంబరు 23న నష్టాల కారణంగా అప్పటి ప్రభుత్వం మూసివేసింది. దీంతో ఈ ప్రాంత రైతులు పదేళ్లుగా ఉద్యమాలు చేస్తూ వచ్చారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే దీనిని తెరిపించడంతోపాటు మద్దతు ధరను టన్నుకు రూ.4 వేల వరకు కల్పిస్తామని హామీ ఇచ్చింది. దీంతో గతేడాది మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన మంత్రుల బృందం పరిశ్రమను సందర్శించగా.. రైతుల అభిప్రాయ సేకరణకు అధికారుల కమిటీ రేపు రానుండటంతో రైతుల్లో ఆశలు చిగురుస్తున్నాయి.

**సాగు పెరిగితేనే మనుగడ**

పదేళ్లుగా పరిశ్రమను మూసివేసినప్పటికి జిల్లాలోని పలు మండలాలకు చెందినవారు చెరకును సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో లక్ష



టన్నుల మేర పంట ఉత్పత్తి అవుతుంది. దీన్ని క్రషింగ్ నిమిత్తం కామారెడ్డికి తరలిస్తున్నారు. ముత్యంపేట చక్కెర పరిశ్రమ పునరుద్ధరణకు నోచుకుంటే కనీసం 3.5 లక్షల టన్నుల నుంచి 4 లక్షల టన్నుల మేర పంట సాగు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు సదరు చెరకు విత్తనం ప్రస్తుతం రైతులకు అందుబాటులోలేదు. దీన్ని యాజమాన్యం సమకూరిస్తే రైతులు ముంచుకొచ్చే అవకాశముంది.

**ప్రభుత్వ లేదా ప్రైవేటు**

పరిశ్రమ పరిధిలో జరిగే అధికారుల కమిటీ ఎదుట తమ అభిప్రాయాలు తెలియజేసేందుకు చెరకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ అభిప్రాయ సేకరణలో రైతులకు గిట్టుబాటు ధర, చెల్లింపులు, క్రషింగ్ బకాయిలు, హర్వేస్టింగ్, విత్తన సబ్సిడీతోపాటు పలు సమస్యలను కమిటీ ముందు ఉంచనున్నారు. పరిశ్రమను ప్రభుత్వ ఆధీనంలో నడిపించినా.. ప్రైవేటు భాగస్వామ్యంలో అయినా తమకు అభ్యంతరం లేదని పేర్కొంటున్నారు.

# తెగులు.. దిగులు

రాజపేట: పత్తి పంటను తెగుళ్లు చుట్టుముడుతున్నాయి. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు వేరుకుళ్లు, ఎండాకు తెగుళ్లు ఉద్ధృతమవుతోంది. వీటికితోడు కొన్ని ప్రాంతాల్లో మెగ్నీషియం ధాతువు లోపం కూడా కనిపిస్తుండటంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు. పంట మొక్కలు క్రమంగా చనిపోతుండటంతో పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల మందుల కొనుగోళ్లు, పిచికారీకి అదనపు వ్యయం చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. వలిగొండ, ఆలేరు, మోత్కూరు, రాజపేట, ఆత్మకూర్(ఎం) ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లుగా తెలుస్తోంది.

**ప్రస్తుత పరిస్థితి ఇదీ..** అనువైన సమయంలో వానలు లేని కారణంగా ఎక్కువమంది రైతులు గతంలో కంటే పత్తిసాగుపైనే దృష్టి సారించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంట ఏపుగా పెరుగుతోంది. రేగడి నేలల్లో వర్షపునీరు కమతాల్లో అలాగే నిల్వ ఉండటంతో తెగుళ్ల ప్రభావం ఎక్కువగా ఉంటోంది.

వేరుకుళ్లు తెగులు వల్ల ఆకులు వంగిపోతున్నాయి. మొక్క అవలీలగా ఊడిరావడంతో పాటు వేర్లు నలుపురంగుకు మారుతున్నాయి. ఎండాకు తెగులు సోకిన పత్తి ఆకులు నేల రాలుతున్నాయి. కాండం మధ్యభాగం చామనచాయ రంగులోకి మారుతుండగా మొక్కలకు పోషకాల సరఫరాలేక ఎండిపోతున్నాయి. మెగ్నీషియం ధాతువు లోపం కారణంగా మొక్కలోని పత్రాలు ఎరుపుగా మారుతున్నాయి. దీనివల్ల మొక్కకు ఆహారం తయారు చేసుకునే శక్తి సన్నగిల్లి, క్రమంగా ఎండిపోతోంది.

**సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..**

శాంతినిర్మల, ఏడీఏ, యాదగిరిగుట్ట

ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో పత్తిరైతులు సస్యరక్షణ చర్యలు తప్పకుండా పాటించాలి. వేరుకుళ్లు, ఎండాకు తెగుళ్ల నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి ప్రభావిత ప్రాంతాల్లోనే మొక్క మొదళ్లలో పిచికారీ చేయాలి. ఆయా పంటలకు సోకుతున్న తెగుళ్ల నివారణకు స్థానికంగా వ్యవసాయాధికారులు, ఏఈవోలను సంప్రదించి నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలు పాటించాలి.

# ఆరోగ్య నగరం మన చేతుల్లోనే..

హైదరాబాద్: స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్ మొదటి స్థానంలో నిలిచింది. ఘన వ్యర్థాల నిర్వహణ, దుమ్ము నియంత్రణ, వాహనాలు, పరిశ్రమల ఉద్గారాల కట్టడి, లక్షలాది మొక్కలు నాటి పరిరక్షించడం, ఎలక్ట్రిక్, సీఎన్జీ బస్సుల వినియోగం తదితర చర్యల వల్ల వాయునాణ్యతలో ఆదర్శంగా నిలిచింది. స్వచ్ఛవాయు సర్వేక్షణ్‌లోనూ దానిదే మొదటిస్థానం. ఆరోగ్య నగరం కోసం ఈ విధానాలు మనమూ పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇండౌర్‌లో..15 ఏళ్లకు పైబడిన వాహనాలను తుక్కుగా మార్చడంలో నిబంధనల అమలుకాలుష్య నియంత్రణకు కేంద్రీకృత వ్యవస్థ

అటల్ ఇండౌర్ సిటీ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా డీజిల్ బస్సులను సీఎన్జీగా మార్పు. 550 కొత్త సీఎన్జీ బస్సుల ప్రవేశం, 10 వేల సీఎన్జీ ఆటోలు, 400 టాక్సీలు, ఎల్పీజీ ఆటోలకే అనుమతి. ఎలక్ట్రిక్ ఆటోలకు ప్రోత్సాహకాలు. 63 వేల కార్లను సీఎన్జీ, ఎల్పీజీ వాహనాలుగా మార్పు.

5 చోట్ల మల్టీలెవెల్ పార్కింగ్‌లు.

రోడ్లపై దుమ్ము రాకుండా మెకనైజ్డ్ స్వీపింగ్ మెషీన్లతోపాటు స్ప్రేయింగ్ మెషీన్ల వినియోగం.

నిర్మాణ రంగాల వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక యాప్.

**నగరంలో ఇలా..**

వాహన కాలుష్య తనిఖీలను కేంద్రీకృత వ్యవస్థ ద్వారా పర్యవేక్షణ కార్యరూపం దాల్చలేదు. రెండేళ్లుగా ఇంధన కాలుష్య తనిఖీలు లేవు.

280 ఎలక్ట్రిక్ బస్సులు, మూడు వేలకు పెంచాలనే ప్రతిపాదన.

85 లక్షల వాహనాలు ఉండగా అందులో విద్యుత్తువి 1.8 లక్షలే.

కేబీఆర్ పార్కు, నాంపల్లి చౌరస్తా వద్ద బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయం. మరో 30 చోట్ల నిర్మించాలనే ప్రతిపాదనలు38 స్వీపింగ్ మెషీన్ల వినియోగం. నీటిని చిమ్మే స్ప్రేయింగ్ యంత్రాలు లేవు.

# సాగు సర్వేలో జాప్యం



కరీంనగర్ : వానాకాలం పంటల సాగు నమోదులో మరింత వేగం పెరగాల్సి ఉంది. ఆగస్టు నెల ప్రారంభానికి ముందు నుంచే పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలి. కానీ జిల్లాలో యూరియా కొరత, పంపిణీలో ఇబ్బందులు, పారదర్శకతకు సర్వే చేపట్టాల్సిన ఏఈవోలకు పంపిణీ బాధ్యతలు సైతం అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా సర్వే ప్రారంభించడంలో జాప్యం జరిగింది. నాలుగైదు రోజుల నుంచి సాగు వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సమయానికే సగం సర్వే పూర్తి కావాల్సి ఉండగా, మూడో వంతు కూడా పూర్తి కాలేదు. అయినా సమయం మించి పోలేదని, వచ్చే నెల రెండో వారంలోగా సాగు వివరాల్నింటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులంటున్నారు.

**రైతుల ఇక్కట్లు** సరిపడా యూరియా అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో అవసరమైన వారికి అందకుండా పక్కదారి పట్టే అవకాశముండడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్, డీసీఎంఎస్, రైతు ఉత్పత్తి కేంద్రాలు తదితర యూరియా విక్రయాల కేంద్రాల వద్ద పారదర్శకతకు ఏఈవోలకు బాధ్యతలు అప్పగించారు. దీనికితోడు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రైతు బీమా దరఖాస్తులు తదితర పనులు సైతం చేపట్టాల్సి వచ్చింది. పంటల సాగు నమోదు తప్పనిసరి కావడంతో గత కొన్ని రోజుల నుంచి సర్వే ప్రారంభించారు. **వివరాల నమోదు ఇలా..**

వానాకాలంలో ఇప్పటి వరకు ప్రధాన పంటలు అయిన వరి 2,76,879 ఎకరాలు, పత్తి-44,875, మొక్కజొన్న-3,562 ఎకరాల్లో సాగు అయింది. మొత్తంగా అన్ని పంటలు కలిపి 3,25,955 ఎకరాల్లో సాగు కాగా, వివరాల నమోదు మాత్రం 93 వేల ఎకరాల్లో పూర్తి అయింది. మిగిలిన వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కొన్ని చోట్ల సాంకేతిక కారణాలు, రైతులు అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో సాగు వివరాల నమోదు ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

**త్వరలోనే పూర్తి చేస్తాం**

యూరియా పంపిణీ దగ్గర ఏఈవోలకు బాధ్యతలు అప్పగించడంతో.. సర్వేలో కొంత జాప్యం జరిగింది. త్వరలోనే సాగు వివరాల నమోదు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించాం. అందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం - జె.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# పండగ వేళ.. కొలువుల కళ



కరీంనగర్ : ఆర్టీసీలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. దాంతో ఎట్టకేలకు ఏళ్ల తరువాత రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో చోదకులు, శ్రామిక్‌ల పోస్టులు భర్తీ చేయాలని సంస్థ నిర్ణయించింది. ఇటీవలే దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1,100 డ్రైవర్, 743 శ్రామిక్ పోస్టుల ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది. ఇందులో కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల పరిధిలో 76 పోస్టులుండగా 46 చోదక, 30 శ్రామిక్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చూపారు. పోలీసు నియామక మండలి ద్వారా ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు.

**ప్రతిభ ఆధారంగా..**

శ్రామిక్ పోస్టులకు సంబంధించి అభ్యర్థి ప్రతిభ ఆధారంగా నియామక ప్రక్రియ ఉంటుంది. ఐటీఐలో చూపిన ప్రతిభ ఆధారంగా 90 మార్కులు, నేషనల్ అప్రెంటిస్‌షిప్, ధ్రువీకరణ పత్రాలకు 10 మార్కులు కేటాయించారు. మొత్తం 100 మార్కుల్లో ఓసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి 50, బీసీలకు 45, ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం మార్కులు రావాలి.

**వయసు సడలింపు**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు మూడేళ్లు

**నియామకం ఇలా...**

చోదకుల పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.

నోటిఫికేషన్ వెలువడిన తేదీ నాటికి 18 నెలలకు తక్కువ కాకుండా హెవీ ప్యాసింజర్ మోటార్ వెహికిల్/హెవీ గూడ్స్ వెహికిల్, ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.

1 నుంచి 7 తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, బీసీలు అయితే నాన్ క్రిమిలేయర్ పత్రాలు జతపర్చాలి.

చోదకుల పోస్టులకు పోటీ పడే అభ్యర్థుల ఎత్తు 160 సెంటీమీటర్ల కన్నా తక్కువ ఉండరాదు.

మొత్తం 100 మార్కుల్లో డ్రైవిగ్ పరీక్షకు 60, వెయిటేజీ కింద 40 మార్కులను కేటాయించారు.

ఏడు ప్యారామీటర్లలో చోదక పరీక్ష ఉంటుంది. దీనికి 60 మార్కులు కేటాయించారు. కనీసం 30 మార్కులు సాధించాలి. మూడు అంతకన్నా ఎక్కువ ప్యారామీటర్లలో కనీస మార్కులు సాధించాలి. లేదంటే ఫెయిల్ అయినట్లే. అభ్యర్థి పదో తరగతిలో సాధించిన మార్కులు, డ్రైవింగ్ లైసెన్స్ రకం, సీనియార్టీని అనుసరించి మార్కులు వేస్తారు. మొత్తం 100 మార్కులకు అర్హత సాధించాలంటే ఓసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలు 50, బీసీలు 45, ఎస్టీ, ఎస్టీలు 40 శాతం మార్కులు సాధించాలి.

దరఖాస్తు తేదీలు.. వెబ్‌సైట్ అక్టోబరు 8 నుంచి 28 వరకు.. %www.tgprb.in

# కార్యాలయాల కేంద్రంగా ధరూర్‌క్యాంపు



జగిత్యాల: ధరూర్‌క్యాంపు శ్రీరామసాగర్ జలాశయం పరిధి జగిత్యాలలోని ధరూర్‌క్యాంపు స్థలాలు ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు నెలవుగామారి పట్టణానికి కొత్తశోభను తెచ్చాయి. 1963లో నెహ్రూ చేతులమీదుగా శ్రీరామసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభంకాగా.. తదుపరి ప్రాజెక్టు పరిధిలోని చాలా ప్రాంతాల్లోనూ స్థలాలు సేకరించారు. ఈ క్రమంలో పట్టణ, ధరూర్ గ్రామ శివారులోని రైతులు, స్థానికులనుంచి 250 ఎకరాల వరకు స్థలాన్ని సేకరించి ధరూర్‌క్యాంపు పేరిట ప్రాజెక్టు పరిపాలన భవనాలు, అధికారులు, సిబ్బంది నివాస గృహాలను నిర్మించారు. ప్రభుత్వం అన్ని నీటి పారుదల అనుబంధ శాఖలను విలీనంచేసి జగిత్యాలలోని ధరూర్‌క్యాంపులోనే సీఈ, ఎస్ఈ, ఈఈల కార్యాలయాలను ఏర్పాటుచేశారు.

ధరూర్‌క్యాంపులో గతంలోనే బస్‌డిపో, గోదాములు, ఆగ్రోస్, విద్యుత్తు కేంద్రం, సబ్ డివిజన్ పోలీసు, రూరల్‌ఠాణా, న్యాయమూర్తుల నివాసగృహాలు, రిజిస్ట్రేషన్ కార్యాలయం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ భవనం, వాటర్ పంపింగ్ స్టేషన్, రెండు విద్యార్థుల వసతిగృహాలు, ఎస్సారెస్పీ, ఆర్అండ్‌బీ అతిథి గృహాలు, కేజీబీవీ, వాల్మీకీ ఆవాసం, ఉన్నత పాఠశాల తదితరాలను నిర్మించారు.

నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ, పోలీసు శిక్షణ కేంద్రం ఏర్పడగా.. ఐఎంఏ భవన్, అంబేడ్కర్ భవన్‌లకు స్థలాన్నిచారు. ఎస్సారెస్పీ నుంచి గతంలో గృహ నిర్మాణశాఖ హౌజింగ్‌బోర్డుకు ఇచ్చిన స్థలంలో ఇళ్లను నిర్మించి విక్రయించారు. ప్రస్తుతం గోదాములను తొలగించిన స్థలం, ఆగ్రోస్ నుంచి తీసుకున్న స్థలంలో వైద్య కళాశాలను నిర్మిస్తున్నారు.

**మరిన్ని ప్రభుత్వ విభాగాల ఏర్పాటు**

2016 అక్టోబరులో జగిత్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడగా.. ధరూర్‌క్యాంపులోని ఎస్సారెస్పీ స్థలంలోనే నూతన కలెక్టరేట్, పోలీస్‌శాఖ జిల్లా కార్యాలయం, ఎస్పీ భవన్, సిబ్బంది భవనాలు నిర్మించారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రం, డయాగ్నోస్టిక్ కేంద్రం, విద్యుత్తు ప్రగతి భవన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఉన్నతాధికారుల నివాస గృహాలు, జడ్పీ భవనం, పంచాయతీరాజ్, విద్యాభవన్, ఈవీఎంలను భద్రపరిచే గోదాము, భరోసా కేంద్రం, జిల్లా మహిళా సమాఖ్య భవనం, అమరవీరుల స్థూపం, రెండు పార్కులు, వ్యవసాయశాఖ ఏడీఏ, ఏవోల కార్యాలయాలు ఏర్పాటు చేశారు. జిల్లా కోర్టు భవనానికి స్థలాన్ని కేటాయించారు. క్యాంపును ఆనుకుని వెళ్తున్న ఎస్సారెస్పీ కాలువను పైపులతో మూసివేసి రహదారి విస్తరించనుండగా.. మరికొన్ని ప్రభుత్వ విభాగాలను ఇక్కడే ఏర్పాటు చేయనుండటం ప్రజలకు అత్యంత సౌకర్యంగా మారనుంది.

# పండుగ వేళ.. పట్టని పరిశుభ్రత

సూర్యాపేట : అనంతగిరి మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంట పలువురు దుకాణదారులు చెత్త వేస్తున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పండుగ వాతావరణం మొదలైంది. వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు స్వగ్రామాలకు తరలి వస్తున్నారు. ఈ సమయంలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా చూడాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం వీధి దీపాలు అత్యవసరం కావడంతో పంచాయతీ కార్యదర్శులు సొంతంగా ఖర్చు చేసి ఏర్పాటు చేస్తున్నారు. పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వచ్ఛతా హీ



సేవ-2025 కార్యక్రమంలో భాగంగా పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిని పట్టించుకోకపోవడంతో పల్లెలు, పట్టణాల్లో దోమల మోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ప్రధానంగా రహదారులను శుభ్రం చేయడం, మురుగు కాల్వల్లో పూడిక తీయడం, ట్యాంకులను శుభ్రం చేయడం, పెంట దిబ్బలను శుభ్రం చేయాల్సి ఉంది. వీటికి తోడు దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఖాళీ ప్రదేశాల్లో వాన నీరు నిలిచి మురుగుగా మారి దుర్వాసన వస్తున్నా శుభ్రం చేయకపోవడం, ఆయిల్ బాల్స్ వేయకపోవడంతో సమస్య తీవ్రతరం అవుతోంది. పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ పనులన్నీ సకాలంలో చేసినట్లయితే స్వచ్ఛతా హీ సేవ-2025 లక్ష్యం నెరవేరడంతో పాటు పండుగ వేళ పరిశుభ్రత బాగుంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కాగా ఇప్పటికే అప్పులు తెచ్చి మరీ గ్రామాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామని, కనీసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులు కూడా మంజూరు కాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చర్యలు తీసుకుంటున్నాం**యాదగిరి, డీపీవో, సూర్యాపేట

పల్లెల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నాం. పండుగ వేళ గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశాం. ఈ మేరకు వారు పారిశుద్ధ్య సిబ్బందితో పనులన్నీ సక్రమంగా చేయిస్తున్నారు. వాటిని పరిశీలించేలా మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.

# రైతుపైనే రవాణా భారం

గరిడేపల్లి: నియంత్రికల రవాణా ఛార్జీల చెల్లింపు వ్యవహారంపై గందరగోళం ఏర్పడింది. నిధులు ఉన్నా వినియోగించు కోవడం లేదని అధికారులు చెబుతుండగా.. తాము అన్నీ ఇచ్చినా నిధులు జమ కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నా నియంత్రిక తీసుకెళ్లిన రవాణా ఛార్జీ నగదు జమ కాలేదని వారు పేర్కొంటున్నారు.

**రవాణా ఛార్జీ ఇలా..**

వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్తు నియంత్రిక(ట్రాన్స్‌ఫార్మర్) కాలిపోతే దాన్ని మరమ్మతు కేంద్రానికి విద్యుత్ శాఖ వాహనంలోనే తీసుకెళ్లి తీసుకురావాలి. వాహనాలు లేకపోవడం, ఉన్న ఒక్క వాహనాన్ని శాఖ కార్యాలయ అవసరాలకు వాడుకుంటుండటంతో రైతులు స్వయంగా ట్రాక్టర్లలోనే తరలిస్తున్నారు. సీజన్‌లో నియంత్రిక కాలిపోతే దాన్ని ఎస్పీఎం (నియంత్రికల మరమ్మతు కేంద్రం)కు తీసుకెళ్లడానికి ట్రాక్టర్‌లు దమ్ముల్లో ఉంటాయి. ఆ సమయంలో కిరాయి పెట్టి తీసుకు వెళ్తుంటారు. ఇది రైతుకు భారం కావడంతో అప్పటి ప్రభుత్వం రవాణా ఛార్జీలు ఇవ్వడానికి ముందుకు వచ్చింది.

ఎస్పీఎం ఉన్న మండలంలోని ఏ గ్రామం నుంచి నియంత్రిక తీసుకువచ్చినా రూ.750 చెల్లిస్తారు. ఇతర మండలాల నుంచి తెస్తే రూ.1000 ఇస్తారు. రైతు తాను తెచ్చిన నియంత్రికకు సంబంధించిన



టీ నోటు, రైతు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ ఎస్పీఎంల వద్ద ఇచ్చి నమోదు చేయిస్తే చాలు. రెండు నెలల్లో ఆ రైతు ఇచ్చిన బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. నిధులు సైతం స్థానిక డివిజన్ అధికారుల వద్దే ఉంటాయి. వారే మంజూరు చేస్తారు. ప్రభుత్వం ముందుగానే (నియంత్రికల వివరాలు రాగానే) అధికారులకు రూ.లక్ష వరకు నిధులు జమ చేస్తుంది. అవి పూర్తయితే మరో రూ.లక్ష ఇస్తుంది.

**ఎక్కడ లోపం..**

రైతులు చాలా మంది నియంత్రిక తెచ్చి, టీ నోట్ ఇచ్చి అక్కడ సిబ్బందికి ఎంతో కొంత ఇచ్చి వెంటనే నియంత్రిక తీసుకెళ్తున్నారు. కొద్దిమంది ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్సులు ఇచ్చి వెళ్తున్నారు. వాటిని అక్కడి సిబ్బంది ఆన్‌లైన్ చేయకపోవడం, సరైన వివరాలతో డీఈలకు పంపకపోవడంతో సమస్య తలెత్తుతుంది. డీఈలకు అందిన వాటినే పరిగణనలోకి తీసుకుంటారు. అంటే ఎన్ని నియంత్రికలు వచ్చినా రైతుల వివరాలు అందిన వాటికే రెండు నెలల్లోగా నిధులు జమ చేస్తామని డీఈలు శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య తెలిపారు. ఇప్పటికైనా ఆధార్, బ్యాంకు ఖాతా ఇచ్చి నమోదు చేయించుకోవాలని సూచించారు.

చురకలు



# రుణాలకు కొత్త మెలిక

ఖమ్మం : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు లింకేజీ విషయంలో బ్యాంకర్లు కొత్త మెలిక పెట్టాయి. రుణం తీసుకునే ప్రతి మహిళ 'ఉద్యమ్ ఆధార్' తప్పనిసరిగా కలిగా ఉండాలని చెప్పడంతో వారంతా అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికిప్పుడు ఈ ప్రక్రియ అందరితో పూర్తి చేయాలంటే సాధ్యమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేవారు తమ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించేందుకు 'ఉద్యమ్ ఆధార్'ను తప్పనిసరిగా తీసుకోవాలని బ్యాంకర్లు చెబుతుంటారు. దీన్ని ప్రభుత్వ రుణంతో స్వయం ఉపాధి పొందే సంఘాలకూ వర్తింపజేస్తున్నారు. సంఘం తరఫున కనిష్ఠంగా రూ.లక్ష నుంచి అత్యధికంగా రూ.20లక్షల వరకు రుణాలు తీసుకునే వారందరూ ఉద్యమ్ ఆధార్ పత్రాన్ని తీసుకోవాలని చెప్పడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

**ఇబ్బందేంటి?**

ఉద్యమ్ ఆధార్ తీసుకోవాలంటే పాన్‌కార్డు, ఆధార్ కార్డు రెండూ ఉండాలి. పాన్, ఆధార్‌తో కచ్చితంగా అనుసంధానమై ఉండాలి. రుణం



తీసుకునేవారు ఏదో ఒక వ్యాపారం నడుపుతున్నట్టుగా ట్రేడ్ లైసెన్స్ లాంటి పత్రాలను తీసుకోవాలి. ఇవన్నీ ఉంటేనే ఉద్యమ్ ఆధార్ పత్రాన్ని తీసుకోవచ్చు. ఉభయ జిల్లాల్లో చాలామందికి పాన్ ఉన్నా ఆధార్‌తో అనుసంధానం కాలేదు. ఇప్పటికిప్పుడు చేయించుకోవాలన్నా కనిష్ఠంగా 15 రోజులు పడుతుంది. రూ.1100 వరకు ఖర్చు అవుతుంది. రెండు కార్డుల్లో పేర్లలో చిన్న లోపాలున్నా మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఇదంతా మెప్మా సభ్యులకు భారంగా మారుతుంది. దీంతో రుణాలపై ఆసక్తి చూపేందుకు అవకాశం లేకుండా పోతుందన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. ఖమ్మం జిలాల్లో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను మెప్మా పరిధిలో ఉన్న 7640 సంఘాల్లో 1220 సంఘాలకు రూ.205.64 కోట్లతో రుణాలు ఇవ్వాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు ప్రతిపాదనలు చేసింది. ఏడు దివ్యాంగ సంఘాలకు రూ.23లక్షలు, 10 వీధి వ్యాపారుల సంఘాలకు రూ.28లక్షలు రుణాలు కేటాయించారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు రుణాలు తీసుకునే ప్రతి సభ్యులు ధ్రువీకరణ పత్రాన్ని కచ్చితంగా పొందాలి.

ఒక్క ఖమ్మం జిల్లాలో చూసినట్టయితే మెప్మా పరిధిలోని 70వేల మంది మహిళలు ఉద్యమ్ ఆధార్ పొందాల్సి ఉంది. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదించగా ఇప్పటికే నూతన విధానానికి సంబంధించి కొంతమంది ఆర్పీలకు శిక్షణ ఇచ్చామని, వారి ద్వారానే నమోదు చర్యలు తీసుకుంటామన్నారు.

భద్రాద్రి జిల్లాలో చూసినట్లయితే 3,369 మెప్మా సంఘాలున్నాయి.

# 'సూపర్ స్పెషాలిటీ' సేవలు అందని ద్రాక్షేనా..?

నిజామాబాద్ : నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సేవలు ప్రారంభమై 13 ఏళ్లు గడుస్తోంది. ఇప్పటికీ సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో లేవు. ప్రత్యేక వైద్య నిపుణులకు ఎంతో డిమాండ్ ఉంది. రోగ నిర్ధారణ, శస్త్రచికిత్సలకు అధునాతన పరికరాలు సమకూర్చాల్సి ఉంది. ఇవేవీ అందుబాటులో లేక రోగులు హైదరాబాద్, వరంగల్ వంటి ప్రాంతాలకు వెళ్తున్నారు.

జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య సేవల అవసరాన్ని గుర్తించిన గత సూపరింటెండెంట్.. ఒప్పంద వైద్యుల ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం కొన్ని విభాగాల సేవలు ప్రారంభించారు. కానీ, ప్రత్యేక థియేటర్లు, అధునాతన పరికరాలు తగినన్ని లేవు. సేవలు అరకొరగా అందుతున్నాయి. పక్కనున్న ఆదిలాబాద్ ప్రభుత్వ కళాశాలలో సూపర్ స్పెషాలిటీ విభాగాన్ని అధికారికంగా అందుబాటులోకి తెచ్చారు. భారత వైద్య మండలి (ఎన్ఎంసీ) నిబంధనలకు సరిపడా వైద్యులున్న నిజామాబాద్ జీజీహెచ్‌పై మాత్రం చిన్నచూపు చూస్తున్నారు. సమస్యపై సూపరింటెండెంట్ డా.శ్రీనివాస్ స్పందిస్తూ.. 'ప్రస్తుతం న్యూరో, యూరాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి. శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నాం. అధికారికంగా సూపర్ స్పెషాలిటీ విభాగాన్ని ప్రారంభించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం' అని అన్నారు.

**ఇదీ.. పరిస్థితి**

ఈ నెల 1న 2,339 ఓపీ నమోదైంది. 122 మంది ఇన్ పేషెంట్లుగా చేరారు. వీరిలో చాలా మందికి ప్రత్యేక వైద్య సేవలు అవసరం. ఆ స్థాయి నిపుణులు, పరికరాల్లేక పెద్దాసుపత్రులకు సిఫార్సు చేస్తున్నారు.




అత్యవసర కేసులు, హృద్రోగం, గుండెపోటు బాధితులు హుటాహుటిన ప్రైవేటు ఆస్పత్రులకు లేదా హైదరాబాద్‌కు వెళ్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ నిపుణుల్లేక రూ.7 కోట్ల విలువైన యాంజియోగ్రామ్ యంత్ర పరికరాన్ని రెండేళ్లుగా మూలన పెడుతున్నారు.

ప్రస్తుతం ఒప్పంద న్యూరో ఫిజిషియన్, యూరాలజీ వైద్య నిపుణులు ఇద్దరు సేవలందిస్తున్నారు. ప్రత్యేకంగా థియేటర్లు, పరికరాలు లేక శస్త్రచికిత్సలు ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం అత్యవసర కేసులను చూస్తున్నారు. రోజుకు 15 న్యూరో, 10 వరకు యూరాలజీ ఆపరేషన్లు మాత్రమే చేస్తున్నారు.

హైదరాబాద్ మినహా రాష్ట్రంలో ఏ వైద్య కళాశాలలో లేనివిధంగా బ్రెయిన్ స్టంట్ వేసే వైద్యనిపుణుడు జీజీహెచ్‌లో ఉన్నారు. కావాల్సిన అధునాతన పరికరాల్లేక సదరు న్యూరో ఫిజిషియన్, ఇంటర్‌వెన్షన్ న్యూరాలజీ నిపుణుడు కేవలం ఓపీకే పరిమితమవుతున్నారు. అన్ని విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ సేవలను అధునాతన ఆపరేషన్ థియేటర్లు, యంత్ర పరికరాలతో అందుబాటులోకి తేవాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# అవినీతి నేత్రం.. పైసలిస్తేనే పత్రం..!



నల్గొండ : జిల్లా కేంద్రం పరిధిలోని చర్లపల్లికి చెందిన ఓ మహిళ 2008 నుంచి 2011 వరకు జిల్లా కేంద్రాసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన స్టాఫ్‌నర్సుల కొలువుకు పరీక్ష రాయడంతో పాటు అనుభవ ధ్రువపత్రం కోసం జనరల్ ఆసుపత్రిలో సంబంధిత అధికారుల చుట్టూ పది రోజులు తిరిగినా రికార్డులు లేవంటూ చెప్పారు. అటు నుంచి డీసీహెచ్ఎస్(జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి) కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌ను సంప్రదించగా రూ.10వేలు అడగడంతో అంత ఇచ్చుకోలేనని, రూ.6 వేలు అధికారి చెప్పిన వ్యక్తికి ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించారు. అడిగినంత నగదు ఇవ్వలేదన్న సాకుతో జిల్లా అధికారి సంతకం చేసిన ధ్రువపత్రాన్ని కూడా ఇవ్వలేదని బాధితురాలు 'న్యూస్‌టుడే'తో వాపోయారు. ప్రభుత్వం ఇటీవల ఆరోగ్యశాఖలో కొత్తగా కొలువుల ఎంపికకు కసరత్తు చేస్తుంది. దీని కోసం ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సులకు సంబంధించి పోటీ పరీక్షలు కూడా నిర్వహించారు. అర్హత ఉన్నవారిని ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసిన ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల (అభ్యర్థులు)కు అనుభవ ధ్రువపత్రాలను పొందుపరిచే అవకాశం కల్పించారు. జనరల్ ఆసుపత్రితోపాటు డీసీహెచ్ఎస్ కార్యాలయంలో ఈ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు సిబ్బంది పత్రాలు ఇవ్వడానికి సుముఖత చూపకుండా, కొన్ని దస్త్రాలు మాయం చేస్తున్నారు.

బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకొని అడిగినంత ఇచ్చిన తర్వాతనే పత్రాలు ఇస్తున్నారు. ఒక ఏడాది పనిచేసినట్లు వాస్తవ పత్రాలు ఇవ్వడానికి రూ.10 వేలు తీసుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. మరి కొందరికి రూ.20 నుంచి రూ.30 వేలు తీసుకుని 5 నుంచి 10 ఏళ్లు పనిచేసిన అనుభవం ఉన్నట్లు ధ్రువపత్రాలు ఇవ్వడంతోపాటు తనిఖీ సమయాల్లో దొరకకుండా రికార్డులను మాయం చేస్తున్నారు. ఈ దందా కార్యాలయ ఉన్నతాధికారులకు తెలియకుండా, వారిని పక్కదారి పట్టిస్తూ కొద్ది రోజులుగా పెద్దమొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని పేరు చెప్పడానికి ఇష్టపడని కార్యాలయాల సిబ్బంది తెలిపారు.

**చర్యలు తీసుకుంటాం**

డా.మాతృనాయక్, డీసీహెచ్ఎస్, నల్గొండ

అనుభవ పత్రాల కోసం వచ్చే నిరుద్యోగుల రికార్డులు పరిశీలించి వెంటనే ధ్రువపత్రాలు ఇస్తున్నాం. సకాలంలో వచ్చే అభ్యర్థులకు రికార్డులు వెతికి సంతకాలు చేస్తున్నాం. వారి నుంచి కింది స్థాయి సిబ్బంది డబ్బులు అడుగుతున్నట్లు మాకు ఎలాంటి ఫిర్యాదులు లేవు. పరిశీలించి డబ్బులు తీసుకునే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

# బకాయిదారుల్లో భయం!



గరిడేపల్లి: టెండరు ధాన్యం బకాయిదారుల నుంచి ధాన్యం వసూలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణకు దిగింది. వారిపై పీడీ యాక్టు ప్రయోగించేందుకు క్యాబినెట్ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. దానిపై విధివిధానాలు కూడా రూపుదిద్దుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. దాదాపు 18 నెలలుగా రకరకాల కారణాలు చెప్పి తప్పించుకుంటున్న మిల్లర్లకు ఉచ్చు బిగుసుకుంటోంది. రూ.కోట్ల విలువ చేసే ధాన్యం లేదా బియ్యం లేదా తత్సమానమైన డబ్బు జరిమానాలతో చెల్లించాల్సిందేనని పౌరసరఫరాల అధికారులు అంటున్నారు.

2022-23 యాసంగి సీజన్‌కు చెందిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం మిల్లర్లకు అప్పగించారు. కొనుగోలు చేసే సమయంలో వర్షాలు పడటం, ధాన్యం భారీగా కొనాల్సి రావడంతో కొంత నాణ్యత లోపించిందని మిల్లర్లు కొర్రీలు పెట్టారు. అందుకు బియ్యం ఇచ్చే విషయంలో తక్కువ తూకంతో తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటి భారాస ప్రభుత్వం యాసంగి ధాన్యాన్ని కొంత టెండరు ప్రక్రియ ద్వారా అమ్మకాలు చేయాలని నిర్ణయించింది. ఈలోగా ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా టెండరు పిలిచి అమ్మింది. ఇలా అమ్మిన ధాన్యం మిల్లర్ల వద్ద ఉంది. ప్రతి మిల్లు నుంచి ధాన్యం కానీ, బియ్యం కానీ, డబ్బు కాని ఇవ్వాలని గుత్తేదారు మిల్లర్లను కోరారు. మిల్లర్లు వివిధ కారణాలు చెబుతూ గుత్తేదారుకు ధాన్యం అప్పగించలేదు. అప్పటి నుంచి ప్రభుత్వం కొంత వసూలు చేసినా చాలా వరకు వారి దగ్గరే ఉండిపోయింది. దీంతో గుత్తేదారు కూడా ప్రభుత్వానికి డబ్బు చెల్లించకుండా నిలిపివేశాడు.

**రూ. 550 కోట్లకు పైగానే..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.550 కోట్లకు పైగా ఉన్న బకాయిల వసూలుకు ప్రభుత్వం గతంలో కొందరు మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టింది. అయినా బకాయి మిల్లర్లు తప్పించుకు తిరుగుతున్నారు. కొందరు తమ మిల్లుల పేర్లు మార్చేసి కొత్త పేర్లతో మళ్లీ సీఎంఆర్ ధాన్యం తీసుకున్నారు. కానీ ఈసారి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని పీడీ యాక్టు ప్రయోగం చేయాలని నిర్ణయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా మిల్లర్లలో చర్చ జరుగుతోంది. బకాయిదారులలో ఆందోళన మొదలైంది.

ఉమ్మడి జిల్లాలోని మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యం వేలం వేయగా.. అందులో దాదాపు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం(కొందరు డబ్బులు చెల్లించారు) గుత్తేదారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం మిల్లర్లు బకాయి పడ్డారు.

# పరుగు.. పాలపొంగుల వైపు..!



భువనగిరి : గూడులేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలోనే ముందుంది. కలెక్టర్ హనుమంతరావు, జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యేల ప్రత్యేక చొరవతో ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకుంటోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 9,495 ఇళ్లు మంజూరయ్యాయి. ముగ్గులు పోసినవి 7,740 కాగా, ఇంకా పనులు ప్రారంభించనివి 1,755 ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పనులు ప్రారంభించలేకపోతున్నామని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ఆత్మకూరు(ఎం) మండలంలో 23 గ్రామపంచాయతీలకు మొదటి విడతలో 359 ఇందిరమ్మ ఇళు మంజూరయ్యాయి. 33 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేమని అధికారులకు లేటఖలు అందించారు. మిగతా 326 మంది ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించగా.. అందులో ఒకరు గృహ ప్రవేశం చేశారు. 56 మంది శ్లాబులు పూర్తి చేశారు. 226 మంది పునాదుల నుంచి లెంటల్ వరకు నిర్మించారు. మండలంలో బునాదిగాని కాల్వ పారుతుండటంతో ఇసుక తరలింపు నిలిచిపోయి నిర్మాణాలు కాస్త మందగించాయని అధికారులు వివరించారు. చౌటుప్పల్ పురపాలిక పరిధిలో 300 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. 203 మంది సొంతంగా ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం ఇప్పించాలని కోరడంతో 30 మందికి రూ.లక్ష చొప్పున బ్యాంకుల నుంచి రుణం మంజూరు చేయించగా వారు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు.

**ఉన్న ఇంటిని కూల్చివేసి...**

ఆలేరు మండలం కొలనుపాకకు చెందిన నమిల ఉషది నిరుపేద కుటుంబం. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలు. భర్త, ఇద్దరు సంతానం. మూడు నెలల క్రితం కుమార్తెకు పెళ్లి చేసింది. అనంతరం వారం రోజులకే ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. రేకుల ఇంటిని కూల్చివేసి ఇంటికి నిర్మాణానికి ముగ్గు పోసింది. అప్పుపుట్టకపోవడంతో ఇంటి నిర్మాణం నేటికీ 'ముగ్గు'కే పరిమితమైంది.

**జిల్లా వివరాలు...**

మంజూరైన ఇళ్లు : 9,495
ముగ్గులు పోసినవి : 7,740
పునాదులు పూర్తయినవి : 5,049
రూఫ్ లెవల్‌లో ఉన్నవి : 911
రూఫ్ లెవల్ దాటినవి : 248
పూర్తయిన ఇళ్లు : 10
ప్రారంభించనివి : 1,755

**రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉన్నాం** విజయ్‌సింగ్ (పీడీ, యాదాద్రి భువనగిరి జిల్లా) ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో ఉంది. నిర్మాణాలతో పాటు చెల్లింపుల్లో కూడా ముందంజలో ఉన్నాం. ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

## ముక్కతోనే ముద్ద..!

భానుపురి: కొవిడ్ తర్వాత ఆహార శైలిలో మార్పులు చోటుచేసుకున్నాయి. శరీరానికి శక్తినిచ్చే పదార్థాలపై దృష్టిసారించారు. లాక్‌డౌన్ సమయంలో ఆరోగ్యకర ఆహారంపై దృష్టిసారించారు. అప్పటి నుంచి అదే అలవాటుగా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం మాంసం లేనిది ముద్దతినే పరిస్థితి లేకుండాపోయింది. అందులో చికెన్ అగ్రభాగాన నిలిచింది. **భారీగా వినియోగం** ఉమ్మడి నల్గొండ జిల్లాలో 11,42,708 కుటుంబాలు ఉన్నాయి. వీటిలో 30 శాతం మంది కూరగాయల భోజనంపై ఆసక్తి చూపగా మిగతా వారు మాంసాహారాన్ని ఇష్టపడుతున్నారు. 70 శాతం కుటుంబాల్లో వారానికి నాలుగుసార్లు మాంసం లేనిది ముద్ద దిగటం లేదు. కొవిడ్ కంటే ముందు వారానికి ఒక్కసారి తినేవారు. అప్పటి నుంచి చేపలు, చికెన్, మటన్ లేకుంటే ఆ రోజు ఇంట్లో తిండి సహించడంలేదు. ఉమ్మడి జిల్లాలో 6లక్షలకు పైగా చిన్నారులు ఉన్నారు. వీరు ఏ శుభకార్యానికి వెళ్లినా అక్కడ కూరగాయల భోజనం ఉంటే తినేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులో ఎవరైనా బయటకు తీసుకెళ్లి బిర్యానీ వంటి వాటిని తినిపిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రోజుకు 83 టన్నుల చికెన్ వినియోగిస్తారు. ఆదివారం, పండుగల వేళల్లో 85 నుంచి 90 టన్నుల వరకు అమ్మకాలు చేపడుతున్నారు. గత ఐదేళ్ల క్రితం 49 టన్నుల వాడకం ఉండగా ఇప్పుడు అదనంగా 34 టన్నులు పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 4115 చికెన్ దుకాణాలు ఉన్నాయి. ప్రతి దుకాణంలో రోజుకు 30 నుంచి 50 కిలోల వరకు విక్రయాలు చేపడుతున్నారు. ప్రత్యేక రోజుల్లో అమ్మకాలు రెట్టింపు సంఖ్యలో జరుగుతుంటాయి.

# శిథిల భవనాలతో 'భయం.. భయం'

బోధన్ : ప్రతిరోజూ వందలాది మంది ప్రజలకు సేవలందిస్తున్న బోధన్ మున్సిపల్, ప్రభుత్వ దవాఖానా భవనాలు శిథిలావస్థకు చేరాయి. 30 ఏళ్ల కిందట వీటిని నిర్మించారు. ప్రస్తుతం ఇవి వర్షం పడితే ఉరుస్తున్నాయి. ఫలితంగా రెండు భవనాలకు వచ్చే ప్రజలు, రోగులతో పాటు విధులు నిర్వహించే అధికారులు, వైద్యులు, ఇతర సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. రెండింటిలోనూ సేవలందించడం ఇబ్బందికరంగా మారింది.

**ఇదీ పరిస్థితి..**

బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా దవాఖానాకు నిత్యం 600 వరకు ఓపీ.. 60కి పైగానే ఐపీ ఉంటుంది. ఆసుపత్రిలోని పైఅంతస్తులో ఉన్న గదుల్లోని పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో గతంలోనే వీటిని మూసేశారు. ఉన్న గదుల్లోనే రోగులకు వైద్యం అందిస్తున్నారు. దీంతో కాలానుగుణ వ్యాధుల సమయంలో సరిపడా రూములు లేక ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందించిన పరిస్థితి ఉంది. ఇటీవల ఇంజినీర్లు భవన పరిస్థితిని పరిశీలించారు. వారు



తమ నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఇక మున్సిపల్ కార్యాలయం వర్షం పడితే చిత్తడిగా మారుతోంది. నేలగా తడిగా అవకుండా సిబ్బంది బకెట్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు గోడలూ తేమగా మారుతున్నాయి. కొన్నేళ్లుగా వర్షాకాలంలో ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదు. కార్యాలయాన్ని మరో చోటుకు మార్చేందుకు పలు భవనాలను పరిశీలించారు. అవి కార్యకలాపాలు సాగించడానికి వీలుగా లేవని అధికారులు తేల్చడంతో ప్రస్తుతం ఉన్న భవనంలోనే సేవలు కొనసాగిస్తున్నారు. కొత్త భవనాలను నిర్మిస్తే మెరుగైన సదుపాయాలతో కూడిన సేవలందించే అవకాశముంది.

**అధికారులు ఏమన్నారంటే..**

మున్సిపల్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన విషయాన్ని 'న్యూస్‌టుడే' కమిషనర్ జాదవ్ కృష్ణ వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మరో చోటుకు కార్యాలయాన్ని మార్చేందుకు అనువైన భవనాలు లేవన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిత్ మాట్లాడుతూ.. ఇటీవల ఇంజినీర్లు ఆసుపత్రిని పరిశీలించి అందించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేశామన్నారు. భవనానికి మరమ్మతులు చేస్తారా?, కొత్త భవనానికి నిధులు మంజూరు చేస్తారా? అనేది తేలాల్సి ఉందన్నారు.

# పంట చెడి.. గుండె తడి

బోధన్: వరస ముంపునకు గురైన పంట చేలు చేతికి రాకుండా పోయాయి. నియోజకవర్గంలోని బోధన్, సాలూర, నవీపేట్, రెంజల్ మండలాల్లో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. పది రోజుల కిందట అల్పపీడన ప్రభావంతో ఎగువన మహారాష్ట్రలో కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలో గోదావరి పరీవాహకం, శ్రీరామసాగర్ ప్రాజెక్టు వెనుక జలాలు పోటెత్తాయి. పలు మండలాల్లో వరి, సోయా, పత్తి పైర్లు నీట మునిగాయి. మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా గత గురువారం రెండోసారి పైర్లు ముంపు బారినపడ్డాయి. నాలుగైదు రోజులు నీట మునగడంతో పైర్లు కుళ్లిపోయాయి. కళతప్పిన చేలను చూసి రైతులు గుండెలు బాదుకుంటున్నారు.

ఉమ్మడి బోధన్ మండలంలోని కొప్పర్గ, హంగర్గ, ఖండ్‌గాం, బిక్నెల్లి, సిద్దాపూర్, తగ్గెల్లి, ఖాజాపూర్, హున్సా, మందర్న, రెంజల్ మండలంలోని కందకుర్తి, బోర్గాం, నీలా, తాడ్‌బిలోలి, నవీపేట్ మండలంలోని అల్జాపూర్, మిట్టాపూర్, కోస్లీ, యంచ, బినోలా నాళేశ్వర్, తుంగిని గ్రామాల్లో వేల ఎకరాలు జలమయం అయ్యాయి. వరి పొట్ట దశలో ఉండగా, సోయా కాయలు పాలు పోసుకుంటున్నాయి. పత్తి కాయ కాస్తోంది. వరుసగా రెండుసార్లు ముంపునకు గురవగా, చేతికందాల్సిన పైర్లన్నీ కుళ్లిపోయాయి. వరద తగ్గిన తర్వాత చేలకు వెళ్లిన రైతులు వాటిని చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. సుమారు 5 మండలాలపై తీవ్ర ప్రభావం ఉండగా, 26 వేల ఎకరాల్లో పూర్తినష్టం వాటిల్లింది. అరటి, కూరగాయలు 330 ఎకరాల్లో దెబ్బతిన్నాయి.

**ఒక్క ఎకరా మిగల్లేదు..: ఇర్వంత్‌రావు, హంగర్గ**



ఈ ఖరీఫ్‌లో 20 ఎకరాల్లో సోయాబీన్ వేశా. ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి పెట్టా. పైరు కాయ దశకు రాగా గోదావరి వరదలు, ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో పైరంతా మునిగింది. ఒక్క ఎకరా మిగల్లేదు. పెట్టుబడి, పంట ఆదాయం కలిపి మొత్తం రూ.20 లక్షల నష్టం వాటిల్లింది. మా కుటుంబం ఇప్పట్లో కోలుకునే పరిస్థితిలో లేదు.

**అప్పుల్లో కౌలు రైతులు: లక్ష్మణ్, హంగర్గ**

భూమి కౌలుకు తీసుకుని మూడెకరాల్లో సోయా, రెండెకరాల్లో వరి వేశా. ఒక ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టా. రెండు పంటలూ వరద పాలయ్యాయి. ఖరీఫ్‌లో పంట చేతికందితేనే రబీలో పంట సాగు చేసే పరిస్థితి. పూర్తి పంట నష్టంతో అప్పులే మిగిలాయి. బ్యాంకులో, ప్రైవేటు వ్యాపారుల వద్ద వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టా. శ్రమంతా నీటిపాలైంది. ప్రభుత్వం పరిహారమివ్వాలి. యాసంగికి విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి.

# మద్దిలేరు.. ఆక్రమణల ఏరు



నంద్యాల : మద్దిలేరు వాగులో ఆక్రమణ'హోరు' సాగుతోంది. నల్లమల కొండల్లో కురిసిన వర్షాలతో ప్రవాహం ప్రారంభమై.. తెలుగుగంగ, కేసీ కాల్వలను అనుసంధానం చేసుకొంటూ బండిఆత్మకూరు మండలం రామాపురం గ్రామానికి చేరుకుంటుంది. ఇక్కడ ఎస్కేప్ ఛానల్, వాగుపై నాలుగు గేట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ 1900 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంటుంది. ఇక్కడి నుంచి ఈర్నపాడు-మణికంఠాపురం గ్రామాల మధ్య పెద్దవాగుగా మారి నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామ సమీపంలోకి ప్రవాహం చేరుతుంది. ఇక్కడి సంకలవాగుతో కలిసి నంద్యాలలోని కుందూ నదిలో కలుస్తుంది. 50 మీటర్ల వెడల్పు ఉంటే ఈ కాల్వ ఆక్రమణలతో 20 మీటర్లకు కుచించుకుపోయింది.

**నేతలే మేతగాళ్లు**రామాపురం సమీపంలోని ఎస్కేప్ ఛానల్ నుంచి ఈర్నపాడు-మణికంఠాపురం రహదారి ప్రధాన వంతెన వరకు మద్దిలేరు వాగు 50 మీటర్ల వెడల్పులో ఉంది. ఇది దస్త్రాలకే ఇది పరిమితమైంది. రాజకీయ అండదండలతో రామాపురం నుంచి 6 కి.మీ.ల పొడవునా అడుగడుగునా ఆక్రమణకు గురైంది.

గేట్ల సమీపంలోనే ఒక నాయకుని అనుచరుడు పదేళ్ల క్రితమే మూడు ఎకరాలు ఆక్రమించి సాగు చేస్తున్నారు. వాగు పొడవునా 50 ఎకరాలకు పైగా భూమి 30 ఏళ్లుగా ఆక్రమణలకు గురవుతూనే వస్తుంది. సగం కాలువ ఆక్రమణలకు గురికావడంతో 1900 క్యూసెక్కుల ప్రవాహం ఉండాల్సినా.. ప్రస్తుతం 900 క్యూసెక్కులకే పరిమితమైంది.

**వర్షాలు ఎక్కువగా కురిస్తే..** ఒక్కోసారి వాగులోకి 10 వేల క్యూసెక్కులు కూడా వస్తాయి. ఈ సమయంలో ఎస్కేప్ ఛానల్ గేట్లు ఎత్తితే వరద ఒక్కసారిగా వచ్చి ముంచుతోంది.

పల్లెలను ముంచుతున్నారువరద వచ్చిన ప్రతిసారీ రామాపురం గ్రామం, భూములు మునుగుతుండడంతో రైతులు నష్టపోతున్నారు. వర్షాలు విస్తారంగా కురిస్తే జిల్లా కేంద్రమూ మునుగుతుంది. నంద్యాల మండలం కొత్తపల్లె, భీమవరం గ్రామాల పొలాలను ముంచుతూ నంద్యాలలోని లోతట్టు ప్రాంతాలైన హరిజనవాడ, పెద్దబండ, ఆంజనేయస్వామి గుడి, జంబులమ్మ గుడి, పీవీనగర్ ప్రాంతాలను అతలాకుతలం అవుతోంది.

రామాపురం గ్రామస్థులతోపాటు పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఈర్నపాడు సమీపంలో వరద ముంపును తప్పించడానికి అండర్ టన్నెల్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చేసినప్పటికీ భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో సాధ్యం కాలేదు. దీంతో ఆక్రమిత భూమి ఎంత? అనే విషయంపై సర్వే చేయాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు.

రాజకీయ కారణాలతో ఈ సర్వే అటకెక్కింది. కొద్ది రోజుల క్రితం మద్దిలేరుకు వరద వచ్చినప్పుడూ సుమారు 5వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నట్లు కేసీ కాల్వ అధికారులు గుర్తించారు.

# 'యాప్'చుప్ దోపిడీ

చిత్తూరు :పెద్దపంజాణి మండలంలోని రాయలపేటలో ఐదేళ్లుగా బెట్టింగ్ యాప్‌ను నిర్వహిస్తున్న చందును స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు నగరంలో కొన్నినెలల కిందట బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఓ యువకుడు క్రికెట్ బెట్టింగ్ ఆడి రూ.15 లక్షలకుపైగా పోగొట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

బెట్టింగ్ యాప్‌లతో ప్రజలు కష్టార్జితాన్ని పోగొట్టుకుంటూ.. అప్పులపాలవుతున్నారని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వాటిపై నిషేధం విధించింది. కొన్ని పనిచేయకున్నా.. స్థానికంగా సృష్టించిన యాప్‌లతో వాటి నిర్వాహకులు ప్రజల రక్తాన్ని పిండేస్తున్నారు.

జిల్లాలో బెట్టింగ్ యాప్‌లు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. అమాయకులను వీధిపాల్జేస్తున్నాయి. నిషేధమున్నా.. కొందరు స్థానికంగానే యాప్‌లను సృష్టించి, యువతకు ఎరవేసి.. ఈ యాప్‌లతో బెట్టింగ్‌కు బానిసలుగా చేస్తున్నారు. పెద్దపంజాణి మండలానికి చెందిన చందు వంటి వారు జిల్లావ్యాప్తంగా ఉన్నారు. వీరి బారినపడి అనేక మంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

పొరుగు దేశాల బుకీలు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లోని వారిని సబ్-బుకీలుగా ఎంచుకుని బెట్టింగ్ యాప్‌లు ఇస్తున్నారు. వీరు పట్టణాలు, నగరాలకు చెందిన వారితో బెట్టింగ్ ఆడిస్తారు. ప్రస్తుతం నిషేధం ఉండటంతో విదేశాలకు చెందిన వారి లింక్‌లకు కాస్త తెరపడినా కొన్ని స్థానిక యాప్‌లు యువతపై పంజా



విసురుతున్నాయి. ఇవి మారుమూల పల్లెలకూ పాకాయి.

**రూ.50 లక్షల వరకు పందెం**

వీరు ఇస్తున్న యాప్‌లలో పందెం వేసే పరిమితి సుమారు రూ.50 వేల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటోంది. యాప్‌లు తీసుకునే వారు ఇతర దేశాల క్రికెట్ మ్యాచ్‌లు, గుర్రం పందెం, టెన్నిస్, బ్యాడ్మింటన్, మరికొన్ని ఆటలపై పందేలు కాస్తున్నారు. వీటిద్వారా 80 శాతం మంది నష్టాలపాలవుతున్నారు. అప్పులుచేసి మరీ ఆడి వాటిని తీర్చలేక బంగారం, ల్యాప్‌టాప్‌లు, వాహనాలను కుదువ పెడుతున్నారు. కొందరు యువకులు ఇంట్లో చెప్పలేక తనువు చాలిస్తున్నారు.

**చోద్యం చూస్తున్న యంత్రాంగం**

బెట్టింగ్‌పై పిడికిలి బిగించాల్సిన పోలీసు యంత్రాంగం తద్భిన్నంగా వ్యవహరిస్తోంది. ఆరోపణలపై కొందరిని అదుపులోకి తీసుకున్నా.. సిఫార్సులు రావడంతో విచారించకుండానే వదిలిపెట్టేస్తున్నారు. టీ20 మ్యాచ్‌లు జరిగే సమయంలో చిత్తూరులోని పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

**యువత వీటికి దూరంగా ఉండాలి**

బెట్టింగ్ యాప్ నిర్వహణ విషయం మా దృష్టికి వచ్చింది. తనిఖీలు చేస్తాం. బెట్టింగ్ నిర్వహిస్తూ ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం. యువత ఇలాంటి యాప్‌లకు, బెట్టింగ్ వ్యసనాలకు దూరంగా ఉండాలి.- తుషార్ డూడి, ఎస్పీ, చిత్తూరు

# ఆయన చెబితేనే పని!

చిత్తూరు :నరిగిపల్లెకు చెందిన రైతు కొనుగోలు చేసిన భూమి మ్యుటేషన్ నిమిత్తం కొన్ని నెలల కిందట చిత్తూరు అర్బన్ తహసీల్దారు కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. కాళ్లరిగేలా తిరిగినా పని జరగలేదు. తాను చెప్పిన ఓ అధికారిని కలిసి.. రూ.5 వేలు ఖర్చు పెట్టుకోవాలని కిందిస్థాయి ఉద్యోగి చెప్పడంతో పని జరిగింది.

భూ రికార్డుల మార్పు, నకిలీ పట్టాలు సృష్టించడం, తహసీల్దారు ఫోర్జరీ సంతకాలకు కింది స్థాయి సిబ్బందికి నేర్పిన ఘనత ఈ అధికారిదేననే ఆరోపణలున్నాయి. ఆయన చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఓ సహాయ విభాగాధికారి. సొంత మండలం చిత్తూరు. 17 ఏళ్లకుపైగా ఒకేచోట పాతుకుపోయారు. గతంలో ఒకసారి బదిలీ అయినా.. మళ్లీ ఉన్న చోటుకే పోస్టింగ్ వేయించుకున్నారు. సొంత విభాగంలోని పనుల కన్నా.. ఇతర విభాగాల పనులు చెక్కబెట్టడంలో నేర్పరి. పేదలకు దక్కాల్సిన ప్రభుత్వ భూములను అయినవారికి భూ పంపిణీ కింద ఎకరాలు పంచిపెట్టిన వ్యవహారంలో పాత్రధారి. సర్వే నుంచి మ్యుటేషన్ వరకు.. ఈయన్ను ప్రసన్నం చేసుకుని.. అడిగినంత ఇచ్చుకుంటే పనులన్నీ చకచకా జరిగిపోతాయనే పేరుంది. ఈయన వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

**కిందిస్థాయి సిబ్బంది ఈయన కనుసన్నల్లోనే..**

చిత్తూరు నగరం, గ్రామీణ ప్రాంతాల్లో పరిచయాలు ఉండటం, చిత్తూరు అర్బన్, రూరల్ మండలాల్లో విధులు నిర్వహిస్తుండటంతో రెండు మండలాల పరిధిలోని 39 వీఆర్ఏలు ఈయన కనుసన్నల్లోనే పని చేస్తున్నారు. తహసీల్దారు కార్యాలయంలో తనకంటూ ప్రత్యేక ఛాంబర్‌ను ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.

# చూస్తే సన్నగా.. తింటే రుచిగా

ఆళ్లగడ్డ :ధాన్యం గింజ సన్నగా.. పొట్టిగా ఉంటుంది.. వండితే తెల్లగా మెరుస్తుంది.. తింటే రుచిగా ఉంటుంది.. ఇలాంటి ప్రత్యేకతలున్న నంద్యాల సోనా(ఎన్‌డీఎల్ఆర్-7)కు భౌగోళిక గుర్తింపు ఇవ్వాలంటూ ఎమ్మెల్యే అఖిల ప్రియ అసెంబ్లీలో ప్రస్తావించారు.. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో పుట్టిన ఈ వంగడం ఎంతో ఖ్యాతిగాంచింది. జియోగ్రాఫికల్ ఐడెంటిటీ దక్కితే 'విలువ' పెరుగుతుంది. బీపీటీ-5204కు ప్రత్యామ్నాయ రకాన్ని రూపొందించడానికి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు 2009 నుంచి ప్రయత్నాలు ఆరంభించారు. బీపీటీ 3291తో సీఆర్157-212(కటక్ రకం)తో సంకర పరిచి ఎన్‌డీఎల్ఆర్-7(నంద్యాల రైస్)ను ఉత్పత్తి చేశారు. మరింత పరిశోధనలు చేసి 2018లో నంద్యాల సోనాను మార్కెట్లోకి తీసుకొచ్చారు. " ఆకుముడత, బ్యాక్టీరియల్ లీఫ్ బ్లైట్, దోమపోటును సమర్థవంతంగా ఎదుర్కొంటుంది.. సాధారణ సన్న రకాల్లో చక్కెర(గ్లైసెమిక్ ఇండెక్స్) స్థాయి 72 నుంచి 77 శాతం ఉండగా, ఎన్‌డీఎల్ ఆర్-7లో 65 నుంచి 70 శాతమే ఉంటుంది. ఎకరాకు 44 సంచుల దిగుబడి వస్తుంది.. గింజ సన్నగా, పొట్టిగా ఉండటంతో ఇతర రకాలను ఇందులో కల్తీ చేయడానికి వీలుండదు.. దీని పంట కాలం 135-140 రోజులు.. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో వేసుకోవచ్చని" శాస్త్రవేత్త డా.ఎన్.కె. గాయత్రి అన్నారు. ఈ రకం బియ్యం మగ్గపెట్టకుండానే భోజనంగా వండుకోవచ్చు. హొటళ్లలో బిర్యాని కోసం ఈ బియ్యాన్నే వినియోగిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. అక్కడ బియ్యంగా మార్చి నేరుగా విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఇక్కడ కిలో బియ్యం రూ.55 నుంచి రూ.60 వరకు ఉండగా విదేశాల్లో రూ.170 నుంచి రూ.230 పలుకుతోంది.

# ఏట్లో ప్లాట్లు.. అక్రమార్కులకు రూ.కోట్లు



కల్లూరు : కోడుమూరు, కల్లూరు నియోజకవర్గాల పరిధిలో ప్రవహించే వక్కెరవాగు అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. వాగు పొడవునా పలు ప్రాంతాల్లో పోరంబోకు స్థలాలను ఆక్రమించి స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. దీని చెంతనే స్థలాలు, పొలాలు ఉన్న వారు రూ.కోట్ల విలువ చేసే వాగు స్థలాలను దర్జాగా కలిపేసుకుంటున్నారు. మరికొందరు వాగును పూడ్చేసి వెంచర్లు వేసి.. ప్లాట్లు విక్రయిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ఈ కబ్జాలపై ఫిర్యాదులు అందినా.. మామూళ్ల మత్తులో రెవెన్యూ అధికారులే వాటిని తొక్కిపెడుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.వక్కెరవాగు కోడుమూరు మండలం కొత్తూరు నుంచి గూడూరు మండలం గుడిపాడు, పెంచికలపాడు మీదుగా వచ్చి కె.నాగలాపురం, కల్లూరు మండలం పర్ల గ్రామాల పొలిమేరలను తాకుతూ ఎ.గోకులపాడు, నెరవాడ, పెద్దపాడు మీదుగా ప్రవహిస్తూ కల్లూరు మండలంలోకి ప్రవేశిస్తోంది. పాత కల్లూరు మీదుగా కర్నూలు ఆనంద్ థియేటర్ సమీపంలో హంద్రీనదిలో కలుస్తోంది. పెద్దపాడు సమీపం నుంచి కల్లూరు వరకు సుమారు 3 కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తుంది. వాగుకు ఇరువైపులా పెద్దపాడు, కల్లూరు గ్రామాల భూములున్నాయి. ఈ భూములను కొందరు స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వాటి సమీపంలోని వక్కెరవాగు శిఖం (పోరంబోకు) స్థలాలను కబ్జా చేసి వెంచర్లలో కలిపేసుకుంటున్నారు. పెద్దపాడు సమీపం నుంచి కల్లూరు వరకు వాగుకు ఇరువైపులా సుమారు 20కి పైగా వెంచర్లు వెలిశాయి. వీటిని వేసిన రియల్టర్లు వాగును పూడ్చేసి పోరంబోకు స్థలాలను ఆక్రమించి చదును చేస్తున్నారు. అక్రమంగా ప్రహరీలు నిర్మించుకుని ప్లాట్లు వేశారు.

**అడ్డుగా గోడలు** పెద్దపాడు నుంచి కల్లూరు వరకు వక్కెరవాగును పలుచోట్ల కబ్జా చేసేశారు. ఈ ప్రాంతంలో సెంటు స్థలం ధర రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంది. ఎకరా రూ.కోటి నుంచి రూ.2 కోట్లకు పైగా ధర పలుకుతోంది. దీంతో అక్రమార్కులు పోటీపడి ఆక్రమిస్తున్నారు. ఇప్పటికే పదుల ఎకరాల స్థలాలు అక్రమార్కుల ఆధీనంలోకి వెళ్లాయి.

కల్లూరులో గతంలో వక్కెరవాగు స్థలాన్ని కబ్జా చేసిన ఓ వ్యాపారి నుంచి కల్లూరు రెవెన్యూ అధికారులు భూమిని స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటు చేశారు. తర్వాత దాన్ని పట్టించుకోలేదు. కొంతకాలానికి సదరు ఆక్రమణదారు ఆ బోర్డును తొలగించి సుమారు 10 సెంట్లకు పైగా స్థలాన్ని మళ్లీ ఆక్రమించి ప్రహరీ నిర్మించి హస్తగతం చేసుకున్నారు.

**కర'కట్ట' కథలు**

కల్లూరు పరిధిలో పెద్దఎత్తున వాగు కబ్జాలకు గురైంది. ఈ ప్రాంతంలో చాలాచోట్ల పిల్ల కాలువను తలపిస్తోంది. దీంతో భారీ వర్షాలు కురిసి వాగుకు వరద వచ్చిన సందర్భాల్లో పంట పొలాలు, జనావాసాలు మునిగిపోతున్నాయి.

2009 వరదల సమయంలో కల్లూరు ముంపునకు గురైంది. ఇళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మునిగిపోయి అస్తవ్యస్తంగా మారాయి. అప్పట్లో.. వరద నివారణ కోసం రక్షణ గోడలు నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చారు. అది ఇంతవరకు కార్యరూపం దాల్చనేలేదు.కల్లూరులో వాగు ఆక్రమణలు అధికం కావడంతో ఎగువ ప్రాంతాలైన పర్ల, ఏ.గోకులపాడు, నెరవాడ ప్రాంతాల్లో, కల్లూరు జిల్లా పరిషత్ స్కూల్, బుడగజంగాల కాలనీ, చింతలమునినగర్, కల్లూరు పారిశ్రామికవాడ సమీపంలోని కాలనీల్లో వరదనీరు నిలిచి, రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

జల వనరులశాఖ అధికారులు హంద్రీనదిని సర్వే చేసి పెద్ద పెద్ద స్తంభాలతో హద్దులు ఏర్పాటు చేశారు. హద్దులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇక.. సాంకేతిక సేద్యం..!

రాజమహేంద్రవరం: వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారిస్తున్నాయి. అయిదుగురు రైతులు సంఘంగా ఏర్పడి దరఖాస్తు చేస్తే 80 శాతం రాయితీలో దాదాపు రూ.10 లక్షల విలువైన డ్రోన్ సర్కారు అందిస్తోంది. జిల్లాలో 50 డ్రోన్లు మంజూరవ్వగా ఇప్పటికే 47 మందికి వీటిని అందించారు. రాష్ట్రీయ కృషీ యోజన, ఎస్ఎంఏఎంల ద్వారా రూ.9.80 లక్షల విలువైన డ్రోన్‌కు లబ్ధిదారు వాటా రూ.2 లక్షలు చెల్లిస్తే, మిగతా మొత్తం బ్యాంకు రుణంగా సమకూరుతోందని వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. రైతుల బృందంలో ఒక సభ్యుడికి డ్రోన్ పైలెట్ శిక్షణ ఇస్తున్నారు. వీటిని కృషి మ్యాపింగ్ యాప్‌కు అనుసంధానం చేసి వాటి వినియోగం, పనితీరుపై విశ్లేషణ చేస్తున్నారు. ఇప్పటి వరకు 29 డ్రోన్లను మ్యాపింగ్ చేశారు.

**చక్కని ఆదాయ మార్గం..**రోజుకు సగటున 25 ఎకరాల్లో ఎరువులు, పురుగు మందులు డ్రోన్‌లతో పిచికారీ చేస్తున్నారు. రూ.350తో ఎకరా విస్తీర్ణంలో అయిదు నిమిషాల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఇదే పని కూలీతో చేయిస్తే 3 గంటలు అవుతుంది. రూ.500 వేతనం చెల్లించాలి. ఏడాదిగా డ్రోన్ ఆపరేట్ చేస్తున్నానని..ఏడాదిలో ఆరు నెలలపాటు సీజన్ ఉంటే, రోజుకు సగటున 20 ఎకరాల్లో పిచికారీ చేస్తున్నట్లు రాజానగరం మండలం సంపత్‌నగరానికి చెందిన చిలకలపూడి వాసు తెలిపారు. ఎకరాకు రూ.350 తీసుకుంటున్నానని, రూ.50 నిర్వహణ ఖర్చు, సహాయకుడికి రూ.600 చెల్లిస్తున్నట్లు తెలిపారు.

**ప్రయోజనాలు ఎన్నో..**సాధారణంగా పిచికారీ చేస్తే ఎకరాకు సగటున 200 లీటర్ల నీరు అవసరం ఉంటుంది. డ్రోన్‌తో చేస్తే 10 లీటర్లు సరిపోతుంది.కూలీల సమస్య అధిగమించడంతోపాటు, పురుగు, ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.నానో యూరియా వినియోగిస్తే 90 శాతం ఉంటుంది. సాధారణ యూరియా చల్లితే చేలకు 30 నుంచి 40 శాతం మేర మాత్రమే ఉపకరిస్తుంది.

# శ్రీగిరి ఉద్యోగులకు గూడు

శ్రీశైలం : శ్రీశైల దేవస్థానం ఉద్యోగుల నివాస సముదాయాలు సున్నిపెంటలో సిద్ధమవుతున్నాయి. సుమారు రూ.60 కోట్లతో 3 బ్లాకుల సముదాయంగా నిర్మాణాలు చేపట్టారు. జీ+2గా నిర్మించిన సముదాయాల్లో 297 గదులు ఉన్నాయి. రెగ్యులర్ ఏఈవో క్యాడర్ నుంచి స్వీపర్ స్థాయి వరకు ఆయా హోదాలకు తగ్గట్లు గదులు కేటాయిస్తారు. నివాస సముదాయాల వద్ద స్తంభాల ఏర్పాటు, విద్యుత్తు సరఫరా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రూ.35 లక్షల అంచనాతో జీఎస్‌బీ రహదారులు నిర్మిస్తున్నారు. రూ.9 కోట్ల



అంచనాతో సీసీ రోడ్ల నిర్మాణానికి త్వరలోనే చర్యలు చేపట్టే అవకాశముంది. ఇప్పటికే 6 బోర్లు ఏర్పాటు చేశారు. ఉద్యోగులకు తాగునీటి కల్పనపై దేవస్థాన యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇటీవల హైదరాబాద్ ఐఐటీ నిపుణుడు వచ్చి క్వార్టర్స్ వద్ద బోర్ల ద్వారా నీటిని అందుబాటులోకి తీసుకురావడానికి తనిఖీలు చేశారు. తాగునీటి కోసం ప్రత్యేకంగా పైపులైన్‌తోపాటు నివాస సముదాయాల చుట్టూ రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది.

# నీళ్లడిగితే గరళమా ఇచ్చేది!

అమలాపురం : కొళాయిల ద్వారా కులుషిత నీరు రావడం, భూగర్భ జలాలు ఉప్పుగా మారడంతో డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అనేకమంది ప్రైవేట్ నీటిశుద్ధి కేంద్రాలపై ఆధారపడుతు న్నారు. ఇదే ఆసరాగా కొందరు వ్యాపారులు గరళ జలాన్ని జనానికి అంటగడుతున్నారు. జిల్లాలో 2500కు పైనే కేంద్రాలు ఉండగా 90 శాతం ప్లాంట్లకు అనుమతులు లేవు. ప్రైవేట్ నీటిశుద్ధి కేంద్రాల్లో కనీస ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. శుద్ధిచేయని నీటినే విక్రయిస్తుండటంతో వాటిని తాగిన ప్రజలు జీర్ణకోశ, కీళ్లనొప్పులు వంటి సమస్యల బారిన పడుతున్నారు. పంచాయతీ పరిధిలో పీహెచ్‌సీ వైద్యులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఎంపీడీవోలు.. నగరపాలక సంస్థల పరిధిలో పరిశ్రమలశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేయాలి. సమన్వయ లోపం, మామూళ్లకు అలవాటుపడిన కొందరు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

**కనిపించని శుచి** గృహాలు, వ్యాపారులకు 20 లీటర్ల డబ్బాలతో విక్రయిస్తున్నారు. వాటిల్లో నీటిని నింపిన తేదీ ప్రచురించాలి. రోజుల తరబడి నిల్వ ఉన్న డబ్బాలే ఇస్తున్నారు. వీటిని శుభ్రంగా కడిగి పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రం చేయడంతో పాటు స్టెరిలైజ్ చేయాలి. రివర్స్ ఆస్మోసిస్ వ్యవస్థ ద్వారా బ్యాక్టీరియా నిర్మూలించాలి. ఇది కానరాదు.ప్రతి పదివేల లీటర్ల నీటికి ఒకసారి ఫిల్టర్లు మార్చడం లేదు.ఎవరికి ఫిర్యాదు చేయొచ్చుగ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్... మున్సిపాలిటీల్లో కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఆహార భద్రతా అధికారులకు

**మచ్చుకు కొన్ని..**అమలాపురంలోని ఓ ప్రైవేట్ నీటిశుద్ధి కేంద్రంలో నీళ్లు కొనుగోలుచేయగా నాచు వచ్చింది. నిర్వాహకుడిని ప్రశ్నిస్తే నచ్చితే పట్టుకెళ్లండి.. లేదంటే మానేయండని సమాధానం వచ్చింది.

అల్లవరం మండలం దేవగుప్తం పరిధిలోని కేంద్రంలో లవణం ఎక్కువగా ఉంది.మలికిపురం మండలం కేశనపల్లి సమీప కేంద్రం నుంచి నీటిని సరఫరా చేసే డబ్బాలు పూర్తిగా పాచి పట్టి, దుర్వాసన వస్తున్నా విక్రయిస్తున్నారు.

మండపేటలోని ఓ ఆర్వో ప్లాంట్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని పురపాలిక అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. తమ పరిధిలోకి రాదంటూ దాటవేశారు.


**నిబంధనలు పాటించాలి**

శుద్ధజల కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలి. నిబంధనలు పాటించకపోయినా, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా చర్యలు తీసుకుంటాం. ప్రతివారం కచ్చితంగా తనిఖీలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. రామయ్య, ఆహార భద్రతాధికారి

# బరితెగింపు.. ఇసుక తరలింపు

రాజోలు : వశిష్ఠ నదీ తీరంలోని రాజోలు నియోజకవర్గం సోంపల్లి, దిండి రీచ్‌లలచి ఇసుకాసురులు బరితెగించారు. అధికారికంగా అనుమతులు లేనప్పటికీ స్థానిక నాయకుల కనుసన్నల్లో ఇసుక అడ్డగోలుగా తవ్వేసి తరలించేస్తున్నారు. రోజుకు నదిలోనుంచి తవ్వుతున్నదెంత? వసూలవుతున్న సొమ్ము ఎంత అనేది పక్కాగా ఉండేలా అనుకూలమైన వారికి, బంధువులకు వాటి నిర్వహణ బాధ్యత అప్పగించారు. వారం రోజులుగా యథేచ్ఛగా ఇసుక తీసి తరలించేస్తున్నారు. అక్రమ తరలింపుల సంగతి అధికార యంత్రాంగానికి తెలిసినా, ఫిర్యాదులు అందినా పట్టించుకోకపోవడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు ఉండటం లేదు.

సోంపల్లి రీచ్ నుంచి నిత్యం 65 నుంచి 70 వరకు ట్రాక్టర్ల ఇసుక తరలిపోతోంది. దిండి రీచ్‌లో రోజుకు 40 నుంచి 45 వరకు ట్రాక్టర్ల ఇసుక దందా జరుగుతోంది. నదీ పాయలోంచి ఇసుక తీసి పడవల ద్వారా తెచ్చి ట్రాక్టర్లలో నింపినందుకు కార్మికులకు రూ.950 చొప్పున



చెల్లిస్తున్నారు. ట్రాక్టర్లలో ఇసుక తీసుకువెళ్లేవారి నుంచి రూ.1,400 వసూలు చేస్తున్నారు. ఈ రెండు రీచ్‌ల్లో కార్మికులకు ఇచ్చిందిపోను రోజుకు దాదాపు రూ.51,750 దళారుల పరమవుతున్నాయి. ఈ లెక్కన చూస్తే వారం రోజుల వ్యవధిలో సుమారు రూ.3.62 లక్షల సొమ్ము అక్రమార్కులు ఆర్జించినట్లే. గతంలో ఇవే రీచ్‌ల్లో అనధికారికంగా ఇసుక తరలింపులు చేసి రూ.లక్షల్లో కాజేసిన ఇసుకాసురులు ఆగినట్టే ఆగి మళ్లీ అక్రమాలకు తెర తీశారు.

**చర్యలు చేపడతాం**

సోంపల్లి, దిండి రీచ్‌ల్లో ఇసుక తీయడానికి ఎవరికీ ఏవిధమైన అనుమతులు లేవు. అక్కడ అక్రమంగా ఇసుక తీయడంపై వెంటనే పరిశీలించి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేసి తరలింపులు జరగకుండా చేస్తాం. కె.మాధవి, ఆర్డీవో, అమలాపురం

# నెట్టికంటయ్య ఆలయానికి మహర్దశ

గుంతకల్లు : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంతో ప్రాశస్త్యం ఉన్న కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్న కోవెలను బాగు చేయడానికి దాతలు చక్కటి ప్రణాళికతో ముందుకొచ్చారు. ఆ ప్రణాళిక అమలుకు అధికారుల కార్యాచరణ సిద్ధమవుతోంది. ఇటీవలే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సైతం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశానిర్దేశం చూశారు. ఆలయ ఉపకమిషనర్ విజయబాబు, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మలు దాతలను సంప్రదించారు. సుమారు రూ.9 కోట్లు ఇవ్వడానికి సర్వం సిద్ధం చేశారు. ఇంకా రూ. 4 కోట్లు విరాళాలు ఇచ్చేందుకు కొందరు దాతలు సుముఖంగా ఉన్నారు. ఆయా నిధులతో ఆలయం రూపురేఖలు మార్చడానికి వీలుపడుతుందని అధికారులు ఆలోచనలో ఉన్నారు.



**కార్యాచరణ ప్రణాళిక..**

ఇటుకలతో నిర్మించిన గర్భగుడిని తొలగించి రాతితో పునఃనిర్మాణం చేపట్టడం. దీంతోపాటు గోపురం నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నారు. ఇపుడున్న ముఖమండపాన్ని తొలగించి కొత్త ముఖ మండపాన్ని నిర్మించడం. భక్తులు విడిది కోసం కాలం చెల్లిన వసతి గదులను తొలగించి వాటి స్థానంలో 90 కొత్త గదుల నిర్మాణం.

ఆలయం ముందు, పరిసరాల్లో ఉన్న దుకాణాల సముదాయాన్ని తొలగించి సమీపంలో కొత్త సముదాయాన్ని ఆధునిక హంగులతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు.

కొత్తగా యాగశాల, ప్రసాదాల తయారీ కేంద్రం, లడ్డూల కౌంటర్ల గదులు, స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. పుష్కరిణి, విమానగోపురం, అనివేటి మండపం, దీపస్తంభం, ధ్వజస్తంభాల ఏర్పాటు కొత్త నిర్మాణాల్లో కీలకంగా ఉన్నాయి.

# ఆలోచనే అవార్డు తెచ్చింది

మడకశిర : పట్టుదల, ప్రత్యేక శ్రద్ధ, సాధించాలన్న తపనతో ముందుకెళ్తే ఎంతటి కార్యాన్నైనా సాధించవచ్చని నిరూపించారు మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామానికి చెందిన మహిళా రైతు రజిని. నాలుగేళ్లుగా తనకున్న 1.80 ఎకరాల పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించి అంతర పంటలు సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తూ వందలాది మంది రైతులకు ఆదర్శంగా నిలిచి ఉత్తమ రైతుగా జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు.

**1.80 ఎకరాల్లో 30 క్వింటాళ్ల పత్తి**

ఆరు నెలల క్రితం రజిని తనకున్న 1.80 ఎకరాల పొలంలో సూరజ్ రకం నాన్‌బీటీ పత్తిపంట సాగు చేశారు. పత్తిసాళ్ల మధ్యన కంది, అనుప, అలసంద, ఆముదం, సజ్జలతో పాటు ముల్లంగి, బీట్‌రూట్, వంగ, బెండ, టమాటా, మునగ, చిక్కుడు తదితర కూరగాయాల పంటలు సాగుచేశారు. కేవలం ఘన, ద్రవ జీవామృతాలు పంటలకు వేసి 30 క్వింటాళ్ల పత్తి దిగుబడి సాధించారు. క్వింటాల్ రూ. 8వేలతో



విక్రయించారు. వీటితో పాటు అంతర పంటలు వేసిన కూరగాయలు, ఆకు కూరలతో రూ. 70వేలు ఆదాయం వచ్చింది. రెండు విధాలా ఆమెకు రూ. 3.10 లక్షల ఆదాయం చేకూరింది. తక్కువ పెట్టుబడితో ఇంతటి విజయాన్ని సాధించిన ఈమెను ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు.


**ఆమె చూపిన నైపుణ్యంతోనే..**

రసాయన ఎరువులతో సాగుచేసే నాన్ బీటీ పత్తి ఎకరాకు 9 క్వింటాళ్ల వరకు ఉంటుంది. ఈమె సేంద్రీయ పద్ధతుల్లో సాగుచేసిన పత్తిపంటలో ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 1.80 ఎకరాలకు 30 క్వింటాళ్ల నాణ్యమైన పత్తి దిగుబడి అందడంతో పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు ఈమెను ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు. ఈ క్రమంలో రజిని నాగ్‌పూర్‌లో శాస్త్రవేత్తల చేతుల మీదుగా జాతీయ ఉత్తమ మహిళా రైతుగా అవార్డు అందుకున్నారు.

లక్ష్మానాయక్, సీటీఐఓ, డీపీఎం, అనంతపురం

# యథేచ్ఛగా ఎర్రమట్టి దోపిడీ

శింగనమల : శింగనమల మండల పరిధిలో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారు. కొండలు, గుట్టలు క్రమంగా రూపుకోల్పోతున్నాయి. నాయనపల్లి క్రాస్ దగ్గర నార్పల వైపు వెళ్లే మార్గంలో ఎడమవైపున ఉన్న ఎర్రమట్టి కొండలు గతంలో పచ్చని చెట్లతో కళకళలాడుతూ ఉ



ండేవి. గత వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో కొండల్లో ఎర్రమట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల సాయంతో వెంచర్లకు తరలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అక్రమ దందా ఏమాత్రం తగ్గలేదు. రాత్రికి రాత్రే ట్రాక్టర్లు, టిప్పర్లతో ఎర్రమట్టిని తరలిస్తున్నారు. స్థానికంగా కొండల్లోని పచ్చదనం కనుమరుగవుతోంది. పశువులు, గొర్రెలు, మేకలకు గ్రాసం కొరత తలెత్తుతోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సర్కారు జాగాలో పాగా!



గుత్తి : గుత్తి పురపాలిక పరిధిలోని జగనన్న కాలనీల్లో భూదందా యథేచ్ఛగా సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన చోటా నాయకులు ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. దీంతో రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు, భూముల్లో నివాస గృహాలు వెలుస్తున్నాయి. చౌకగా ప్లాట్లు వస్తుండటంతో చాలా మంది అనధికారిక ప్లాట్లు కొంటున్నారు.

**ప్లాట్లు వేసి విక్రయాలు**

చెర్లోపల్లిలో సర్వేనంబరు 122లో 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో సుమారు పది ఎకరాల్లో మూడేళ్ల కిందట రెవెన్యూ అధికారులు జగనన్న కాలనీకి సేకరించారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన జాగాలో చోటా నాయకులు ప్లాట్లు వేసి విక్రయాలు చేపట్టారు. ఒక ప్లాటు రూ. 30 నుంచి 40 వేలకు అమ్ముతున్నారు. తామే రెవెన్యూ అధికారులతో పట్టాలు ఇప్పిస్తామని అమాయక ప్రజలను నమ్మిస్తున్నారు. ఇప్పటికే సుమారు వంద ప్లాట్లు విక్రయించినట్లు సమాచారం.

**నిర్మాణాలు చేపడుతూ..** కొత్తపేట లేఅవుట్‌లోని సర్వేనంబరు 682, 684, 697లో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మూడు సర్వేనంబర్లలో 500 మంది పేదలకు రెవెన్యూ అధికారులు పట్టాలివ్వగా కొత్త కాలనీ ఏర్పాటైంది. ఇక్కడా మిగులు స్థలాలను కొందరు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు.

**పావులు కదుపుతూ..**

నేమితాబాదు లేఅవుట్‌లోనూ సర్కారు స్థలాల క్రయ,విక్రయాలు సాగుతున్నాయి. లచ్చానిపల్లి లేఅవుట్‌లో సర్వేనంబరు 642లో జగనన్న కాలనీ ఏర్పాటు కాగా మిగులు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. కాలనీకి ముందు ఉన్న సర్వేనంబరు 643లో సుమారు రూ.కోటి విలువైన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ప్లాట్లు వేసేందుకు నాయకులు పావులు కదుపుతున్నారు. ఆ స్థలంలో ఉన్న తాటిచెట్లను కొట్టేసి భూమిని చదును చేశారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

గుత్తిలో ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. విచారణ చేసి కబ్జాలను అడ్డుకుంటాం. కబ్జాదారులపై చట్టపరంగా చర్యలు చేపడతాం. పుణ్యవతి, తహసీల్దారు, గుత్తి

# నీటి సంఘాల్లో 'జీఎస్టీ' గుబులు



అనంతపురం : హెచ్చెల్సీ.. చిన్ననీటి పారుదల(ఎంఐ) చెరువుల మరమ్మతుల నిర్వహణపై వస్తు,సేవల పన్ను (జీఎస్టీ) వ్యవహారం సాగునీటి సంఘాల అధ్యక్షుల్లో (అన్నదాతలు) గుబులు రేపుతోంది. మరమ్మతులు చేసేందుకు విముఖత చూపిస్తున్నారు. రెండు మాసాల క్రితం కూటమి సర్కారు నిధులు మంజూరు చేసింది. నీటి సంఘాల అధ్యక్షుల పేర్లపై జీఎస్టీ లైసెన్సు తెచ్చుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే ఎరువులు, విత్తనాలు, పరిహారం.. రాయితీ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్.. తదితర పథకాలు వర్తించవన్న ఆందోళన వారిని వేధిస్తోంది. లైసెన్సు తెచ్చుకున్నా త్రైమాసికాల వారీగా ఐటీ రిటర్న్ దాఖలు చేయాలి. దీనికి అయ్యే ఖర్చు ఎవరు భరిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

**సంఘాలకే అప్పగింత**

గత వైకాపా ప్రభుత్వం హెచ్చెల్సీ, చెరువుల మరమ్మతు, నిర్వహణకు పైసా ఇవ్వలేదు. దీంతో వాటి నిర్వహణ కష్టమైంది. కూటమి ప్రభుత్వం రాగానే సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. పూడిక, కంప చెట్ల తొలగింపు, మరమ్మతులు వంటి పనులను నీటి సంఘాలకే అప్పగిస్తూ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు.

**435 పనులు.. రూ.19.85కోట్లు**

అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో మొత్తం 435 పనులకు రూ. 19.85 కోట్లు విడుదల అయ్యాయి. ఒక్కో పనికి రూ. 60 వేల నుంచి రూ. 10 లక్షలు దాకా అంచనా విలువతో పనులకు శ్రీకారం చుట్టారు.

రూ. 10 లక్షలకుపైగా అయ్యే పనులకు టెండర్లు ఆహ్వానించారు. పనులు చేశాక బిల్లు అప్‌లోడ్ చేసే సమయంలో తప్పనిసరిగా జీఎస్టీ లైసెన్సు నంబరు నమోదు చేస్తేనే సాఫ్ట్‌వేర్ స్వీకరిస్తుంది.

**ప్రభుత్వానికి నివేదించాం**

నీటి సంఘాల అధ్యక్షులు సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. జీఎస్టీ లైసెన్సు విషయంగా ప్రభుత్వానికి నివేదిక పంపించాం. కొన్ని చోట్ల పనులు మొదలయ్యాయి. చాలా వరకు ప్రారంభించాల్సి ఉంది. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నాం.

విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఈ, జలవనరులు

# పేరుకే ఉచితం.. బాదుడులో ఘనం!




అనంతపురం: ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా 50 వేల మంది నుంచి ప్రతి రోజూ రూ. 10 అక్రమంగా వసూలు చేస్తున్నారు. ఉమ్మడి అనంత జిల్లాలోని ఆర్టీసీ బస్టాండుల్లో ఉచితంగా వాడుకోవాల్సిన మూత్రశాలలకు రూ. 5 నుంచి రూ. 10 వసూలు చేస్తున్నారు. మరోవైపు ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు రూ. 10 అదనంగా తీసుకుంటూ దోపిడీకి పాల్పడుతున్నారు. బస్టాండుల్లో ఉచితం బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు అక్రమ వసూళ్లను మాత్రం చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

**నెలకు రూ. 1.80 కోట్ల దోపిడీ**

ఉమ్మడి జిల్లాలో నిత్యం 2 లక్షల మంది దాకా ప్రయాణిస్తున్నారు. ఉచిత బస్సు పథకం తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. మూత్రవిసర్జన ఉచితం, మరుగుదొడ్లకు రూ. 2 చెల్లించాలని బోర్డులు ఏర్పాటు చేశారు. నిర్వాహకులు మాత్రం ఒక్కొక్కరి నుంచి రూ. 10 వసూలు చేస్తున్నారు. ఇలా రోజుకు రూ. 6 లక్షలు, నెలకు రూ. 1.80 కోట్లు ప్రయాణికుల నుంచి దోచుకుంటున్నారు.

**పార్కింగ్‌కు రూ. 30**

ప్రయాణ ప్రాంగణంలో ద్విచక్రవాహనం పార్కింగ్ చేస్తే 6 గంటలకు రూ. 5 చొప్పున రోజుకు రూ. 20 తీసుకోవాలి. ఇటీవల టెండరు దక్కించుకున్న వ్యక్తులు రూ. 30 వసూలు చేస్తున్నారు. ధరల పట్టిక ప్రదర్శించడం లేదు. ప్రశ్నిస్తే మేం కూడా ఆర్టీసీ అధికారులకు ఇచ్చుకోవాలని దబాయిస్తున్నారు. అనంత బస్టాండులో రోజుకు 1,000 నుంచి 1,200 ద్విచక్రవాహనాలు పార్కింగ్ వస్తున్నాయి. రోజుకు రూ. 10 వేలు, నెలకు రూ. 3 లక్షలు దోపిడీ చేస్తున్నారు.

**మూత్రశాలలు ఉచితమే..**

బస్టాండుల్లో మూత్రశాలలు పూర్తిగా ఉచితం. మరుగుదొడ్లకు మాత్రం రూ. 2 చెల్లించాలి. అనంతపురం బస్టాండులో నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తే స్టేషన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేయాలి. అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేశాం.

నాగభూపాల్, డిపో మేనేజరు, అనంతపురం

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**


మొత్తం బస్టాండ్లు: 13 బస్సులు: 950రోజు వారీ ప్రయాణికులు: 2 లక్షలు మూత్రశాలలు వినియోగించేవారు: 60 వేల నుంచి 70 వేలు

# నిబంధనలు చుట్టేస్తూ.. నచ్చినట్టు కట్టేస్తూ!!

విశాఖపట్నం : పేరుకు గృహ నిర్మాణ అనుమతులు పొందుతున్నారు. నిర్మించేది మాత్రం వాణిజ్య సముదాయాలు. గృహ నిర్మాణాల అద్దెలైతే నెలకు రూ. 15వేల వరకు ఇస్తారు. అదే వాణిజ్య సముదాయాలైతే రూ. లక్షల్లో అడ్వాన్సులు, నెలకు రూ. 30వేల నుంచి లక్ష వరకు అద్దె వసూలు అవుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని కొందరు నిర్మాణదారులు అడ్డదారుల్లో వెళుతున్నారు. జోన్-2 పరిధిలో మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది, ఎండాడ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

రెండు విధాలా ఇబ్బందే: వాణిజ్య సముదాయ అనుమతికైతే జీవీఎంసీ పట్టణ ప్రణాళికకు చెల్లించాల్సిన నగదు ఎక్కువగా ఉండటం, నిబంధనలు కొన్ని కఠినంగా ఉండటంతో... గృహ నిర్మాణ అనుమతుల పేరుతో మాయ చేస్తున్నారు. దీని వల్ల ఓ వైపు జీవీఎంసీ ఆదాయానికి గండి పడుతోంది. మరోవైపు నిర్మించిన వాణిజ్య సముదాయ గదులను బ్యాంకింగ్, ఫైనాన్స్ సంస్థలు, స్టోర్‌లు, ఇతర వ్యాపారాలకు ఇస్తున్నారు. వీటి వద్దకు వచ్చే వారు రహదారులపైనే వాహనాలు నిలిపేస్తుండటంతో పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయి. నిత్యం ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోతోంది.

పీఎంపాలెం ప్రధాన రహదారిలో రెండో బస్టాప్ కూడలిలో జీం3కి అనుమతులు పొందారు. ప్లాన్ ప్రకారం భూమికి సమాంతరంగా ఉండాల్సిన సెల్లార్‌ను భూగర్భంలో నిర్మించి గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేశారు. ఆ వాణిజ్య సముదాయాలకు వెళ్లే మెట్ల మార్గాన్ని జీవీఎంసీ కాల్వపై నిర్మించారు.



పీఎంపాలెం ప్రధాన రహదారిలో ఓ ప్రైవేటు ఆసుపత్రి ఎదురుగా గ్రూప్ హౌస్ నిర్మాణానికి అనుమతులు పొందారు. క్షేత్రస్థాయిలో చూస్తే అందులో రెండు అంతస్తులు వాణిజ్య సముదాయాలుగా మార్చేసి షట్టర్లు ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణం ఎదురుగా ఉన్న ప్రధాన మురుగు కాల్వను కప్పేశారు.

జీవీఎంసీ 8వ వార్డు బింద్రా నగర్ డబుల్ రోడ్డులో జీం 2 గృహ నిర్మాణానికి అనుమతులు పొందారు. గ్రౌండ్, మొదటి అంతస్తులు రెండూ షట్టర్లు వేశారు. రెండో అంతస్తు సైతం వాణిజ్య సముదాయంగా ప్రస్తుతం మార్పులు చేస్తున్నారు. పార్కింగ్‌కు వదలాల్సిన స్థలం సగభాగం నిర్మాణాలతో నింపేశారు.

ఓ వైపు ఒత్తిళ్లు..మరో వైపు వసూళ్లు: భవన నిర్మాణ ప్లాన్‌కు అనుమతులిచ్చాక..ఆ నిర్మాణం పూర్తయి క్లియరెన్స్ ఇచ్చే వరకు ఏసీపీ, టీపీవో పర్యవేక్షణలో సచివాలయ కార్యదర్శులు తనిఖీలు చేయాలి. నిబంధనలు మీరుతున్నట్లు సమాచారం వచ్చి క్షేత్రస్థాయిలో చర్యలకు వెళ్లిన సచివాలయ కార్యదర్శులకు కొందరు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇంటి కోసం ప్లాన్ తీసుకుని, వాణిజ్య సముదాయాలు నిర్మిస్తుంటే జీవీఎంసీ పన్నులు వేయడం, విద్యుత్తు అధికారులు మీటర్లు ఇవ్వడం వెనుక భారీగా ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇలాంటి ఫిర్యాదులొస్తే జీవీఎంసీ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కనీసం తనిఖీలు చేసి చర్యలు తీసుకోవడం లేదు. షట్టర్లు తీసేసి, గృహ నిర్మాణం జరిగేలా చూడాల్సి ఉన్నా నోటీసులిచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు.

# కొబ్బరి రైతు 'ధర'హాసం

ఎస్.రాయవరం: కొబ్బరి రైతులకు మంచి రోజులొచ్చాయి. ఇంతకుముందెన్నడూ లేనంతగా పంటకు రికార్డు స్థాయిలో ధర లభిస్తుండటంతో ఇటు రైతులు, అటు వ్యాపారుల మోమున ఆనందం వెల్లివిరుస్తోంది. మూడు నెలల నుంచి ధర పెరుగుతూ.. ప్రస్తుతం గరిష్ఠంగా వెయ్యి కాయలకు రూ. 30 వేలకు చేరింది. దసరా, దీపావళి పండగల సమయానికి ధర ఇంకా పెరిగే అవకాశం ఉంది.

అనకాపల్లి జిల్లాలో సుమారు 9,300 హెక్టార్లలో కొబ్బరి సాగవుతోంది. తీర మండలాల్లోనే తోటలు అధికం. ముఖ్యంగా ఎస్.రాయవరం మండలం మినీ కోనసీమగా పేరొందింది. గుడివాడ, రేవుపోలవరం, బంగారమ్మపాలెం, గుర్రాజుపేట, కొరుప్రోలు, ఎస్.రాయవరం, ధర్మవరం-అగ్రహారం, లింగరాజుపాలెం, సర్వసిద్ధి, వమ్మవరం పరిసర ప్రాంతాల్లో కొబ్బరి తోటలపై ఆధారపడి వేలాదిమంది జీవిస్తున్నారు. రైతులంతా ధర్మవరం-అగ్రహారం డైలీ మార్కెట్‌లో కురిడి, బొండాం, టెంకాయలను విక్రయిస్తారు. ఇక్కడి నుంచి వ్యాపారులు బీహార్, పట్నా, గోరఖ్‌పూర్, మహారాష్ట్రకు బొండాలను ఎగుమతి చేస్తారు. కురిడి, టెంకాయలను మాత్రం విశాఖపట్నం, శ్రీకాకుళం, నరసన్నపేట తదితర ప్రాంతాలకు పంపిస్తారు.

మూడు నెలల కిత్రం కొబ్బరి ధర (వెయ్యి) రూ. 15 వేలుగా ఉండేది. ప్రస్తుతం టెంకాయలు, బొట్ట కాయలు (వెయ్యి) రూ. 25-27 వేల మధ్య ఉండగా, బొండాలు (వెయ్యి) రూ. 18 వేల వరకు ధర పలుకుతున్నాయి. ధరలు మూడు నెలల్లోనే రెట్టింపయ్యాయి. కొందరు వ్యాపారులు కురిడి కాయలను నిల్వ చేసి, ఇప్పుడు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది తెల్లదోమ, తెగుళ్లు, ఇతర చీడపీడల వల్ల కొబ్బరి దిగుబడి తగ్గింది. గతంలో ఈ ప్రాంతంలో ఎకరాకు వెయ్యి కాయల చొప్పున దిగుబడి ఉండేది. ఇప్పుడు కేవలం 650 కాయల దిగుబడి మాత్రమే వస్తోంది. దీంతో నష్టాలు తప్పవని రైతులు భయపడినా ధర పెరగడం ఊరటనిచ్చింది.

# సొంత రక్తంతోనే సాంత్వన!

విశాఖపట్నం : జీవనశైలి మార్పులు, పోషకాహార లోపం, కీలు అరిగిపోవడం, అంతగా శ్రమ పడకపోవడం.. ఇలా కారణమేదైనా చిన్న వయసులోనే కీళ్ల నొప్పులు మొదలవుతున్నాయి. చాలా మంది వైద్యులను సంప్రదించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. శస్త్రచికిత్స చేయాల్సి వస్తుందని భయపడతారు. ఎలాంటి శస్త్రచికిత్స లేకుండా సమస్య పరిష్కారానికి ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా (పీఆర్పీ) చికిత్స అందుబాటులో ఉంది. ఇందులో రోగి నుంచి సేకరించిన రక్త నమూనాతోనే చికిత్స చేయడం గమనార్హం. పీఆర్పీ అంటే: రక్త పరీక్షకు తీసుకున్నట్లుగానే ముందుగా రోగి నుంచి రక్తనమూనా సేకరిస్తారు. యంత్రం సహాయంతో దాని నుంచి ప్లాస్మా, ప్లేట్‌లెట్లను వేరు చేస్తారు. వాటిని ఇంజక్షన్ ద్వారా ప్రభావిత ప్రాంతంలో ఎక్కిస్తారు. ఒక్కోసారి అవసరమైతే అదనంగా మరో ఇంజక్షన్ కూడా చేస్తారు. ఆస్టియో ఆర్థరైటిస్, టెండన్, లిగ్‌మెంట్ దెబ్బతింటే ఈ చికిత్స ఉపశమనం కలిగిస్తుంది.

**2022లో ప్రారంభం:** ప్రైవేటుగా అయితే ప్రాంతం, ఆసుపత్రుల పరంగా ఈ చికిత్సకు రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఖర్చవుతుంది. విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)లో 2022 డిసెంబరులో దీన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఉచితంగానే అందిస్తున్నారు. ఇప్పటివరకు 242 మందికి ఒక్కో కాలికి పీఆర్పీ చికిత్స చేశారు. మరో 40 మందికి రెండు కాళ్లకు చేశారు. ఈ ఏడాది 78 మంది దీన్ని వినియోగించుకున్నారు.

**నొప్పి రహితం.. త్వరగా ఉపశమనం**

1 కీళ్ల నొప్పులకు ఔషధాలు, శస్త్రచికిత్సలు, ఫిజియోథెరపీ తదితర




చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కొన్నేళ్లుగా పీఆర్పీ చికిత్సను ఎక్కువగా వినియోగిస్తున్నారు.

2 ఎన్ని మందులు వాడినా కీళ్ల నొప్పులు తగ్గకపోతే వైద్యులు పరిశీలించి పీఆర్పీ చికిత్సపై నిర్ణయం తీసుకుంటారు.

3 ఈ ప్రక్రియ నొప్పి రహితం. ఎక్కువ సమయం ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేదు. అవుట్ పేషెంట్ (ఓపీ) కింద చేస్తారు.

4 పీఆర్పీ చికిత్స ద్వారా రోగికి ఎలాంటి దుష్పరిణామాలు ఉండవు. చికిత్స చేసిన ఆరు నెలల నుంచి ఏడాదిలో పూర్తిగా సాధారణ స్థితికి వస్తుంది.

5 ఆస్టియో ఆర్థరైటిస్‌లో 4 దశలుంటాయి. ఒకటి, రెండు దశల్లో ఉన్నవారికి ఈ చికిత్స ఉపయోగపడుతుంది. ఇన్‌ఫెక్షన్ స్థాయి, రోగి వయసును పరిగణనలోకి తీసుకుని చికిత్స చేస్తారు.

6 అధిక బరువు, థైరాయిడ్, ఎముకలు బలహీనంగా ఉన్నా, ఎక్కువ సేపు నిలబడి పనిచేసే రోగులపై ప్రభావం తక్కువగా ఉంటుంది. ఇతర అనారోగ్య సమస్యలు లేనివారు త్వరగా కోలుకుంటారు.

**విమ్స్‌లో మాత్రమే..** –డా.కె.రాంబాబు, డైరెక్టర్, విమ్స్

విమ్స్‌లో ఎముకలు, కీళ్ల వ్యాధులకు అధునాతన వైద్య సేవలందిస్తున్నాం. ఇప్పటివరకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందించే ప్రత్యేకమైన పీఆర్పీ చికిత్సను ఉచితంగా చేస్తున్నాం. రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ ఈ చికిత్స అందుబాటులో లేదు.

# అతివల చదువుకు అక్షర ఆంధ్ర

అనకాపల్లి : జిల్లాలో రెండో విడత ఉల్లాస్‌కు రంగం సిద్ధమైంది. ఇప్పటికే 50 వేల పుస్తకాలు సరఫరా అయ్యాయి. నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) రెండో దశ కార్యాచరణ రూపొందించారు. కేంద్ర ప్రభుత్వ పథకాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోంది. 'అక్షర ఆంధ్ర' పేరును జత చేసి వయోజన విద్య శాఖకు లక్ష్యాలను నిర్దేశించింది. ఇప్పటివరకు గ్రామాల్లోనే నిరక్ష్యరాస్యులను గుర్తించి చదువు నేర్పించేవారు. ఈ ఏడాది నుంచి జీవీఎంసీ, మున్సిపాలిటీల్లోనూ ఎంపిక చేయాలని నిర్ణయించారు. జిల్లాలోని 24 మండలాలతోపాటు అనకాపల్లి జీవీఎంసీ, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీల్లో నిరక్ష్యరాస్యులను గుర్తించారు. వీరికి శిక్షణ అందించేందుకు వాలంటీర్లకు మండలాల వారీగా శిక్షణ ఇస్తున్నారు. జిల్లాకు లక్ష్యంగా నిర్ణయించిన 89,944 మంది కొత్త అభ్యాసకులకు ఈ నెల 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా రెండో విడత శిక్షణకు శ్రీకారం చుట్టనున్నారు. నిరక్షరాస్యులను తీర్చిదిద్దేందుకు అవసరమైన 8,845 మంది వాలంటీర్ల ఎంపిక పూర్తి



చేశారు. గతేడాది తొలి దశలో 11,900 లక్ష్యం కాగా 10,503 మంది పరీక్షలు రాసి అర్హత సాధించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఇప్పుడు మలి దశకు డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా అధికారులతో కమిటీ ఏర్పాటైంది. అభ్యాసకులకు మరికొన్ని పుస్తకాలు త్వరలోనే సరఫరా కానున్నాయి. రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాలు, పంచాయతీ కార్యాలయాల్లో వాలంటీర్లు అక్షర బడి నిర్వహిస్తారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు, మహిళా పోలీసులు పర్యవేక్షిస్తారు. తొలి విడతలో స్వచ్ఛంద మహిళా వాలంటీర్లతో కొనసాగిన తర్ఫీదు సత్ఫలితాలిచ్చింది. ప్రస్తుతం తలపెట్టిన ఉల్లాస్ 2026 సంవత్సరం మార్చి నెలాఖరు వరకు ఆరు నెలలపాటు కొనసాగుతుంది. వారం రోజుల్లో వాలంటీర్లందరికీ శిక్షణ పూర్తి చేసి అమలుకు శ్రీకారం చుడతామని వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్ డి.చిన్నికృష్ణ చెప్పారు.

# పరిహారం కొల్లగొట్టి.. అర్హులను ముంచేసి



పుట్టపర్తి : శ్రీసత్యసాయి, కడప జిల్లాల సరిహద్దులో నిర్మించిన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు బాధితుల కష్టాలు నేటికీ వెంటాడుతున్నాయి. సీబీఆర్ జలాశయం నిర్మాణంతో కడప వాసులకు ప్రయోజనం కాగా.. శ్రీసత్యసాయి జిల్లాలో ముంపు బాధితులకు కష్టాలు వచ్చిపడ్డాయి. ముదిగుబ్బ మండలం రాఘవపల్లి, పెద్దచిగుళ్లరేవు (పీసీ రేవు), తాడిమర్రి మండలం చిన్నచిగుళ్ల రేవు (సీసీ రేవు), మర్రిమాకులపల్లి గ్రామాలు 2020లో ముంపునకు గురయ్యాయి. అప్పటికి 18 ఏళ్లు నిండితే రూ.10 లక్షలు చొప్పున పరిహారం అందించేందుకు అధికారులు జాబితా సిద్ధం చేశారు. వైకాపా ప్రభుత్వంలో నాయకులు, అధికారులు కుమ్మక్కై జాబితాలో నకిలీలను ఎక్కించి డబ్బులు దోచుకున్నారు. నాలుగు ముంపు గ్రామాల్లో 2,009 మంది బాధితులు ఉన్నట్లు జాబితా తయారు చేశారు. ముంపు బాధితులకు ప్రభుత్వం రూ.240.53 కోట్లు కేటాయించింది. మొదటి విడతలో 1,591 మందికి రూ.152 కోట్లు జమచేసింది. లబ్ధిదారుల్లో అత్యధికంగా వైకాపాకు చెందినవారే ఉండటంతో నిజమైన లబ్ధిదారులకు సొమ్ము అందలేదు.

పరిహారం అందని బాధితుల కోసం రెండో జాబితా పంపినట్లు అధికారులు చెబుతున్నా నేటికీ ఇవ్వలేదు. తాడిమర్రి మండలం సీసీ రేవు గ్రామ నిర్వాసితులకు న్యాయం జరిగింది. మర్రిమాకులపల్లిలో 100, రాఘవపల్లిలో 80, పీసీ రేవులో 90 మందికి పరిహారం దక్కలేదు. దీంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

**రూ.కోట్లు దండుకొని..**

గ్రామంలో నివాసం లేని వారిని కొన్నేళ్లుగా ఇక్కడే నివసిస్తున్నట్లు సృష్టించి వైకాపా నాయకులు రూ.కోట్లు కొల్లగొట్టారు. అప్పటి తహసీల్దార్, ఆర్‌ఐలు, వైకాపా నాయకులతో కుమ్మక్కై దాదాపు రూ.20 కోట్లకు పైగా అవినీతికి పాల్పడ్డారు. పులివెందుల, అనంతపురం, ధర్మవరం వాసులను ముంపు బాధితులుగా చేర్చి సొమ్ము ఖాతాలకు మళ్లించారు. అవినీతి పెచ్చుమీరడంతో ఓ అధికారి ఏసీబీకి పట్టుబడటం గమనార్హం. పరిహారం పంపిణీతోపాటు, పాసుపుస్తకాలు, మ్యుటేషన్, సర్వే తదితరాల్లో రెవెన్యూ అధికారులు వసూళ్లకు పాల్పడ్డారు. ముదిగుబ్బ కేంద్రంగా దందా సాగింది. డబ్బులు తీసుకుంటూ ఓ వీఆర్‌ఓ పట్టుపడ్డాడు. నాటి తహసీల్దార్, ఉప తహసీల్దారు, ఇద్దరు ఆర్‌ఐలు, ఒక జూనియర్ సహాయకురాలిపై ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. విచారణ చేయడానికి అధికారిని నియమించింది.

**అర్హులెవరికీ అన్యాయం జరగదు**

మహేశ్, ధర్మవరం ఆర్‌డీఓ

చిత్రావతి రిజర్వాయర్ ముంపు బాధితులకు సంబంధించి నాటి ప్రభుత్వం పరిహారం అందించింది. 40 మంది వరకు ఉంటే పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పరిహారం పంపిణీ తర్వాత తాము అర్హులమంటూ 1,600 మంది దరఖాస్తులు ఇచ్చారు. వాటిని పరిశీలిస్తున్నాం. అవినీతికి పాల్పడిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

# తటాకాలకు మహర్దశ



పుట్టపర్తి : కరవుకు నిలయమైన శ్రీసత్యసాయి జిల్లాలో సాగునీటి చెరువుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టింది. చెరువుల మరమ్మతులు, ఆధునీకరణ, నీటి నిల్వల సామర్థ్యం పెంపు ద్వారా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రధానమంత్రి కృషి సంచయన యోజనలో కింద అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 239 సాగునీటి చెరువుల అభివృద్ధికి రూ.209 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొదటి విడతలో 55 సాగునీటి చెరువుల అభివృద్ధికి రూ.34.64 కోట్లతో ప్రతిపాదనలకు జిల్లా కమిటీ ఆమోదించింది. నివేదికను సాంకేతిక సలహా కమిటీకి పంపింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో 60 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం, 40 శాతం కేంద్రం అందిస్తోంది.

**ఆయకట్టు ఎక్కువ ఉన్నవాటికే ..**

జిల్లాలో సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నవాటినే గుర్తించారు. చెరువుల కట్ట, కాలువల పటిష్టం, శివారు ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా చర్యలు, సర్‌ప్లస్ ఫ్యూయర్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనులు చేపట్టనున్నారు.

**సాగునీరు అందించడమే లక్ష్యం**

జిల్లాలో చెరువుల అక్రమణలను గుర్తించి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే లక్ష్యం, పంటల ఉత్పత్తి పెంచి, రైతుల ఆదాయ వనరులను పెంచాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వీటితో నీటి నిల్వల సామర్థ్యంతోపాటు భూగర్భ జలాలు పెరగడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి. త్వరలో ఆయా పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నారు.

**విడతల వారీగా పనులు ఎస్ఈ నీటిపారుదలశాఖ అధికారి విశ్వనాథరెడ్డి**

శ్రీసత్యసాయి జిల్లాలో చెరువులను బలోపేతం చేసి, సాగునీటి సామర్థ్యం పెంచడమే లక్ష్యంగా తగు చర్యలు చేపట్టాం, మొదటి విడతాలో 55 సాగునీటి చెరువుకు రూ.34.64 కోట్లు ప్రతిపాదనలు పంపాం, రెండో విడతలో 184 చెరువుకు రూ.174.76 కోట్లతో నివేదికలు సిద్ధం చేశాం. త్వరలో టెండర్ పక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాం.

# దగ్గు.. జలుబు.. జ్వరం



పుట్టపర్తి: వాతావరణ మార్పుల కారణంగా రోగులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో వాతావరణ వస్తున్న మార్పులతో జనం జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఒళ్లునొప్పులతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు బాధపడుతున్నారు. వైద్యసేవల కోసం వచ్చే రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు, 30 పడకల ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రుల వైద్యశాలలకు రోజురోజుకు జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 45 ఉండగా, 1100 నుంచి 1250 మంది, పట్టణ ఆరోగ్య కేంద్రాలు 17 ఉండగా, 750 నుంచి 900 వరకు, ప్రాంతీయ ఆసుపత్రులకు 2,500 నుంచి 3 వేల వరకు రోజు వారి ఓపీ ఉంటోంది. ఆయా కేంద్రాల్లో హిందూపురంలో వెయ్యి మంది, ధర్మవరం 650 నుంచి 750 వరకు, కదిరి 700 నుంచి 950 మందికి రోగుల ఓపీ నమోదవుతోంది. పది రోజులుగా రోగుల రద్దీతో ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రకరకాల వైద్య పరీక్షల పేరిట నిలువు దోపిడీ చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

**కన్పించని శిబిరాలు..**

పల్లెలు, పట్టణాల్లో రోగుల రద్దీ పెరుగుతున్నా ఎక్కడా వైద్య శిబిరాల ఊసేలేకుండా పోతోంది. పల్లెల్లో చాలా మంది ఇంటి వద్ద మంచానికే పరిమితమయ్యారు. మరికొందరు జ్వరం, దగ్గు, నొళ్లునొప్పులు భరించలేక ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. కనీసం ఆసుపత్రుల పర్యవేక్షణ గాలికి వదిలేసి, కేవలం జిల్లా కేంద్రానికే ఉన్నతాధికారులు పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి.

**వైద్యసేవలు అందిస్తున్నాం**పైరోజాబేగం, జిల్లా వైద్యాధికారిణి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోజురోజుకీ ఓపీ పెరుగుతోంది. రోగులకు అనుగుణంగా వైద్యసేవలు అందిస్తున్నాం. బాధితులకు అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించి ఔషధాలు అందిస్తున్నాం. ఎక్కడా కొరత లేదు. అవసరమైన చోట వైద్యశిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

# నిగ్గు తేలుస్తారా... నీళ్లొదిలేస్తారా?

పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి పీఏసీఎస్‌లో సొసైటీ కార్యదర్శి గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది పేరున రుణాలు మంజూరు చేశారు. ఇందులో రూ.20 లక్షలు పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించారు. నెలలు గడుస్తున్నా.. డీసీసీబీ అధికారులు కాలయాపన చేస్తున్నారు తప్ప నిగ్గుతేల్చడం లేదు. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం జానకీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బినామీ రుణాల పేరుతో రూ.కోటి రూపాయలకు పైగా అక్కడి సీఈవో స్వాహా వేశారని గతంలో స్థానిక రైతులు ఫిర్యాదు చేశారు. ఎలమంచిలి డివిజినల్ సహకార శాఖ అధికారి ప్రాథమికంగా విచారణ చేసి అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఇది జరిగి చాలా కాలం అవుతున్నా ఇప్పటివరకు సీఈవోపై చర్యల్లేవు.

సహకార శాఖలో గత ప్రభుత్వంలో రూ.కోట్లాది అక్రమాలు జరిగాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్) నిధులు మళ్లించి అధికారులు వాటాలుగా పంచుకున్నారు. అక్రమాలను బయట పెట్టేందుకు.. కొన్ని నెలల కిందట జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఓ కమిటీని వేసింది. ఈ కమిటీ ఏర్పాటై నెలలు గడుస్తున్నా పీఏసీఎస్‌ల్లో కనీస తనిఖీలు చేపట్టలేదు. ఎంత మొత్తం పక్కదారి పట్టిందో నిగ్గుతేల్చలేదు. ఇప్పటివరకు ఎన్ని అక్రమాలు జరిగాయన్న వివరాలు వెల్లడించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా సమగ్ర విచారణ జరగకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 32 డీసీసీబీ శాఖలున్నాయి. వీటి పరిధిలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 98 సహకార సంఘాలు, 320 'బి' కేటగిరీ సొసైటీలున్నాయి. గత ప్రభుత్వంలో సుమారు రూ.40 కోట్ల



నిధులు దారిమళ్లినట్లు డీసీసీబీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సొసైటీల్లో ఖాతాలున్న వారికి అడ్డగోలుగా రుణాలు మంజూరు చేశారు. వీటితో ఏమైనా యూనిట్లు ఏర్పాటు చేశారా అంటే అదీ లేదు. భారీ మొత్తంలో సొమ్ము పక్కదారి పట్టినా విచారణకు అడుగులు పడటం లేదు. అక్రమార్కులు ఆశచూపుతుండటంతో విచారణను జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

స్థానిక నేతల సిఫార్సుతో అక్రమాలకు పాల్పడిన వారి లెక్కలు తేలుస్తామని డీసీసీబీ ఛైర్మన్‌గా కోన తాతారావు బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో స్పష్టం చేశారు. బినామీ రుణాలు, అడ్డగోలుగా మంజూరు, రుణ వాయిదాలు చెల్లించని ఖాతాదారులను గుర్తించి వసూలు చేస్తామన్నారు. దీనిపై కొన్ని నెలల కిందట ప్రత్యేకంగా విచారణ కమిటీని వేశారు. విచారణ అధికారులు ప్రతి పీఏసీఎస్‌ను తనిఖీ చేసి పక్కదారి పట్టిన రుణాలు, రికవరీ కాని వాటిని గుర్తించి సమగ్ర నివేదిక రూపొందించాలి. ఈ నివేదిక ఆధారంగా అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామన్నారు. నెలలు గడుస్తున్నా విచారణ మాత్రం ముందుకు సాగటం లేదు. మాకవరపాలెం సొసైటీలో భారీగా అక్రమాలు జరిగినట్లు గతంలో రైతులు కలెక్టర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. నర్సీపట్నం, పాయకరావుపేట, మాడుగుల, ఎలమంచిలి, చోడవరం సంఘాల్లోనూ భారీగా అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. పాడేరు, అరకులోయ, చింతపల్లిలోనూ రుణాలు పక్కదారి పట్టినట్లు ఫిర్యాదులు వచ్చాయి.

**చర్యలు తీసుకుంటాం**

– కోన తాతారావు, ఛైర్మన్, డీసీసీబీ

గత ప్రభుత్వంలో సహకార సంఘాల్లో జరిగిన అవకతవకలపై సమగ్రంగా విచారణ చేయిస్తున్నాం. దీనిపై ఓ కమిటీ పనిచేస్తోంది. అన్ని పీఏసీఎస్‌ల్లోనూ తనిఖీలు జరిపిస్తాం. బాధ్యుల్లో ఏ ఒక్కరినీ విడిచిపెట్టం. చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం.

# స్థలాల చిరునామా గల్లంతు

పాయకరావుపేట : నియోజకవర్గ కేంద్రం పాయరావుపేట పదిహేనేళ్లుగా పట్టణీకరణ దిశగా అడుగులు వేస్తోంది. సిమెంటు, మందుల పరిశ్రమల రాకతో ఈ ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంది. సాగు భూములు ఇళ్ల స్థలాలుగా మారడంతో ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో అక్రమార్కుల చూపు పంచాయతీ స్థలాలపై పడింది. పార్టీలకతీతంగా స్థలాలను స్వాహా చేసే ప్రయత్నాలు జోరందుకున్నాయి. వీరికి పంచాయతీ సిబ్బంది మద్దతుగా నిలుస్తున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాల చిరునామా గల్లంతవుతోంది. తాజాగా రాజుగారిబీడులో 400 గజాల పంచాయతీ భూమిని ఆక్రమించే యత్నాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలతో అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పేట పరిధిలో అన్యాక్రాంతమైన స్థలాల గుట్టు విప్పాలని ఫిర్యాదులు వస్తున్నాయి.

రికార్డులు మాయం : పేట పరిధిలో ఐదు ఎకరాలకుపైగా పంచాయతీ



స్థలాలు రికార్డుల్లో ఉండగా ప్రస్తుతం సగం వరకు స్థలాలకు రెక్కలు వచ్చాయి. రాజుగారిబీడులోని సర్వే నంబర్లు 192/1ఎ, 192/1బి పరిధిలో వెయ్యి గజాలు, న్యూ కాలనీ, పోలీస్ రాజ్‌నగర్, మంగవరం వెళ్లే రోడ్డులో వేసిన లే అవుట్లలో పంచాయతీకి కేటాయించిన స్థలాలను స్థిరాస్తి వ్యాపారులే దర్జాగా అమ్మేశారు. వీటికి సంబంధించి పూర్తిస్థాయి రికార్డులు పంచాయతీలో మాయమయ్యాయి.

**ఒప్పంద సిబ్బందే కీలకం :** పంచాయతీ స్థలాల మాయంలో పంచాయతీలో దీర్ఘకాలికంగా పని చేస్తున్న కొంతమంది ఒప్పంద ఉద్యోగుల పాత్రే కీలకంగా మారింది. సిబ్బంది సహకారంతో స్థలాల వివరాలు తెలుసుకుని వాటిని గుట్టుగా అమ్మేస్తున్నారు. పేట పంచాయతీకి పూర్తిస్థాయిలో ఈవో నియమించకపోవడం సమస్యగా మారుతోంది. ఎక్కువ కాలం ఇన్‌ఛార్జిలే ఉండటంతో పాలనపై దృష్టిసారించలేకపోతున్నారు.

**స్థలాల్లో మొక్కల పెంపకం**

'పంచాయతీ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు మొక్కలు పెంచితే సత్ఫలితాలు వస్తాయి. ఎవరూ అమ్మకాలు చేపట్టేందుకు వీలుండదు. అన్ని పంచాయతీ స్థలాలను గుర్తించి కంచెలు ఏర్పాటు చేస్తామ'ని ఇన్‌ఛార్జి ఈవో డేవిడ్ చెప్పారు.

# 12 సెంట్లు.. 20 ఏళ్లుగా కబ్జాయత్నం

తిరుపతి : నగర పరిధిలోని అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమి అది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నేతలు మారుతున్నారు.. 20 ఏళ్లుగా ఆక్రమణల యత్నాలు కొనసాగిస్తున్నారు. తాజాగా కొందరు ఇంటి పట్టాల కోసం ప్రయత్నాలు చేస్తూనే భూమిని చదును చేసి నిర్మాణాలు చేపట్టేందుకు సన్నాహాలు చేయగా స్థానికులు అడ్డుకోవడంతో తాత్కాలికంగా వెనక్కు తగ్గారు. సుబ్బారెడ్డినగర్ పరిధిలోని అక్కారంపల్లె లెక్క దాఖలా సర్వే నం.112/10లో సుమారు 20 సెంట్ల ప్రభుత్వ భూమి ఉండేది. అందులో 8 సెంట్లలో గతంలోనే ఇళ్ల నిర్మాణం జరగ్గా మరో 12 సెంట్లు మిగిలింది. ప్రస్తుతం అక్కడ అంకణం రూ.4 లక్షలు చొప్పున 144 అంకణాలు సుమారు రూ.5.76 కోట్ల విలువ చేస్తోంది. సదరు భూమిని చేజిక్కించుకునేందుకు గడిచిన



20 ఏళ్లుగా స్థానిక నేతలు విఫలయత్నం చేస్తున్నారు.

**ఆరోగ్య కేంద్రం ప్రతిపాదనతో..** 2020లో వైకాపాకు చెందిన కొందరు నాయకులు భూమిలో పాగా వేసేందుకు గట్టి ప్రయత్నమే చేశారు. అయితే రెవెన్యూ అధికారులు పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి సదరు భూమిని కేటాయించారు. కానీ నిర్మాణం ఆలస్యం కావడం, దాన్ని మరోచోటికి మార్చడంతో నగరపాలక సంస్థ సదరు భూమిని రెవెన్యూకే అప్పజెప్పింది. గత సంవత్సరం నుంచే ఆక్రమణ ప్రయత్నాలు ప్రారంభించినా అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సిబ్బందిపై జులుం ప్రదర్శించి ఇటీవల యంత్రాలతో రంగప్రవేశం చేసి దాన్ని సైతం తొలగించారు. అయితే వారి ప్రయత్నాలను స్థానికులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. ఈ విషయమై తహసీల్దారు సురేష్‌బాబు స్పందిస్తూ సదరు భూమిని పరిశీలించి ఆక్రమణలకు పాల్పడకుండా రక్షణ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

# డిగ్రీ ప్రవేశాలు.. తుదిదశకు


తిరుపతి : డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ కొలిక్కి వస్తోంది. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమై రెండున్నర మాసాలు కావస్తుండగా ప్రథమ సంవత్సరం ప్రవేశాలపై సరైన కార్యాచరణ లేకపోవడంతో విద్యార్థులు ఈ ఏడాది తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు.

**నమోదుకు ఆటంకాలు**

దరఖాస్తులకు పచ్చజెండా ఊపినప్పటి నుంచి నాలుగు రోజుల కిందటి వరకు ప్రైవేటు కళాశాలలకు సంబంధించి ఏయే కోర్సులు ఉన్నాయో ఆన్‌లైన్‌లో కనిపించక తికమకపడ్డారు. ఎక్కువమంది ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయడం, చివరి నిమిషంలో ఆన్‌లైన్‌కు మొగ్గు చూపాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో దరఖాస్తు గడువును వరకు పొడిగించారు. నాలుగో తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు 8న అలాట్‌మెంట్, ఆయా కళాశాలల్లో ధ్రువపత్రాల సమర్పణ, 9 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

**కొత్తగా ఏఐ కోర్సు**

ఎస్వీయు పరిధిలో తితిదే కళాశాలలు మినహా తక్కిన కళాశాలల్లో ఇప్పటివరకు 45 నుంచి 55 శాతం సీట్లకే దరఖాస్తులు అందినట్లు సమాచారం. ఈ విద్యా సంవత్సరం నూతనంగా ఏఐ కోర్సును పరిచయం చేయనున్నారు.



**దూరవిద్యకు దరఖాస్తుల ఆహ్వానం**

శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని దూరవిద్యా కేంద్రంలో ఎంకాం, ఎంఏ తెలుగు, సంగీతం, డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తనం, వర్ణం, అన్నమయ్య అంతరంగం)లో ప్రవేశానికి ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కేంద్రం సంచాలకులు అరుణ తెలిపారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ %www.spmvv. ac.in% ను సంప్రదించాలన్నారు.

**ఎస్వీయు పరిధిలోని డిగ్రీ కళాశాలలు**

ప్రభుత్వ 18
ప్రైవేటు 103
మొత్తం సీట్లు 30,000
తితిదే డిగ్రీ కళాశాలలు 4
సీట్ల వివరాలు 3,736
ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశాల అంచనా : 15,172

# తెగుళ్లతో ట'మాట' పడిపోయి

పుంగనూరు : వేసవి తర్వాత టమాటా పంట బాగా వస్తుందని వేసిన రైతన్నకు నిరాశే మిగులుతోంది. పుంగనూరు, పలమనేరు, కుప్పం, పూతలపట్టు నియోజకవర్గాల్లో ప్రస్తుతం 6 వేల ఎకరాల్లో టమాటా సాగైంది. ఆకుమాడు, వైరస్, పాముపొడ వంటి తెగుళ్లతో తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సరాసరి 8 నుంచి 10 కోతలు రావాల్సిన తోటలు వడు లేక నాలుగు కోతలకే పడిపోతున్నాయి. హెక్టారుకు టన్నుకు మించి దిగుబడులు రావడం లేదు.

**ధరలు అంతంతమాత్రంగానే..** రెండు వడు కోతల్లో వచ్చే కాయలకు సైతం ఊజీ (పురుగు) కుట్టడం, మచ్చలు వస్తుండటంతో ధరలు అంతంత మాత్రంగానే పలుకుతున్నాయి. నెలన్నరగా కిలో టమాటా ధర రూ.35-40 మధ్య ఊగిసలాడుతుండగా ఈ వడు రోజుల్లో రూ.16 -20కు పడిపోయింది. పుంగనూరు, వి.కోట, పలమనేరు టమాటా మార్కెట్లకు రోజుకు 60 నుంచి 70 టన్ను సరకే వస్తున్నా ధరలు లేవు. 'ఎకరా పొలంలో రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టి టమాటా సాగుచేశా. వడు కోతలు కోయగా రూ.40 వేలు వచ్చింది. మహా అయితే ఇంకో కోత వస్తుంది' పుంగనూరుకు చెందిన టమాటా రైతు రాజారెడ్డి తెలిపారు. **ఖర్చులు అధికమై..** టమాటా సాగుకు ఎకరానికి రూ.2 లక్షలు ఖర్చవుతుండగా ప్రస్తుత దిగుబడులు, ధరల ప్రకారం రూ.20 వేల నుంచి 25 వేలు మాత్రమే వస్తోంది. ఇంటి మనుషుల కష్టం, సొంత ట్రాక్టర్లు పెట్టుకున్నా అప్పులే మిగులుతున్నాయి.

# పకడ్బందీగా 104 సేవలు



అనంతపురం : చిన్నపాటి ఆరోగ్య సమస్యలున్నవారు వ్యయ, ప్రయాసలకు గురై వైద్యం కోసం పట్టణాలకు రాకుండా స్థానికంగా పొందేందుకు కూటమి ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేసింది. 104 వాహన సేవలను ఇకపై పకడ్బందీగా అమలు చేయనున్నారు. గ్రామాలకు వైద్యులు, సిబ్బంది వెళ్లి రోగులకు వైద్యం అందించేందుకు ఉన్న నిర్దేశాలను పక్కాగా అమలు చేయనున్నారు. కొంతమంది వైద్యులు గ్రామాలకు వెళ్లకుండా సిబ్బందిని మాత్రమే పంపుతున్నారన్న విమర్శలు రావడంతో ఇక నుంచి నెలకు రెండుసార్లు ముందుగా అనుకున్న రోజుల్లో ప్రభుత్వ వైద్యులే వెళ్లాలని నిర్దేశించారు.

ప్రభుత్వ వైద్యులు స్థానికంగా రోగుల ఆరోగ్య సమస్యను బట్టి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేస్తారు. వాహనం వద్దకు రాలేని రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి సేవలు అందిస్తారు. పాఠశాలలు, వసతి గృహాలకు వెళ్లి విద్యార్థులకు పరీక్షలు చేసి.. సమస్యను బట్టి మందులను ఇస్తారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు వైద్యులు సూచించిన మందులను ఇస్తారు. రోగులకు నిర్వహించిన పరీక్షల్లో తీవ్ర సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వారిని ప్రభుత్వ వైద్యశాలలకు రెఫర్ చేస్తారు. గర్భిణులకు పరీక్షలు చేసి.. వారికి క్యాల్షియం, ఐరన్ వంటి మాత్రలను అందజేస్తారు.

**వెళ్లేది ఎవరు?**

104 వాహనంలో సంబంధిత పీహెచ్‌సీ వైద్యుడు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త, నర్సింగ్ సూపర్‌వైజర్ వెళ్తారు. ఈ వాహనంలో హెచ్‌పీ, ఆర్‌బీఎస్, యూరిన్ రొటీన్, ఈసీజీ పరీక్షలు చేస్తారు. అలాగే గర్భిణులకు నెలవారీ ఆరోగ్య పరీక్షలు చేసి వారికి మందులను ఉచితంగా అందజేస్తారు. రోజుకు సగటున సదరు వాహనాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా 4 వేల మందికిపైగా వైద్యసేవలు పొందుతున్నారు. ఈ వాహనంలో 84 రకాల మందులను అందుబాటులో ఉంచారు.

**జిల్లాల్లో వాహనాలు**

అనంతపురం : 36
శ్రీసత్యసాయి : 35

**పెంచేందుకు చర్యలు.. డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్‌వో, వైద్య ఆరోగ్యశాఖ, అనంతపురం జిల్లా**

104 వాహనంలో ప్రస్తుతం అందిస్తున్న సేవలకు అదనంగా మరికొన్నింటిని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కుప్పంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి సెప్టెంబరు 1 నుంచి అమలు చేయనున్నారు. కొన్ని వైద్య పోస్టులు ఖాళీగా ఉండటంతో వైద్యులను సర్దుబాటు చేసి పంపుతున్నాం. ఎవరైనా గ్రామాలకు వెళ్లలేదన్న ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో కచ్చితంగా షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వైద్యులు వెళ్లి తీరాలని ఆదేశించాం.

# విధులకు డుమ్మా.. జీతాలు జమ



అనంతపురం: గిరిజన సంక్షేమ హాస్టళ్లలో కొందరు వార్డెన్లు, రెగ్యులర్ వంట మనుషులు నెలలు, సంవత్సరాల తరబడి విధులకు హాజరు కాకుండానే జీతాలు తీసుకుంటున్నారు. పలుచోట్ల వార్డెన్లు ఇంటి వద్దే ముఖహాజరు నమోదు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. అడిగేవారు లేకపోవడంతో విధులకు డుమ్మా కొట్టి సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారు. హాస్టళ్లలో పనిచేసే రెగ్యులర్ వంట మనుషులు నెలకు సగటున రూ.50 వేలు జీతం తీసుకుంటూ బినామీ వ్యక్తులకు నెలకు రూ.5 వేల నుంచి 6 వేలు ఇస్తూ పనులు చేయిస్తున్నారు. నెలకు ఒకసారి రిజిస్టర్‌లో సంతకాలు చేసి జీతాలు పొందుతున్నారు. కొందరు ప్రిన్సిపాళ్లు, ఉన్నతాధికారులు మామూళ్లు తీసుకుని డ్యూటీ సర్టిఫికేట్లు ఇస్తూ అవినీతికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సొంత పనులు చేసుకుంటూ..**

ఉమ్మడి జిల్లాలో గిరిజన హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు కలిపి 22 ఉన్నాయి. కొందరు వార్డెన్లు విద్యార్థుల సంఖ్యను రెండింతలు చూపి పెద్దమొత్తంలో బిల్లులు నొక్కేస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం వాటా తీసుకుంటుండటంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విధులకు డుమ్మా కొట్టి సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారు. చాలామంది రియల్‌ఎస్టేట్ చేస్తూ వారానికి రెండు, మూడుసార్లు హాస్టళ్లకు వెళు తున్నారు. కొందరు వంట మనుషులది ఇదే తీరు.

**గిమ్మిక్కులు..**

అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో బయోమెట్రిక్, ముఖ ఆధారిత హాజరును తప్పనిసరి చేశారు. వార్డెన్లు, వంట మనుషులు యాప్‌లో లోపాలను ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. తమ ఇంటి లోకేషన్‌నే యాప్‌లో ఫీడ్ చేసి రోజూ అక్కడి నుంచే హాజరు నమోదు చేస్తున్నారు.

**గిరిజన సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు, వంట మనుషుల ఇష్టారాజ్యం**

అనంతపురం నాయక్‌నగర్‌లోని ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతిగృహంలో క్లాస్-4ఉద్యోగి విధులకు హాజరు కావడం లేదు. బినామీ వ్యక్తులతో పనులు చేయిస్తున్నాడు. ప్రతినెలా జీతం పొందుతున్నాడు. ఉరవకొండ గిరిజన గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న వంటమనిషి విధులకు హాజరుకాకపోయినా జీతం జమ అవుతోంది. చియ్యేడులోని గిరిజన బాలల వసతిగృహంలో పనిచేస్తున్న క్లాస్-4 ఉద్యోగి విధులకు వెళ్లడం లేదు. రిజిస్టర్‌లో హాజరైనట్లు నమోదు అవుతుండటంతో ప్రతి నెలా జీతం అందుతోంది. రాగులపాడు, గుత్తి, పెనుకొండ గిరిజన గురుకులాల్లోని పలువురు క్లాస్-4 ఉద్యోగులు డుమ్మా కొడుతున్నారు.

**విచారించి చర్యలు తీసుకుంటాం**

శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమాధికారి, అనంతపురం జిల్లా

ముఖ హాజరులో అక్రమాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. హాస్టల్ లోకేషన్‌లోనే హాజరు నమోదు చేయాలని వార్డెన్లకు ఆదేశాలిచ్చాం. వంట మనుషులు విధులకు హాజరవుతున్నారో లేదో పరిశీలిస్తాం. నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

# ఈ-పంట.. నమోదే తంటా!



అనంతపురం : ఈ-పంట నమోదు ప్రక్రియ గత ఆగస్టు మొదటి వారంలోనే ప్రారంభమైనా ఇప్పటివరకు 16 శాతం మాత్రమే పూర్తయింది. అనేక సమస్యలు చుట్టుముడుతున్న కారణంగా ప్రక్రియ ముందుకు సాగడంలేదు. జిల్లా అధికారులు కిందస్థాయి సిబ్బందిని ఒత్తిడి చేస్తున్నారే గానీ సమస్యలు పరిష్కరించడం లేదని వ్యవసాయశాఖ సబ్ డివిజన్ స్థాయి అధికారులు పేర్కొనడం గమనార్హం. జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) ద్వారా ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే పేరుతో కొత్త యాప్‌ను రూపొందించారు. ఈ ఏడాది కొత్తగా సాగైన పంటలతోపాటు ప్రభుత్వ, డి.పట్టా భూములు కూడా నమోదు చేయాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

**కొన్ని గ్రామాల్లో మొదలే కాలేదు**

ఈ-పంట నమోదు ప్రక్రియ చాలా మండలాల్లో ఇంకా ప్రారంభమే లేదు. యాప్‌లో గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీసర్వేతో అసలైన హక్కుదారుల భూములను ప్రభుత్వ భూములుగా చూపించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జియో కోఆర్డినేట్స్ (అక్షాంశ-రేఖాంశాలు) చూపించకపోవడం, ప్రభుత్వ భూములు కనిపించడం లేదు. పొలంలో 200 మీటర్లు దూరం వెళ్లినా చూపడంలేదు.

వజ్రకరూరు, ఉరవకొండ, శెట్టూరు, పెద్దవడుగూరు, కణేకల్లు, అనంతపురం గ్రామీణం, గార్లదిన్నె, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, కూడేరు, కుందుర్పి, రాయదుర్గం, యాడికి మండలాలు మినహా మిగిలిన 17 మండలాలు పూర్తిగా వెనకబడ్డాయి.

ఉమ్మడి జిల్లాలో సాగుభూములు 9 లక్షల ఎకరాలు ఉండగా అసైన్డు భూమి 4,26,617 ఎకరాలు, అటవీభూమి దేవాలయ భూములు 45,309 ఎకరాలున్నాయి. ఈ వివరాలు కనిపించడం లేదు.

ఎకరాలు : 9 లక్షలు
నమోదు సంఖ్య : 1,57,961 ఎకరాలు
సమస్య : ప్రభుత్వ భూములుగా చూపడం

**గడువులోపు పూర్తి చేస్తాం**

జేడీఏ ఉమామహేశ్వరమ్మ, డీడీహెచ్ ఉమాదేవి

సాధారణ పంటలతోపాటు పండ్లతోటలు, ప్రభుత్వ భూములు కూడా ఈ-పంట కింద నమోదు చేయాల్సి ఉంది. జిల్లాలో 9 లక్షల ఎకరాలకుగాను ఇప్పటివరకు 1,57 లక్షల ఎకరాల్లో మాత్రమే ఈ-పంట నమోదైంది. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్నాయని మా దృష్టికి తెచ్చారు. ఈనెలాఖరు వరకు గడువు ఉంది. ఆలోపే ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

# కైలాసగిరి.. సౌర సిరి

శ్రీకాళహస్తి: విద్యుత్తు ఆదా లక్ష్యంగా శ్రీకాళహస్తీశ్వరాలయం అడుగులు వేస్తోంది. పెరుగుతున్న విద్యుత్తు వాడకం అవసరాన్ని బట్టి తగ్గించుకుంటూ సౌర విద్యుత్తు వాడకం పెంచుకుంటూ నగదు ఆదా చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలను పాటిస్తూ సౌర విద్యుత్తు ఉత్పత్తులను వినియోగించుకుంటూ రాష్ట్రంలోని మిగిలిన ఆలయాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది.

కైలాసగిరుల్లోని వడు ఎకరాల విస్తీర్ణంలో నెడ్‌క్యాప్ నేతృత్వంలో సౌర ఫలకాల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. విద్యుత్తు సంక్షోభ పరిస్థితులను అధిగమించేందుకు వీలుగా ముక్కంటి ఆలయం ప్రత్యామ్నాయ ఏర్పాట్ల దిశగా ఇందుకు అంగీకారం తెలిపింది. దీంతో వడేళ్లుగా కొనసాగిన ఈ పనులు పూర్తయి సౌర విద్యుత్తు ఉత్పాదన



అందుబాటులోకి వచ్చింది. కైలాసగిరుల్లోని కైలాససదన్, గంగాసదన్ అతిథి గృహాలపైనా సౌర ఫలకాలు అమర్చి వాటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇలా దాదాపు ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పాదనకు ఈ ప్రాజెక్టు ఉపకరిస్తోంది.

**నెలకు రూ.15 లక్షల బిల్లు** ముక్కంటి ఆలయంతో పాటు అతిథిగృహాలకు విద్యుత్తు ఛార్జీలు తడిసి మోపెడవుతోంది. విద్యుత్తు సంస్థలకు యనిట్‌కు ముక్కంటి ఆలయం దాదాపు రూ.6.50 చెల్లిస్తోంది. తద్వారా నెలకు రూ.14 -15 లక్షల మేరకు బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం సౌర ప్రాజెక్టు అందుబాటులోకి రావడంతో నెలకు 25 శాతం మేర విద్యుత్తు శాఖకు చెల్లించే మొత్తం తగ్గుతోంది. సౌర విద్యుత్తు వాడకంతో ఏటా ఆలయానికి రూ.35 లక్షల మేర బిల్లులు తగ్గుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో విద్యుత్తు వాడకం మరింతగా పెరిగే అవకాశముంది. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మరిన్ని సౌర ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# పారని పొగ.. దోమల పగ

చిత్తూరు : జీడీనెల్లూరు మండలంలో 35 గ్రామ పంచాయతీలున్నాయి. వడేళ్ల కిందట ఒక్కో పంచాయతీకి ఒక్కో ఫాగింగ్ యంత్రాన్ని ఇచ్చారు. ప్రారంభంలో ఏడు పంచాయతీల్లో మాత్రమే వీటిని వినియోగించారు. ఇప్పుడు అన్నీ వలన పడ్డాయి. ఎక్కడా ఫాగింగ్ చేయడం లేదు. పల్లెల్లో ఫాగింగ్ చేయడం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో జెడ్పీ నుంచి అన్ని పంచాయతీలకు ఇచ్చిన ఫాగింగ్ యంత్రాలు చాలావరకు పని చేయడం లేదు. కొన్ని చోట్ల మరమ్మతులకు గురికాగా, కొన్ని ప్రాంతాల్లో వాటిని ప్రారంభించనేలేదు. ఆర్థిక భారంతో కొందరు కార్యదర్శులు వాటిని వినియోగించలేదన్న విమర్శలున్నాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో మొత్తం 1,470 గ్రామ పంచాయతీలున్నాయి. వడేళ్ల కిందట ఉమ్మడి జిల్లాలో 1,435 ఫాగింగ్ యంత్రాలను అందజేశారు. ప్రతి యంత్రాన్ని ప్రతి వడు నెలలకోసారి వరుసగా ఏడు వారాల పాటు ఉపయోగించాలి. దీంతో దోమలు చనిపోయి, లార్వా ఉత్పత్తి తగ్గుతుందని భావించారు. ప్రస్తుతం మేజర్ పంచాయతీల్లో మాత్రమే 50 లోపే వినియోగిస్తున్నారు.

**వ్యయం భరించలేక..**

యంత్రాలు పని చేసేందుకు పెట్రోల్, డీజిల్ (రసాయనం నుంచి పొగ రావడానికి) ఉపయోగించాలి. ఒక సాధారణ పంచాయతీకి ఏడు వారాలకు రూ.20-30 వేల వరకు ఖర్చవుతుంది. పెద్ద పంచాయతీలైతే రూ.50 వేలపైనే వెచ్చించాలి. కింగ్ ఫాగ్ ఆయిల్‌తో పాటు మొలాథియన్‌ను వినియోగించాల్సి ఉన్నందున అంత మొత్తంలో వెచ్చించలేక ఎవరూ వాడటం లేదు.

**ఇవీ లోపాలు**

హైపర్, కన్జంప్షన్ నవనాలతో కూడిన యంత్రాలు కావడంతో ఉపయోగించే విధానంపై సిబ్బందికి తగిన శిక్షణ, నైపుణ్యం లేదు. సాంకేతిక సమస్యలతో పాటు, బాగు చేసే వారు లేకపోవడంతో కొన్ని చోట్ల వృథాగా ఉన్నాయి. పెట్రోల్ ఎక్కువైతే యంత్రం గొట్టం నుంచి మంటలు వ్యాపిస్తున్నాయనే ఫిర్యాదులున్నాయి.

**అమలులోకి తెస్తాం..** జిల్లాలో అన్ని పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలున్నాయి. వ్యయంతో కూడుకున్నందున వాటిని సక్రమంగా వినియోగించలేదు. గ్రామాల్లో పొగబెడితే దోమలు పొలాల్లోకి వెళ్లిపోయి పొగ తగ్గాక మళ్లీ వస్తున్నాయి. దీంతో దోమలను పూర్తిగా నివారించడం సాధ్యం కావడం లేదు. అయినా ఫాగింగ్ చేయిస్తాం. హరిప్రసాద్‌రెడ్డి, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్

# నరం పట్టలేరు.. సూది గుచ్చలేరు

అనకాపల్లి : జిల్లాలోనిఏడు కళాశాలల నుంచి ఎంపీహెచ్‌డబ్ల్యూ, నర్సింగ్ కోర్సులు చేస్తున్న 483 మంది విద్యార్థులకు అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో శిక్షణ ఇస్తున్నారు. రోగులకు అందించాల్సిన సేవలపై విభాగాల వారీగా నర్సులు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. క్లీనికల్ శిక్షణ మూడు నెలలపాటు ఉంటుంది. ఈ శిక్షణ 146 మంది విద్యార్థులు తీసుకుంటున్నారు. ఏడాదిపాటు అప్రెంటిస్ ఉంటుంది. వీరు 286 మంది ఉన్నారు. ఆసుపత్రిలో వీరితోనే చాలా వరకు పనులు చేయిస్తున్నారు. రోగికి ఏదైనా జరిగితే బాధ్యులు ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది.

చోడవరానికి చెందిన ఓ వ్యక్తిని పాము కాటేసింది. కుటుంబ సభ్యులు అనకాపల్లి ఆసుపత్రికి తీసుకువచ్చారు. వార్డులో ఆయనకు సెలైన్ ఎక్కించేందుకు శిక్షణ విద్యార్థులు నరం కోసం పదిసార్లు యత్నించారు. చివరకు స్టాఫ్ నర్సు వచ్చి నరానికి సూది గుచ్చి సెలైన్ పెట్టారు.

జిల్లా ఆసుపత్రిలో ఓపీ, వార్డుల్లో ఉన్న రోగులకు ఈసీజీ, రక్తపరీక్షలు, ఇంజెక్షన్లు చేయడంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ, నర్సింగ్ కోర్సులు చేసే విద్యార్థులకు ఆసుపత్రుల్లో అందించాల్సిన శిక్షణలో భాగంగా వీరికి స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల పర్యవేక్షణలో అవగాహన కల్పించాలి. అనకాపల్లి ఆసుపత్రిలో విద్యార్థులతోనే అన్ని పనులు చేయిస్తూ సిబ్బంది సేదతీరుతున్నారు.

వైద్యుడు రోగిని పరీక్షించిన తర్వాత నర్సులే సేవలందించాలి. గతంలో నర్సుల కొరత ఉండేది. వార్డుల్లో, ఓపీల్లో సేవలు అందించేందుకు శిక్షణ విద్యార్థులను వినియోగించే వారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 37 మంది నర్సులు, ఆరుగురు హెడ్ నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఒకరున్నారు. విద్యార్థులు వీరి పర్యవేక్షణలోనే రోగులకు సేవలందించాలి. జిల్లా ఆసుపత్రిలో ఇవేమీ అమలు కావడం లేదు. వైద్యుల పర్యవేక్షణా లేదు.

ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయవచ్చు - డాక్టర్ శ్రీనివాసరావు, డీసీహెచ్‌ఎస్

ఆసుపత్రిలో విద్యార్థులకు నర్సుల పర్యవేక్షణలోనే శిక్షణ ఇస్తున్నాం. రోగులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు. విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

## మగాడిని బాధితుడిగా చూపిస్తేనే భారతదేశంలో సినిమాలు ఆడతాయి!

సినిమాలు, రాజకీయాలపై బాలీవుడ్ నటి స్వరాభాస్కర్ వివాదాస్పద వ్యాఖ్యలు నిరంతరం హెడ్ లైన్స్‌లోకొస్తున్న సంగతి తెలిసిందే. గతంలో రాంజానా సినిమాలో మేల్ బాధిత కార్డ్ గురించి బహిరంగంగా మాట్లాడి తీవ్రమైన విమర్శల్ని ఎదుర్కొంది. వీలున్న ప్రతి వేదికపైనా ఫెమినిజాన్ని చూపించబోయి, కెరీర్ లో చాలా మంచి అవకాశాలను కోల్పోయింది స్వరా. ఈ నిజాన్ని తాను అంగీకరించేందుకు వెనకాడదు. చాలా మంది నిర్మాతలు స్వరాను దూరం పెట్టారు. చాలా బ్రాండ్లు కూడా స్వరాతో ప్రచారం చేయించుకునేందుకు వెనకాడాయి. ముక్కుసూటితనం, ఫెమినిజం కారణంగా ఈ ప్రతిభావంతురాలైన నటి చిక్కుల్లో పడింది. ఇప్పుడు మరోసారి స్వరా భాస్కర్ సూటిగా భారతీయ సినిమాల్లో లోపాలను విమర్శించింది. మగాడిని బాధితుడిగా చూపిస్తేనే ఇక్కడ సినిమాలు చూస్తారని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ లోపాన్ని తాను రాంజానా సినిమా చేస్తున్నప్పుడే గుర్తించానని, ఆ తర్వాత మీడియా సమావేశంలో జర్నలిస్టు నుంచి ఇలాంటి ప్రశ్న ఎదురైనప్పుడు దర్శకరచయితలను సమాధానం



ఇవ్వొద్దని హెచ్చరించానని కూడా స్వరా చెప్పింది. రచయిత హిమాన్షు ప్రతిభావంతుడైన రచయిత అని, ఆనంద్ ఎల్ రాయ్ అద్భుతంగా తెరపై కథానాయకుడిని చూపిస్తారని పేర్కొంది. కేవలం రాంజానా (ధనుష్, సోనమ్ ఇతర నటీనటులు) మాత్రమే కాదు.. ఇతర హిట్ సినిమాల్లోను ఇలాంటి లోపాలున్నాయని స్వరా పేర్కొంది. భారతదేశం నస్కతుయే ఆషిక్ సినిమాలతో నిండి ఉందని నేను మీకు చెప్పగలనా? మీకు కావలసినది మీరు చేయండి.. ఇది మగాళ్లకు ఇష్టమైన విషయం అని నేను భావిస్తున్నాను.. వారు బాధితులుగా ఉండాలని కోరుకుంటారు. ఏదో ఒక విధంగా బాధితుడి పాత్రను పోషించడానికి ఒక మార్గాన్ని కనుగొంటారు... అని స్వరా ఘాటుగానే విమర్శించింది. చరిత్రలో మన హిట్ సినిమాలన్నీ చూస్తే.., రాంఝనాలో పేదవాడు చివరికి చనిపోతాడు. సయ్యారా చూస్తే, పేదవాడు ప్రేమలో పడతాడు కానీ అమ్మాయి వేరొకరి పేరును చెబుతుంది! కాస్త పాతకాలంలోకి వెళితే.. దేవదాస్ (ప్రియురాలి బాధితుడు) లాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి... ప్రతి పెద్ద హిట్ సినిమా.. పురుషుడినే బాధితుడిగా చూపిస్తుంది! అని పేర్కొంది స్వరా.

## సినిమా కథను తలపించేలా అలనాటి హీరోయిన్ లవ్ స్టోరీ

ఆరేళ్ల వయసు నుంచే యాక్టింగ్ లో ఓనమాలు నేర్చుకుని చైల్డ్ ఆర్టిస్టుగా ఎన్నో సినిమాల్లో నటించారు సీనియర్ హీరోయిన్ రాశీ. హీరోయిన్ గా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఎన్నో సినిమాలు చేశారు రాశీ. 90స్ టైమ్ లో రాశీ స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగారు. రీసెంట్ గా సీరియల్స్ లో నటిస్తున్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన లవ్‌స్టోరీని రివీల్ చేసి అందరికీ షాకిచ్చారు.


**ఏడ్చే అబ్బాయిలు సెన్సిటివ్...** పర్సనల్ లైఫ్ ను ఇప్పటివరకు ప్రైవేట్ గానే ఉంచిన రాశీ తాజాగా తన లవ్‌స్టోరీని బయటపెట్టి అందరికీ తెలిసేలా చేశారు. రాజేంద్రప్రసాద్ తో కలిసి తాను ఓ సినిమా చేస్తున్నప్పుడు శ్రీనివాస్ ఆ సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్ అని, అక్కడే ఆయన్ని కలిశానని, శ్రీమంతం సీన్ జరుగుతున్నప్పుడు అది చూసి అతను ఏడ్చాడని, ఏడ్చే అబ్బాయిలు చాలా సెన్సిటివ్ అని, ఫ్యామిలీని చాలా బాగా చూసుకుంటారనిపించిందని చెప్పారు రాశీ.



**ఫోన్ చేసి పెళ్లి చేసుకుంటావా అని అడిగా...** అలా ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడిందని, సెట్స్ లో అతన్ని బాగా టీజ్ చేసేదాన్నని, అలా ఓ రోజు ఎక్కువగా ఏడ్పించడంతో సారీ చెప్దామని నెంబర్ తీసుకుని ఫోన్ చేసి నన్ను పెళ్లి చేసుకుంటారా అని అడిగానని, శ్రీనివాస్ ఆ విషయాన్ని కూడా జోక్ అనుకుని వెంటనే ఎస్ చెప్పారని, తర్వాత కలిసి మళ్లీ అడిగినప్పుడే నిజమా అని షాకయ్యారని చెప్పారు రాశీ. శ్రీనివాస్ ను పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెప్పినప్పుడు అందరూ షాకయ్యారని, కానీ చివరకు తన తల్లి మాత్రం ఒప్పుకున్నట్టు రాశీ చెప్పుకొచ్చారు. పరిచయమైన నెల రోజులకే ఇద్దరం పెళ్లి చేసుకున్నామని, పెళ్లి కూడా తమ ఇంట్లోనే ఎలాంటి ఆర్భాటం లేకుండా జరిగిందని ఆమె చెప్పారు. ఆ రోజుల్లో షూటింగ్ టైమ్ లో జరిగిన ఫన్నీ మూమెంట్స్ ను కూడా రాశీ బయటపెట్టారు. షూట్ స్టార్టింగ్ లో తన స్టాఫ్ ఇంకా రాకపోవడంతో అసిస్టెంట్ డైరెక్టర్ వచ్చి ఇంకా రెడీ అవలేదా అంటూ స్క్రిప్ట్ ఇచ్చారని, తీరా చూస్తే స్క్రిప్ట్ లో ఆ సీన్ లో తన డైలాగ్స్ లేకపోవడం చూసి వెళ్లిపోయారని, తర్వాత కొంచెం క్లోజ్ అయ్యాక ఆ రోజు ఎందుకొచ్చావని అడిగితే మీ లాంటి హీరోయిన్ ను దగ్గర్నుంచి చూడాలనిపించి వచ్చానని చెప్పారన్నారు. రాశీ తమ లవ్ స్టోరీని, ఆ టైమ్ లో జరిగిన సంఘటనలను బయటపెట్టడంతో ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. స్వయంగా హీరోయినే, అసిస్టెంట్ డైరెక్టర్ కు ప్రపోజ్ చేసి పెళ్లి చేసుకుందామని అడగడం, ప్రపోజ్ చేసుకున్న తర్వాత నెల రోజుల్లోనే పెళ్లి చేసుకోవడం, ఇదంతా ఓ సినిమా కథలా ఉందంటూ నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.




## ప్రశాంత్ వర్మ మూవీ.. ఓ లీక్ ఇచ్చిన హీరో



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. హనుమాన్ మూవీతో ఎలాంటి హిట్ అందుకున్నారో అందరికీ తెలిసిందే. యువ నటుడు తేజ సజ్జా లీడ్ రోల్ లో నటించిన ఆ సినిమాను సూపర్ హీరో కథకు ఇతిహాసాన్ని ముడిపెట్టి ప్రశాంత్ వర్మ తెరకెక్కించారు. సిల్వర్ స్క్రీన్ పై మ్యాజిక్ చేసి మంచి విజయాన్ని అందుకున్నారు. అప్పుడే హనుమాన్ ను సీక్వెల్ గా జై హనుమాన్ ఉంటుందని ప్రకటించారు. తన ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా సినిమా వస్తుందని తెలిపారు. హనుమాన్ మూవీకి మించి వంద రెట్లు భారీ స్థాయిలో జై హనుమాన్ ఉంటుందని చెప్పడంతో ఇప్పటకే ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఎంతో ఆసక్తితో వెయిట్ చేస్తున్నారు. విజువల్ వండర్ గా ఉండనున్న ఆ సినిమాలో కన్నడ నటుడు రిషబ్ శెట్టి లీడ్ రోల్ లో కనిపించనున్నారు. తేజ సజ్జా కూడా యాక్ట్ చేస్తున్నారు. అయితే వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ అవుతుందని అప్పట్లో ప్రశాంత్ వర్మ చెప్పినా.. ఇంకా షూటింగ్ కూడా మొదలుకాలేదు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుతున్నారు ప్రశాంత్ వర్మ. రీసెంట్ గా తేజ సజ్జా ఆ సినిమా అప్డేట్ ఇచ్చిన సంగతి విదితమే. ప్రశాంత్ వర్మ, రిషబ్ శెట్టి ఇద్దరూ వారి ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారని చెప్పారు. వాళ్ల చేతిలోని చిత్రాలు అయిపోయాక జై హనుమాన్ పనులు స్టార్ట్ అవుతాయని చెప్పారు. ఇప్పుడు రిషబ్ శెట్టి తన అప్ కమింగ్ మూవీ కాంతార ప్రీక్వెల్ ప్రమోషన్స్ లో మరో అప్డేట్ ఇచ్చారు. కాంతార చాప్టర్-1 మరికొద్ది రోజుల్లో రిలీజ్ కానుండగా.. ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు రిషబ్. అందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో జై హనుమాన్ కోసం మాట్లాడారు. కాంతార: చాప్టర్ 1 విడుదలకు ముందు తాను ఏ సినిమాకు కమిట్ అవ్వాలనుకోలేదని చెప్పారు. కానీ ప్రశాంత్ వర్మ తనకు జై హనుమాన్ కథ చెప్పారని అన్నారు. అది విన్న వెంటనే జై హనుమాన్ ప్రాజెక్టుకు సంతకం చేశానని, అద్భుతమైన స్క్రిప్ట్ అని తెలిపారు. కథ చాలా ఆసక్తికరంగా ఉండగా.. ఇప్పటికే ఫోటోషూట్ పూర్తి చేశామని చెప్పారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని అన్నారు. త్వరలో జై హనుమాన్ షూటింగ్ ప్రారంభించడానికి తేదీని నిర్ణయిస్తామని వెల్లడించారు. దీంతో మరికొద్ది రోజుల్లో షూటింగ్ మొదలవ్వనున్నట్లు తెలుస్తోంది.

## ది ట్రయల్: సీజన్ 2 టాక్ ఎలా ఉంది?



ఈ మధ్య కాలంలో లీగల్ బ్యాక్ డ్రాప్ లో వచ్చిన వెబ్ సీరీస్ లకి మంచి రెస్పాన్స్ వస్తోంది. కానీ వాటిలో గుర్తిండిపోయేవి తక్కువ. ఇక లేటెస్ట్ గా ది ట్రయల్ అనే ప్రాజెక్ట్ కూడా వచ్చింది. మొదటి సీజన్‌తో పెద్దగా అంచనాలు పెంచుకోలేకపోయినా, ఆడియన్స్ దృష్టిని ఆకర్షించగలిగింది. అదే కారణంగా రెండో సీజన్‌ని జియో హాట్‌స్టార్ ముందుకు తెచ్చింది. ఈసారి మొత్తం ఆరు ఎపిసోడ్‌లు, దాదాపు 4 గంటల 40 నిమిషాల కంటెంట్‌తో స్ట్రీమింగ్‌లోకి వచ్చింది. రెండో సీజన్‌లో కథ నేరుగా నోయనికా, రాజీవ్ మధ్య జరుగుతున్న సంబంధాల సంక్షోభం నుంచి మొదలవుతుంది. ఒకవైపు తన ఇమేజ్ క్లీనప్ కోసం రాజకీయాల్లోకి దూసుకెళ్లే రాజీవ్, మరోవైపు లా ఫర్మ్‌లో నోయనికా ఎదుర్కొనే సవాళ్లు, ఈ రెండింటి మధ్య నడుస్తున్న లవ్ హేట్ ట్రాక్ ఈ సీజన్‌కి మేజర్ పాయింట్ గా నిలుస్తుంది. కొత్త కేసులు, కొత్త సమస్యలు, కొత్త డైలమాస్ ఈసారి సిరీస్‌కి మరింత వేగాన్ని తెచ్చాయి. ముఖ్యంగా లా ఫర్మ్‌లో వచ్చే కేసులు, వాటి సొసైటల్ యాంగిల్ ఆడియన్స్‌ని ఆకట్టుకునేలా రాసుకున్నారు. రియల్ ఎస్టేట్ బిల్డర్ నిర్లక్ష్యంతో ఓ చిన్నారి ప్రాణం పోవడం, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌తో జరిగే యాక్సిడెంట్, మసాజ్ పార్లర్‌లో ఉద్యోగిని లైంగికంగా వేధించే వ్యక్తిపై కేసు.. ఇవన్నీ కథలో బలమైన పాయింట్లు. కానీ కోర్ట్ రూమ్ సన్నివేశాలు కచ్చితమైన పంచ్ లేకపోవడం వల్ల అసలైన ఎఫెక్ట్ రాలేదు. ట్విస్ట్‌లు ఉన్నప్పటికీ, క్లైమాక్స్‌లు చాలా ఈజీగా రాసుకున్నట్టుగా అనిపిస్తాయి. రాజకీయ రంగంలో నారాయణి వర్సెస్ రాజీవ్ పోటీని చూపించిన తీరు కూడా మరింత హ్యూమన్‌గా ఉండి ఉంటే బాగుండేది. కానీ ఇక్కడ కూడా చాలా సర్ఫేస్ లెవెల్ ట్రీట్‌మెంట్‌నే కనిపిస్తుంది. అయితే మహిళలపై రాజకీయాల్లో జరిగే క్యారెక్టర్ అససినేషన్, పాడ్‌కాస్ట్‌ల ద్వారా ఇమేజ్ బిల్డప్ వంటి పాయింట్లు మాత్రం ఆకట్టుకుంటాయి. అదే సమయంలో నోయనికా తన వ్యక్తిగత జీవితంలో విభజన, వృత్తి జీవితంలో తీసుకోవాల్సిన కఠిన నిర్ణయాలు ఈ సీజన్‌లో మరింత హైలైట్ అయ్యాయి. నటీనటుల గురించి చెప్పాలంటే కాజోల్ ఈసారి కూడా పూర్తి స్థాయిలో ప్రభావితం చేయలేకపోయారు. ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యేలా కాకుండా, ఒక సమస్య నుంచి మరోదాంట్లోకి పరుగులు పెట్టినట్టే కనిపించారు. జిషు సేంగుప్తా నటన బాగుంది కానీ రోల్ మరింత బలంగా రాసి ఉంటే ఇంకా ఇంపాక్ట్ ఉండేది. సోనాలి కుల్కర్ణి చేసిన నారాయణి పాత్రకు కొంత ఫైర్ ఉన్నప్పటికీ రాయడంలో బలం తగ్గింది. షీబా చద్దా, కుబ్రా సైత్ లాంటి వారు పాత్రలకి తమ వంతు న్యాయం చేశారు. టెక్నికల్‌గా చూస్తే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అవసరమైన చోట టెన్షన్‌ను బిల్డ్ చేసినా, అంతగా ప్రత్యేకత లేదు. సినిమాటోగ్రఫీ సాదాసీదాగా ఉన్నా సన్నివేశాలకు న్యాయం చేసింది. పేస్ బాగానే ఉన్నా, ఎక్కడా ఆగి ఎమోషన్‌ని రిజిస్టర్ చేయకుండా దూసుకెళ్లిపోవడం వల్ల కనెక్ట్ తగ్గింది. మొత్తం మీద ది ట్రయల్ సీజన్ 2 మొదటి సీజన్ కంటే కాస్త బెటర్ అనిపించినా, ఇప్పటికీ పెద్దగా గుర్తుండిపోయేలా కంటెంట్ ఏమి ఇవ్వలేకపోయింది. లీగల్ డ్రామాలంటే ఇష్టం ఉన్నవారు టైమ్ పాస్ కోసం చూడొచ్చు.

## ఎరుపు చీరలో శ్రద్ధా కపూర్ కిల్లర్ లుక్స్

బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి తన కొత్త లుక్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటూ ఉంటుంది. లేటెస్ట్ గా ఎరుపు రంగు చీరలో ఆమె షేర్ చేసిన ఫోటోలు ట్రెండింగ్‌లో ఉన్నాయి. సింపుల్ జువెలరీ, లైట్ మేకప్, క్లాసీ హేర్ స్టైల్‌తో ఆమె గ్లామర్ గర్ల్ గా మెరిసింది. ఎరుపు రంగు చీరలో ఆమె కిల్లర్ లుక్స్ ప్రత్యేకంగా ఆకట్టుకోవడం ఫోటోలకు మరింత లైఫ్ ఇచ్చింది. శ్రద్ధా కెరీర్ విషయానికి వస్తే, రొమాంటిక్ సినిమాల నుంచి యాక్షన్ ఎంటర్టైనర్స్ వరకు విభిన్న పాత్రల్లో ఆమె తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆషికీ 2తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న ఆమె, ఆ తర్వాత ఏబీసీడి 2, హాఫ్ గర్ల్‌ఫ్రెండ్, సాహెూ వంటి చిత్రాల్లో నటించింది. ముఖ్యంగా ప్రాభాస్ సరసన వచ్చిన సాహెూలో ఆమె పాత్ర తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ చేసింది. ఆమధ్య వచ్చిన తూ ఝూటీ మైన్ మక్కార్లో కూడా శ్రద్ధా



ఎనర్జిటిక్ యాక్టింగ్‌తో బాగానే ఆకట్టుకుంది. రన్‌బీర్ కపూర్‌తో చేసిన ఆ సినిమా మ్యూజికల్ ఎంటర్టైనర్‌గా మంచి హిట్టయింది. ఇక హారర్ మూవీ స్త్రీ2తో మరో బిగ్ హిట్ అందుకుంది. ప్రస్తుతం ఆమె చేతిలో కొన్ని లేడి ఓరియెంటెడ్ ప్రాజెక్టులు ఉన్నాయని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ క్రమంలో ఆమె కొత్త లుక్స్, ఫొటోషూట్లు ఫ్యాన్స్‌ను బాగా కనెక్ట్ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో శ్రద్ధా షేర్ చేసిన ఈ ఎరుపు చీర ఫోటోలు అభిమానుల నుంచి భారీ రెస్పాన్స్ అందుకుంటున్నాయి. క్వీన్ ఆఫ్ బ్యూటీ అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. రెండు గంటల్లోనే లక్షల లైక్స్ రావడం చూస్తే ఆమె క్రేజ్ ఎంత ఉందో అర్థమవుతుంది. ప్రతి ఫోటోలోనూ గ్లామర్ ను మిక్స్ చేస్తూ ముందుకు సాగుతున్న ఆమె, రాబోయే ప్రాజెక్ట్స్‌తో మరోసారి ప్రేక్షకులను తన వైపు తిప్పుకునే అవకాశం ఉంది.

## పన్నీర్ ఆర్డర్ చేస్తే చికెన్ వచ్చింది.. రెస్టారెంట్ తీరుపై నటి ఫైర్!

సాధారణంగా రెస్టారెంట్ల విషయంపై ఎక్కువగా ఏవేవో వార్తలు వినిపిస్తుంటాయి. ముఖ్యంగా బిర్యానీలో బొద్దింకలు, బల్లులు రావడం ఇలా తరచూ వార్తలలో నిలుస్తూనే ఉంటుంది. అలాగే ఫుడ్ డెలివరీ విషయంలో కూడా చాలామంది గందరగోళం సృష్టిస్తున్నారు. ముఖ్యంగా ఒకటి ఆర్డర్ చేస్తే మరొకటి రావడం చాలా సందర్భాలలో మనం చూసే ఉన్నాము. అయితే ఇది సామాన్యులకే కాదు సెలబ్రిటీలకు కూడా ఈ బాధలు తప్పడం లేదు. ఇప్పుడు తాజాగా కోలీవుడ్ హీరోయిన్ కి కూడా ఒక ఊహించని షాక్ తగిలినట్లు తెలుస్తోంది. తన జీవితంలో ఎప్పుడూ కూడా నాన్ వెజ్ తినని హీరోయిన్ చేత కూడా చికెన్ తినిపించేలా చేశారంటూ ఆమె ఆవేదనను తెలియజేస్తోంది. మరి ఆ హీరోయిన్ ఎవరో ఇప్పుడు ఒకసారి చూద్దాం. ఆమె ఎవరో కాదు కోలీవుడ్ హీరోయిన్ సాక్షి అగర్వాల్.. తాజాగా పన్నీర్ బిర్యానీ తినాలని ఆన్ లైన్ వెబ్ సైట్ స్విగ్గీ లో ఆర్డర్ చేయగా.. ఒక రెస్టారెంట్ నిర్లక్ష్యం కారణంగా తనకు పన్నీర్ బిర్యానీకి బదులు చికెన్ బిర్యానీ పంపించారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. చాలా ఆకలిగా



ఉండడంతో.. పన్నీర్ బిర్యానీ అనుకుని తినేసిందట. అయితే సగం తిన్నాక ఆమెకు అర్థమైంది ఏమిటంటే.. అది పన్నీరు బిర్యానీ కాదు చికెన్ బిర్యానీ అని తెలిసి ఒక్కసారిగా షాక్ అయ్యాను అంటూ తెలియజేసింది. తన జీవితంలో నాన్ వెజ్ తినలేదని, అలాంటి తనతో ఇలా చికెన్ తినిపించేలా చేశారంటూ ఆమె సోషల్ మీడియా వేదికగా ఆవేదనను తెలియజేస్తూ ఒక పోస్ట్ షేర్ చేసింది సాక్షి అగర్వాల్. ఈ విషయం విన్న అభిమానులు అయ్యో ఎంత పని జరిగింది సాక్షి అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సాక్షి అగర్వాల్ తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా సుపరిచితమే. ఎందుకంటే తమిళంలో నుంచి డబ్బింగ్ అయ్యే చిత్రాలు తెలుగులో విడుదల అవ్వడం చేత మంచి పాపులారిటీ సంపాదించుకుంది. సాక్షి అగర్వాల్ సినిమాల విషయానికి వస్తే.. కోలీవుడ్ లో పలు చిత్రాలలో నటించి బాగానే క్రేజ్ సంపాదించింది. రాజా రాణి అనే సినిమా ద్వారా అతిథి పాత్రతో ప్రేక్షకులకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత సాఫ్ట్వేర్ గండ అనే కన్నడ సినిమాలో కూడా నటించింది. ఆ తర్వాత వరుసగా తమిళ్ సినిమాలలో నటిస్తూ ప్రేక్షకులను మెప్పించిన ఈమె.. నేరుగా తెలుగులో ఒక్క సినిమా కూడా చేయలేదని చెప్పవచ్చు. గత కొన్ని రోజులుగా ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె వెబ్ సిరీస్, మ్యూజిక్ వీడియోలలో కూడా కనిపిస్తూ ఆకట్టుకుంటుంది. 2019లో యాక్షన్ అనే సినిమాకి డబ్బింగ్ ఆర్టిస్ట్ గా కూడా పనిచేసింది. అంతేకాదు బిగ్ బాస్ తమిళ్ సీజన్ 3 లో కంటెస్టెంట్ గా కూడా పాల్గొన్న ఈమె 49వ రోజే హౌస్ నుంచి బయటకు వచ్చేసింది. ఈ ఏడాది మలయాళంలో బెస్ట్ అనే సినిమాతో రింగ్ రింగ్, ఫైర్, ది కేస్ డైరీ వంటి చిత్రాలలో నటించింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536